


# 1

[చిన్న పెంకుటిల్లు—చేతిలో సామాన్లు క్రింద పెట్టి నుదుట పట్టిన చెమట తుడుచు కుంటూంది రుక్మిణి — వయసు దాదాపు అరవై—కళ్ళజోడు—నెరసిన జుట్టు—కొద్దిగా వంగిన నడుము—అప్పుడే బయటనుండి వీణాధరికూడా లోపలికొస్తుంది—చేతిలో చిన్న పేకెట్టు—వయసు ఇరవై—తీర్చి దిద్దిన అంగసౌష్టవం—ముఖంలో ఏదో అసాధారణమైన ఆకర్షణ]

రుక్మిణి:—ఇదిగో! తువ్వాలు కొన్నాను. చూసావా? బేరమాడి చవగ్గా కొన్నాను—పొందిక....

వీణా:—తువ్వాలు నన్ను తెమ్మన్నావుగా! నేనూ తెచ్చాను. ఇదిగో!

రుక్మి:—తెచ్చావూ? దండుగ? దండుగయిపోతోంది. సాధారణంగా నేనేం చెప్పినా మరిచి పోతావుకదే! ఇప్పుడెలా గుర్తుందీ! బేర మాడకుండా కొన్నావు కదూ! అవునులే! మీకు డబ్బు విలువ ఏం తెలుస్తుంది? చీమలా కూడ బెడ్తున్నాను కనుక నాకు తెలుస్తుంది. నేను చూడు! షాపువాడు నాలుగురూపాయలు చెప్పాడు. బేరమాడి రెండు రూపాయలకు కొన్నాను. పొందిక నేర్చుకోవాలి.

వీణా:—నేను కొన్న తువ్వాలు రూపాయిన్నర. నేత తువ్వాళ్ళు అంతకంటే ఖరీదు ఉండవు.

రుక్మి:—ఆ!........నువ్వు బేరమాడావా?

వీణా:—బేరమాడలేదు. బేరాలు లేకుండా కచ్చితమైన ధర చెప్పమన్నాను. చెప్పాడు, కొన్నాను.

రుక్మి:—నీమొహం! నీకు తెలీదు. ఇందులో ఏదో మోసముంటుంది. వాడేదో నిలవసరుకు అంటగట్టి ఉంటాడు. ఈ వంకాయలు చూడు. కిలో పావలా! ఇంత చవగ్గా ఎక్కడైనా దొరుకుతున్నాయా?

వీణా:—(వంకాయలు చూపి విభ్రాంతితో) పిన్నీ! ఎందుకీ వంకాయలు? పుచ్చువీ—ముదురువీ—ఏం చేసుకోవాలి? పైగా ఇన్ని దేనికి?

రుక్మి:—చవగ్గా వచ్చాయని నాలుగు కిలోలు కొన్నాను. కూలివాడికి అర్ధరూపాయి ఇచ్చుకోవలసి వచ్చిందనుకో! అయినా చవగ్గా....

వీణా:—పుచ్చు వంకాయలకు రూపాయి—కూలివాడికిఅర్ధరూపాయి ఇవి పారేయించటానికి కూలి మరో అర్ధరూపాయి—కిలో డెబ్బయి అయిదు పైసలకి లేత వంకాయలు మంచివి వస్తోంటే....

రుక్మి:—డెబ్బయిఅయిదు పైసలే! ఒక్క కిలోకి—ఖర్చుపెట్టను నేను? మీ కెవ్వరికీ పొందిక తెలియదు. పొందిగ్గా....

వీణా:—పిన్నీ! నీకు పుణ్యం ఉంటుంది. నువ్వీ పొందిక మాట మరచిపోదూ! సగం దూబరా తగ్గుతుంది.

రుక్మి:—మరిచి పోతానే! మరిచిపోతాను—ఇప్పుడింత దానివయి నాకు చెపుతున్నావు. ఎంత పొందిగ్గా ఉండకపోతే, ఎంత కష్ట పడకపోతే, మీ రింతవాళ్ళయ్యారే! మీ అమ్మ ఇంతింత వాళ్ళని నామీద వదిలేసి వెళ్ళిపోయింది. కుట్టు టీచర్‌గా నెలకు ఎనభై రూపాయలు జీతం నాకు—ముగ్గురు పిల్లలు ఎంత కష్టపడి ...

వీణా:—క్షమించు పిన్నీ! నువ్వు మాకోసం ఎంత కష్ట పడ్డావో నాకు తెలియక కాదు—కానీ....

రుక్మి:—వీణా! నామాట వినవే! ప్రభాకరరావు గారిని పెళ్ళిచేసుకో! అప్పుడిక నాకు పొందిక గురించి ఆలోచించవలసిన అవసరమే ఉండదు.

వీణా —(కోపంగా) పిన్నీ! ఆ ప్రస్తావన నా దగ్గిర తేవద్దని ఎన్ని సార్లు చెప్పాలి?

రుక్మి:—(వీణాధరి కోపానికి రెచ్చిపోతుంది) సరే! ఇంక అడగను. పిచ్చి మాలోకాన్ని-అందరూ నాలాగేఅనుకుంటాను. ముగ్గురు పిల్లల్నినా మీద వదిలేసి అక్క చచ్చిపోతే, పెళ్ళికూడా మానుకుని కడుపు కట్టుకుని మిమ్మల్నందరినీ........?

వీణా:—నాకు తెలుసు పిన్నీ! అదంతా తప్పకు.......

రుక్మి:—ఏం? విని సహించలేవా? నాలా నిన్ను పెళ్ళి మానుకోమన లేదు. దరిద్రం అనుభవించమనలేదు. కోరి నిన్ను చేసుకుంటా నన్న వ్యక్తిని—మన కుటుంబాన్ని ఆదుకోడానికి సిద్ధంగా ఉన్న వ్యక్తిని పెళ్లిచేసుకుని సుఖపడ మంటున్నాను....

వీణా:—సుఖం! ప్రభాకర రావుగారిని పెళ్ళి చేసుకుంటే నేను సుఖ పడతాను!

రుక్మి:—ఎందుకు సుఖపడవు? ఎదిగిన కూతురున్న మాట నిజమే కాని వృద్ధుడుకాడు. బోలెడు డబ్బు.........

వీణా:—నా కక్కర్లేదు.

రుక్మి:—కానీ, మన కుటుంబానికి కావాలి. ఒకరుచేసిన త్యాగానికి ఫలితం అనుభవించగలవే కాని నువ్వు కొంచెమయినా త్యాగం చెయ్యలేవా? అక్క పిల్లలకోసం బ్రతుకంతా బండరాయిలా గడి పాను. సొంత చెల్లెళ్ళ కోసం తమ్ముళ్ళకోసం కోరివస్తున్న పెళ్ళి చేసుకోలేవా?

వీణా:—పిన్నీ! ఎందుకు నన్నిలా క్షోభ పెడ్తావు?

రుక్మి:—క్షోభ పెడ్తున్నానా? అవునేమో! కానీ, నేను పడుతున్న క్షోభ కంటె ఎక్కువైనది కాదు. ఎంత పొందిగ్గా ఉన్నా, ఎన్ని నయాపైసలు ఆదాచేసినా, రేవతి పెళ్ళి చెయ్యగలనా? కృష్ణకు కాలేజి జీతాలు గుమ్మరించగలనా? మనుష్యులింత స్వార్థపరులుగా ఎలా ఉండగలరో అర్థం కాదు. అందరూ ఎవరి సుఖం వారు చూసుకుంటే....

వీణా:—పిన్నీ! నీకు పుణ్యం ఉంటుంది. ఇంక మాట్లాడకు పిన్నీ.

(కన్నీళ్ళతో చేతులు జోడిస్తుంది)

* * *

(పచ్చిక మైదానం—వీణాధరి, రఘు కూర్చొని ఉంటారు)

వీణా:—నువ్విలా మౌనంగా ఉంటే భరించలేను రఘూ! ఏదైనా మాట్లాడు.

రఘు:—(ఉదాసీనంగా నవ్వి) ఏం మాట్లాడను? శుభాకాంక్షలు చెప్పనా? అత్తవారింట మెలగవలసిన రీతులు బోధించనా?

వీణా:—నీకు వేళాకోళంగా ఉందా?

రఘు:—భరింపరాని వ్యథ కలిగినప్పుడు దానిని హాస్యంగా మార్చు కుని నన్ను నేను ఓదార్చుకోవటం అలవాటు.

వీణా:—ఒకటి మాత్రం నిజం. నేను ఎవరిని పెళ్ళి చేసుకున్నా నా మనసులో నిలిచేది మాత్రం నువ్వే!

రఘు:—అలా మాట్లాడే అధికారం నీకు లేదు వీణా? పెళ్ళంటే అర్థం తెలీనిదానిలా మాట్లాడకు!

వీణా:—ఏం? పవిత్రభారత నారీ ధర్మాన్ని ఉపదేశిస్తావా.

రఘు:—నారి కయినా, నరుని కయినా, భారత దేశంలో నయినా మరోదేశంలోనయినా వివాహ బంధం విచిత్ర బంధం—నీ ఇష్టా యిష్టాలతో ఏ ప్రమేయమూ లేకుండా ఏదో అదృశ్య హస్తం అడుగడుగునా ఆ బంధం ఛేదింపబడకుండా నీకు అడ్డుపడుతూనే వుంటుంది.

వీణా:—ఆహా! అంటే ఈలోకంలో దంపతులందరూ పరమ పవి త్రంగా సుఖపడుతున్నారందూ!

రఘు :—పవిత్రాపవిత్రతల సంగతి చెప్పటంలేదు. కష్టసుఖాల గురించి మాట్లాడటం లేదు. మానవ సమాజంలో కుటుంబ వ్యవస్థ ఛేదింపరాని దంటున్నాను.

వీణా :—కానీ, వ్యక్తిగతమయిన ఇష్టాయిష్టాలు ఉంటూనే ఉంటాయి గదా!

రఘు :—ఉంటాయి—నీ వ్యక్తిగతమయిన ఇష్టాయిష్టాలను కుటుంబంకోసం అణచుకో గలిగితే నువ్వు సుఖపడతావు, లేదా, కుటుంబ వ్యవస్థే నిన్ను హింసించి లొంగదీసుకుంటుంది. మానవ జీవితంలో ఆ వ్యవస్థకున్న ప్రాధాన్యత అలాంటిది.

వీణా :—రఘూ! నువ్వు నన్ను మరిచిపోగలవా? నన్ను తలవనే తలచవా?

రఘు :—వీణా! ఆశలు, కలలు, వేరు—కర్తవ్యం, జీవితం వేరు. రంగుల కలల్లోంచి జీవితాన్ని చూపి మైమరచిపోవటంకంటె యధార్థాన్ని అర్థం చేసుకోవటానికే, జీవితంతో రాజీపడటానికే ప్రయత్నిస్తాను నేను.

వీణా :—నా ప్రశ్న కిది సమాధానం కాదు.

రఘు :—అర్థం చేసుకోగలిగితే ఇదే సరైన సమాధానం. ఆలోచించీ ప్రయోజనంలేని విషయాలను ఆలోచించకూడదు.

వీణా :—రఘూ! నువ్వు నన్ను సరిగ్గా అర్థం చేసుకోకపోతే నేను బ్రతకలేను. ఆ ప్రభాకరరావుగారి డబ్బుమీద నాకే వ్యామోహమూ లేదు. ఆయనమీద అంతకంటె లేదు. కానీ....

రఘు :—వద్దు! వద్దు! వీణా! మాట్లాడకు. ఆయనను పెళ్ళి చేసు కోవాలని నిర్ణయించుకున్నావు. ఇంక యిలాంటి ఆలోచనలు మనసులోకి రానియ్యకు. నీ మేలుకోరి చెపుతున్నాను.

(చటుక్కున లేచి వెళ్ళిపోబోయాడు. వీణాధరి చెయ్యిపట్టుకుని ఆపుతుంది.)

వీణా :—ఒకటి చెప్పు. ఈ పెళ్ళితో నేను నీకేమీ కాకుండా పోతానా? నిన్ను చూడటానికయినా రానియ్యవా ?

రఘు :—(కదిలిపోయి) నా దగ్గిరకి నిన్ను రావద్దని ఏనాడూ అనలేను వీణా! కానీ నువ్వు రాకుండా ఉండగలిగితేనే ఇద్దరికీ మంచిది.

వీణా :—నా కేదైనా అవసరం కలిగి నీ దగ్గరకొస్తే....

రఘు :—శక్తివంచన లేకుండా సాయం చేస్తాను.

వీణా :—(చెయ్యి వదిలి) వెళ్ళు....

(రఘు రెండడుగులు ముందుకువేసి వెనక్కి చూసాడు. మోకాళ్లలో తల పెట్టుకుని కుమిలిపోతున్న వీణాధరిని చూడలేక మళ్ళీ దగ్గరకు వస్తాడు.)

రఘు : – (వీణాధరి తలమీద చెయ్యివేసి నిమురుతూ) వీణా !

వీణా :—(రఘు చెయ్యి ఆప్యాయంగా చేతులలోకి తీసుకుని చెక్కిలి కానించుకుంటుంది). రఘూ ! ఒక్క క్షణం. నీ చేతిని ఇలాగే నా చేతులలో ఉంచుకోనియ్యి. ఈ మాధుర్యం గుండెల్లో నింపుకుని ఎంతనరకమైనా భరిస్తాను.

రఘు :—వీణా ! మరొక్కసారి ఆలోచించు. నీ నిర్ణయం మార్చుకోలేవా ?

వీణా :—లాభంలేదు రఘూ ! కృతజ్ఞతాపాశపు ఉరిలో బిగుసుకుపోయాను. బాధ్యతల బరువుతో నా ఆశలకు దూరంగా ఒరిగిపోక తప్పదు.

(అంతలో అక్కడకి కుసుమ వస్తుంది. పదహారేళ్ళ వయస్సు. పరికిణీ, వోణి ; అందమైనది. ముఖంలో ఏదో పసితనం, అమాయకత్వం కనిపిస్తుంటాయి. కుసుమను చూడగానే వీణాధరి రఘుచేతిని వదిలేస్తుంది. ముఖంలో స్వేదబిందువులు క్రమ్ముకుంటాయి తొట్రుపాటు కనిపిస్తుంది.)

కుసుమ :—నా స్నేహితులతో కలిసి పార్కుకి వచ్చాను. మీరు కనిపించారు. ఎంత సేపయింది, మీరు వచ్చి ?

వీణా :—(తొట్రుపాటుతో) ఇప్పుడే ! ఇప్పుడిప్పుడు ! ఆ ! అంతా బాగున్నారా ?

కుసుమ :—(నవ్వి) నేను కనిపిస్తూనే ఉన్నానుగా ! నాన్నగారు కులాసాగానే ఉన్నారు. (చిలిపిగా నవ్వి) మీరు అడిగారని చెప్పనా?

వీణా :—(ముఖం పాలిపోతుంది. మాట్లాడదు.)

కుసుమ :—(నవ్వుతూనే) ఎందుకండీ అంత భయం ! మా నాన్నగారు చాలా మంచివారు తెలుసా ?


రఘు :—ఎవరు మీ నాన్నగారు?

కుసుమ :—ప్రభాకరరావుగారు.

రఘు :—ఓ !

కుసుమ :—మరి, మీరు....

వీణా :—(కలిగించుకుని) ఈయన....ఈయన మా బంధువు.



కుసుమ :—అలాగా! వస్తానండీ నా ఫ్రెండ్స్ ఎదురు చూస్తుంటారు. (వెళ్ళిపోతుంది)

(వీణాధరి పైట కొంగుతో ముఖం తుడుచుకుంటుంది.)

రఘు :—వీణా! ఇప్పుడు మనం ఏమీ తప్పు చెయ్యలేదు. ఎందుకంత కంగారుపడ్డావు ? కుసుమతో నన్నుగురించి అబద్ధం ఎందుకు చెప్పావు?

వీణా :—(అప్పటికీ సంభ్రమంనుండి తేరుకోలేక) ఏమో !

రఘు :—ఎందుకో చెప్పనా ! నువ్వు ప్రవేశించబోయే కుటుంబ మర్యాద కాపాడుకోవటానికి నీకు తెలియకుండానే ప్రయత్నించావు. అర్థమయిందా ? వస్తాను.

(రఘు వెళ్ళిపోతాడు. పాలిపోయిన ముఖంతో అతణ్ణి చూస్తూ కూర్చుంటుంది వీణ.)

* * *

(పెంకుటింట్లో హాలు. రేవతి, కృష్ణ హుషారుగా ఉంటారు. వీణాధరి ఉదాసీనంగా కూర్చుంటుంది.)

కృష్ణ :—అక్కయ్యా! నేను బి.యస్‌సి. తో చదువు ఆపెయ్యక్కర్లేదుటగా ! ప్రభాకరరావుగారు నాకు యమ్.యస్‌సి. చెప్పిస్తారుటగా! నిజమేనా అక్కయ్యా!

రేవతి:—నువ్వెంత అదృష్టవంతురాలి వక్కయ్యా ! అంత గొప్పాయన నిన్ను చేసుకొంటా నంటున్నారు. నేనూ నీ అంత అందంగా ఉంటే బాగుండును.

(వీణాధరి పకాలున నవ్వుతుంది.)

రేవతి :—ఎందు కక్కా నవ్వుతావు? అక్కయ్యా ! నా ఫ్రెండ్ మాలతి మంచి జార్జెట్ చీర కొనుక్కుంది. నాకూ అలాంటిది కొనవూ ?

రుక్మిణి :—రేవతీ, బజారుకు నువ్వొక్కదానివీ వెళ్ళకు. బేరం తెలీదు. నేనూ వస్తాను. పొందిక నేర్చుకోవాలి.

రేవతి :—ఇంక పొందిగ్గా ఉండక్కర్లేదు పిన్నీ. అక్కయ్య మనకు కావలసినంత డబ్బిస్తుంది.

రుక్మి :—మరే! అన్నట్లు వీణా; నేనింక రిటైరవుతాను. ఇంట్లోనే కుట్టుకుంటాను నాకొక కుట్టుమిషను కొనిపెట్టవే? మంచి మిషను, బేరంచేసి....

కృష్ణ :—కుట్టుమిషన్లకు బేరాలుండవు పిన్నీ! ఫిక్స్‌డ్ ప్రైసెస్....

రుక్మి :—పోరా! వర్తకులంతా మోసమే చేస్తారు. మనం జాగ్రత్తగా బేరమాడుకోవాలి.

వీణా :—(ఏదో ఆలోచిస్తూ) అవును పిన్నీ! ముందే బేరమాడుకోవాలి.

రుక్మి :—హమ్మయ్య! ఎంత కాలానికి నా మాట ఒప్పుకున్నావే!

వీణా:—ఒప్పుకోక ఏం చెయ్యను పిన్నీ! అమ్మ చిన్నప్పుడే పోతే, నువ్వు కదూ, మమ్మల్ని ఇంతవాళ్ళను చేసింది!

రుక్మి :—ఏదో చేసాను. కష్టపడినందుకు ఫలితం దక్కింది. మీరంతా ప్రయోజకులయ్యారు. ముఖ్యంగా నువ్వు నా బరువు అందుకున్నావు. అదే సంతృప్తి నాకు....

కృష్ణ :—అక్కయ్యా! ఏదైనా సినిమాకు వెళ్దామా?

రేవతి ;—నేనూ వస్తాను....

రుక్మిణి :—నేనూ వస్తాను....

రేవతి :—(అల్లరిగా) పిన్నీ! డబ్బు దండుగ....

రుక్మిణి :—ఆ శని రోజులు గడిచిపోయాయే తల్లీ! ఇంక డబ్బులు గురించి ఆలోచించక్కర్లేదు. అయ్యో! నా మతి మండ! ఇవాళ ప్రభాకరరావుగారు వస్తానన్నారు. నేను రాను. మీరు వెళ్ళండి.

వీణా :—పరవాలేదు. మీరంతా వెళ్ళండి నే నుంటాను.

రేవతి :—(చప్పట్లు కొడుతూ) అక్కయ్య బావగారికోసం ఆగిపోతుందోయ్!

కృష్ణ :—(నవ్వుతూ) తొందరగా పదవే! మన మెందుకు? అడ్డు? ఇంకా ఆగితే అక్కయ్య తిట్టుకుంటుంది.

రుక్మిణి :—(సంతోషంగా) నీ అమ్మ కడుపు చల్లగా....నీ అత్త కడుపు చల్లగా....ఇదిగో! ఆయనతో....సరే! నా కేం తెలీదు. ఆయన మంచాయన....వెళ్తున్నాను. నువ్వు....భయంలేదు....వస్తా!....

(అంతా వెళ్ళిపోతారు. వీణాధరి ఆలోచిస్తూ కూర్చుంటుంది. వీధిలో కారాగుతుంది. ప్రభాకరరావు వస్తాడు. వయస్సు నలభై అయిదుపైన వుంటుంది. అందగాడని చెప్పలేము కాని సౌమ్యంగా ఉంటాడు. గంభీరమైన విగ్రహం.)

వీణా :—రండి కూర్చోండి.

ప్రభా :—ఎవ్వరూ కనిపించరేం?

వీణా :—సినిమాకు వెళ్ళారు.

ప్రభా :—నువ్వు వెళ్ళలేదేం?

వీణా :—పిన్ని మీరు వస్తారని చెప్పింది.

(ప్రభాకర్ ముఖం వికసిస్తుంది. అంతలోనే నొచ్చుకుంటాడు.)

ప్రభా :—సారీ! పాపం నా మూలంగా నువ్వు సినిమా మానుకున్నావు.

వీణా :—పరవాలేదు. మీతో మాట్లాడాలని ఆగిపోయాను నేను.

ప్రభా :—నాతో మాట్లాడాలనా? ఏవిటి?

వీణా :—మా అమ్మ చిన్నప్పుడే పోయింది. మా పిన్ని....

ప్రభా :—అదంతా నాకు తెలుసు....

వీణా :—మా చెల్లెలికి పెళ్ళి కావాలి. మా తమ్ముడికి చదువు పూర్తి కావాలి.

ప్రభా :—మీ తమ్ముడి చదువు నేను చెప్పిస్తాననీ రేవతి పెళ్ళికి అవసరమైన సహాయం చేస్తాననీ మీ పిన్నిగారితో చెప్పాను. నీకు చెప్పలేదా?

వీణా :— చెప్పింది—నేను కోరేది....

ప్రభా :—ఆగిపోయావేం? నా దగ్గిర సంకోచ పడక్కర్లేదు.

వీణా :—మన పెళ్ళి ఎప్పుడు జరగాలని మీ సంకల్పం?

ప్రభా :—సాధ్యమైనంత త్వరలో!

వీణా :—ఒకవేళ, నేను కొంత కాలం ఆగమని కోరితే....

ప్రభా :—(నవ్వుతూ) ఆగిపోతుంది! పెళ్లికూతురి యిష్టం లేకుండా పెళ్ళెలా జరుగుతుంది?

వీణా :—కృష్ణ చదువు పూర్తయ్యాక కాని నాకు పెళ్లి చేసుకోవాలని లేదు.

ప్రభా :—అంటే, రెండేళ్ళు!....అబ్బా! కానీ, కృష్ణ చదువుకూ మన పెళ్ళికీ ఏం సంబంధం?

వీణా :—ఇది నా ప్రార్థన. తరువాత మీ దయ!

ప్రభా :—అలా దీనంగా మాట్లాడకు. నన్ను అజ్ఞాపించవలసినదానివి—ప్రార్థించవలసిన అవసరంలేదు నీకు! సరే! కృష్ణ చదువు పూర్తయ్యాకే పెళ్ళి చేసుకొందాం!

వీణా :—ఈ లోగా రేవతి పెళ్ళి కూడా అయిపోతే....

ప్రభా :—(నవ్వి) చెల్లెలి పెళ్ళి, తమ్ముడి చదువు పూర్తయ్యాక కాని పెళ్ళి చేసుకోనంటావు. అంతేనా?

వీణా :—నా బాధ్యతలు తీరిపోతే నాకు నిశ్చింత....

ప్రభా :—నీ మాట ప్రకారమే కానియ్యి.

(లేచి వీణాధరి దగ్గిరగా రాబోతాడు. భయంగా వీణాధరి వెనక్కు తగ్గుతుంది)

వీణా :—పెళ్ళి కాకుండా.......

ప్రభా :—ఎందుకా బెదురు? నే నంత దుర్బలుణ్ణి కాను. ఇదిగో! ఈ ఉంగరం నీ వ్రేలికి తొడగనీ! ఇది మన మధ్య ఒప్పందం. నువ్వు చెప్పినవన్నీ నేను ఒప్పుకున్నాను. నువ్వు నన్ను అంగీకరించినందుకు చిహ్నం ఈ ఉంగరం—తొడగనా?


(వీణాధరి చెయ్యి జాపుతుంది. ప్రభాకరరావు ఉంగరం వ్రేలికి తొడుగుతాడు.)

ప్రభా :—ఎంత బేలవు నువ్వు? చెయ్యిలా వణుకుతోందేం? చల్లగా మంచుగడ్డలా ఉంది. ఒంట్లో బాగుండలేదా?

వీణా :—(నవ్వటానికి ప్రయత్నించింది) బాగుంది. చాలా బాగుంది. ఊరికే....ఏదో ....సంకోచం....

ప్రభా :— (పకపక నవ్వి) ఎక్కడా ఈ కాలపు చదువుకున్న పిల్లల్లా లేవు.పోనీలే! నా కిలా ఉంటేనే యిష్టం. వెళ్తాను.

(ప్రభాకరరావు వెళ్ళిపోతాడు. వీణాధరి తన వ్రేలినున్న ఉంగరం తీసెయ్యబో తుంది. సగంవరకు లాగుతుంది. అంతలో మళ్ళీవెనక్కు నెట్టేస్తుంది.)




* * *

(మైదానంలో ఎవరికోసమో ఎదురుచూస్తున్నట్లు కూర్చుని వుంటుంది వీణాధరి. కుసుమ వెనుకనుండి వచ్చి వీణాధరి భుజం మీద చెయ్యి వేస్తుంది. ఉలిక్కిపడుతుంది వీణాధరి)

వీణా:—(ఆశాభంగం పొందినట్లు) నువ్వా!

కుసు:—ఇంకెవరను కున్నావ్? (అల్లరిగా) నాన్నగారే అను కున్నావా?

(వీణాధరి పెదిమలు బిగించి వ్యథ అణచు కోవటానికీ, నవ్వ టానికీ ప్రయత్నిస్తుంది. కుసుమ వీణాధరి చేతిని తన చేతిలోకి తీసుకుంటుంది)

కుసు:—పిన్నీ!

వీణా:—(అయోమయంగా) పి....న్నీ?!!

కుసు:—"పిన్నీ"! అంటే బాగుండలేదా? నాకు నిన్ను 'అమ్మా!' అనే పిలవాలని వుంది. కానీ నువ్వు మరీ చిన్న దానివి. 'అమ్మా!' అని ఎలా పిలవను?

(వీణాధరి కొన్ని క్షణాలు అదే అయోమయంతో కుసుమ వంక చూసి పకాలున నవ్వుతుంది)

కుసు:—(బిత్తర పోతూ) యెందుకు నవ్వుతున్నావు పిన్నీ?

వీణా:—(నిగ్రహించుకుని) ఏం లేదు. నువ్వు 'పిన్నీ' అంటూంటే ఆనందం పట్టలేక పోయాను.

(కుసుమ ముఖం కొద్దిగా ముడుచుకు పోయింది. అక్కడి నుంచి లేవబోతుంది. వీణాధరి తనను తను నిగ్రహించుకుని ముఖంలో వికాసం తెచ్చి పెట్టుకుని కుసుమను చెయ్యిపట్టి ఆపు తుంది)

వీణా:—నీ పిన్నిని అప్పుడే విడిచిపెట్టి వెళ్ళిపోతావా? కూర్చో! ఏదో చెప్పబోయావు ఏమిటి?

కుసు:—నీ వ్రేలికి ఈ ఉంగరం ఎంతో బాగుంది పిన్నీ! నీకు నచ్చిందా? నేనే సెలెక్ట్ చేసాను.

వీణా:—నువ్వు సెలెక్ట్ చేసావా? చాలా బాగుంది.

కుసు:—థేంక్స్—నాన్నగారితో 'పెళ్లి చేసుకో' మని అన్నానేకాని మా పిన్ని ఎలాంటిదో నని భయపడ్డాను. ఇప్పుడు నాకు చాలా సంతోషంగా వుంది.

వీణా:—మీ నాన్నగారిని నువ్వే పెళ్లి చేసుకోమని అన్నావా?

కుసు:—అవును. నిన్ను చూసాక నాన్నగారికి పెళ్లి చేసుకోవాలని అభిప్రాయం కలిగింది. నన్ను సలహా అడిగారు. తప్పకుండా చేసుకోమన్నాను. అన్నీ చెప్పారు. అన్నింటికీ ఒప్పుకున్నాను.

వీణా:—అన్నీ చెప్పారా? నువ్వు ఒప్పుకున్నావా?—నా కర్థం కావటం లేదు.

(కుసుమ ఏదో చెప్పబోయి ఆగిపోతుంది. అంతలో సర్దు కుంటుంది.)

కుసు:—అన్నీ అంటే, తన మనసులో ఆలోచనలన్నీ....నేను వెళ్ళనా....

[ఏకాంతం కోరుకుంటున్న వీణాధరి వెంటనే అంగీకార సూచకంగా తలూపుతుంది. కుసుమ వెళ్లిపోతుంది. వీణాధరి అలాగే కూచుని ఎదురుచూస్తూ వుంటుంది. గంటలు గడిచి పోతాయి. అంధకారం అలుముకుంటుంది. కృష్ణ వస్తాడు.]

కృష్ణ:—హమ్మయ్య! ఇక్కడున్నావా అక్కయ్యా! అందరం హడలి పోతున్నాం. ఒక్క దానివీ ఈ చీకట్లో ఏం చేస్తున్నావ్? ఇంటికి పోదాంపద!

వీణా:—నువ్వు వెళ్ళు. నేను కొంచెం సేపాగి వస్తాను.

కృష్ణ:—ఇప్పుడు టైమెంతయిందో తెలుసా? పదకొండు. ఇంకా కొంచెం సేపాగి వస్తావా? నీకు మతి పోయిందా?

వీణా:—పదకొండా? ఒక సంగతి చెప్పు. రఘుగారు ఇంటికి వచ్చారా?

కృష్ణ:—(విచిత్రంగా వీణాధరి వంక చూసి) మన ముందు గదిలో అద్దెకుంటున్న రఘు గారేనా? ఎప్పుడో వచ్చారు. అన్నట్టు ఇవాళ మనగది ఖాళీచేసి వెళ్లిపోయారు.

వీణా:—వెళ్ళి పోయారా?

కృష్ణ:—నీది మరీ విడ్డూరం. ఇందులో అంత కృంగి పోవలసింది ఏముందీ? ఆయన కాకపోతే మరొకరు వస్తారు.

వీణా:—(లేవబోయి తూలుతుంది.) పద!

కృష్ణ:—అలా వున్నావేం అక్కయ్యా? నీ ముఖం అలా పాలి పోయిందేం? వంట్లో బాగుండలేదా?

వీణా:—నాకేం తక్కువ? కాబోయే పెళ్ళికూతుర్ని. లోకంలో కులాసా అంతా నాలోనేవుంది. పద!

## 2

(పల్లెటూళ్ళో ఒక ఇల్లు. సుందరమ్మ వ్యాయామం చేస్తూ ఉంటుంది. వయసు నలభై పైన ఉంటాయి. అక్కడక్కడ నెరి సిన వెంట్రుకలు, స్థూల కాయం, అందంలేదు కాని, అందంగా కనిపించాలని చేసే ప్రయత్నం మాత్రం విపరీతంగా ఉంటుంది. రఘు ప్రవేశిస్తాడు. రఘును చూసి చటుక్కున వ్యాయామం ఆపేస్తుంది.)

సుంద :—ఎప్పుడొచ్చావ్ రఘూ! ఉత్తరమైనా రాయకుండా వచ్చావేం?

రఘు :—ఉత్తరం వ్రాయటానికి వ్యవధి లేకపోయింది. వదినా! నువ్వేమిటి, ఏదో అవస్థ పడుతున్నావ్?

సుంద :—ఆ! లేడీ డాక్టర్ యెక్సరైజు చెయ్యమందయ్యా! ఏవిటో, చిన్నతనంలోనే మాయదారి వళ్ళొచ్చింది. మరీ పెద్దదానిలా కని పిస్తున్నానా?

(గోపాలయ్య వస్తాడు. వయసు యాభై పైన. పల్లెటూరి రైతు.)

గోపా :—అబ్బే! బాలాకుమారిలా కనిపిస్తున్నావు. ఎక్సరైజు కాదే! ఎక్సర్ సైజ్! ఇంట్లో పనిపాటలు పనివాళ్ళమీద వదలక నడుం వంచి చేసుకో! ఏ యెక్సర్‌సైజులూ అక్కర్లేదు.

సుంద :—అబ్బో! చెప్పొచ్చారు లెండి. అక్కడికి మీకు మహా ఇంగ్లీషొచ్చినట్లు....

గోపా :—నాకు రాదు. కానీ, వచ్చినవాడిలా మాట్లాడను. అందుకని నవ్వులపాలు కాను.

సుంద :—నన్ను చూసి ఎవ్వరూ నవ్వటం లేదు. ఈ ఊళ్ళో నా కెంత గౌరవమో మీకేం తెలుసు?

గోపా :—వెఱ్ఱి మొహమా! ఆ గౌరవం నిన్నుచూసి కాదే! మోతు బరి గోపాలయ్య భార్యవని....''

సుంద :—చాల్లెండి! రఘూ! మీ పట్నంలో సన్నగా, నాజుగ్గా తయారవటానికి మందులేం లేవా? ఈ డటింగ్‌తో ఛస్తున్నాను.

గోపా :—డటింగ్ కాదే! డయిటింగ్! రఘూ! మీ వదిన డయిటింగ్ కాదు కాని, నా ప్రాణాలు పోతున్నాయి. అన్నం మానేద్దామని రొట్టెలు తింటోంది. రొట్టెలు, మరీ తేలిక తిండని పాలు త్రాగు తోంది. పాలతో కడుపు నిండదని పళ్ళు తింటుంది. బొత్తిగా అన్నం తినకపోతే ఎలాగో ఉంటుందని అన్నం తినేస్తుంది. ఎన్నాళ్ళలో చిక్కుతుంది చెప్పు.

(రఘు నవ్వుతాడు. సుందరమ్మ ఉడుక్కుని కోపంగా వెళ్లిపోతుంది.)

గోపా :—మీ వదినకు అమాంతం చిన్నపిల్లలా కనిపించాలని పట్టు కుందయ్యా! ఈ పిచ్చి ఎలా వదులుతుందో అర్థం కావటం లేదు.

రఘు :—నిత్య యవ్వనంమీద ఆశ మానవులకు తరతరాలుగా వస్తు న్నదే అన్నయ్యా! ఈ ఆశే ఒకవంక యోగశాస్త్రాభివృద్ధికి మరొక వంక వైద్య శాస్త్రాభివృద్ధికి కారణం.

గోపా :—వైద్యమంటే గుర్తొచ్చింది. ఎలా వుంది నీ చదువు?

రఘు :—ఈ సంవత్సరంతో హౌస్ సర్జన్ పూర్తయితే పై సంవ త్సరం ఎక్కడైనా మంచి ఉద్యోగం దొరుకుతుంది.

గోపా :—చాలా సంతోషంగా వుందిరా! కష్టపడి పైకొచ్చావు.

(సుందరమ్మ విసురుగా వస్తుంది)

సుంద :—మనం కష్టపడి పైకి తీసుకొచ్చాం!

గోపా :—మనం తీసుకొచ్చిందేముందే! వాడి ఆస్థితో వాడు చదువు కున్నాడు.

సుంద:—ఆస్థి! ఇక్కడ మీరు రెక్కలు విరుచుకు చాకిరీ చేసి సొమ్ము పంపకపోతే, ఆ ఆస్థి ఏం చేసుకునేవాడు మీ తమ్ముడు? పొలాలు ఊరికే పండి బంగారం కురిపించవు.

రఘు:—వదినా! నీ మాటే నిజం! మీ దయవల్లే నేనింతవాణ్ని అయ్యాను. ఆ మాట ఎప్పుడూ మరిచిపోను.

సుంద:—మరిచి పోనంటే సరిపోదు. ఇప్పుడు నువ్వు సహాయ పడవలసిన అవసరం వచ్చింది.

గోపా:—ఏమిటీ?

సుంద:—మీరూరు కోండి! ఏం రఘూ! చిట్టి ఇక్కడ సమంగా చదువుకోవటం లేదు. రెండేళ్ల బట్టీ ఆ బి.యస్సీ. పోతోంది. ఈ కాలేజి మంచిదికాదు. నీ దగ్గిరకి తీసుకుపోయి చదివిస్తావా?

గోపా:—మనవాడు శ్రద్ధగా చదివితే కాలేజి ఏం చేస్తుందే?

సుంద:—చదవ కేమండీ! రాత్రింబగళ్ళు చదువుతాడు.

గోపా:—డిటెక్టివ్ నవలలు....

సుంద:—అలా ఆడిపోసుకోండి వాణ్ని. నచ్చ జెప్పవలసింది పోయి.

రఘు:—వదినా! నువ్వేం బాధపడకు—చిట్టిని నాతో తీసికెళ్తాను. ఈ సంవత్సరం వాడు తప్పకుండా పాసయ్యేలా చూస్తాను, సరేనా!

సుంద:—నాకు తెలుసు నువ్విలా అంటావని....

గోపా:—మా తమ్ముడు మంచివాడే!

సుంద:—అంటే ఇక్కడ మంచివాళ్ళు కాని దెవరు?

చిట్టి:—నేను.... ....

(అసలు పేరు రాజారావు. అందరు చిట్టి అంటారు. వయసు పాతికపైన. అందగాడేకాని చవటలా కనిపిస్తాడు.)

సుంద:—ఏవిటిరా?

చిట్టి:—నేను రామనాధంగారిని చూసి వస్తున్నాను.

సుంద:—అదా?

గోపా:—ఆయనకు జ్వరం యెలా వుందిరా?

చిట్టి:—ఇప్పుడేం లేదు.

గోపా:—విచిత్రంగావుంది. చాలా జ్వరంగా వుందన్నారు. అంతలో తగ్గిపోయిందా? కీళ్ళు నొప్పులూ అవీ....

చిట్టి:—అవేవీ లేవు.

గోపా:—అద్భుతంగావుంది. కడుపులో పోట్లు అనేవాడు.

చిట్టి:—అవికూడా లేవు.

గోపా:—నమ్మలేక పోతున్నాను. వెళ్ళిచూసొస్తాను.

చిట్టి:—ఎలా చూస్తావు నాన్నా! తీసికెళ్ళి పోయారు.

గోపా:—ఎక్కడికి తీసికెళ్ళారు?

చిట్టి:—స్మశానానికి.

గోపా;—అంటే ఆయన చచ్చిపొయ్యారా?

చిట్టి:—అవును.

గోపా:—ఆ! చావుకబురు ఎంత చల్లగా చెపుతావురా!

సుంద:—సరేలెండి. ఎప్పుడూ వుండేదేగా! భోజనాలకి లేవండి. చిట్టీ! నిన్ను రఘు తనతో తీసికెళ్తానన్నాడు.

చిట్టి:—అవునా బాబాయ్?

గోపా:—అవునురా! అక్కడైనా బుద్ధిగా చదువుకో!

చిట్టి:—ఇక్కడి కంటె బుద్ధిగా వుంటాను నాన్నా!

రఘు:—చిట్టి చాలా మంచివాడు. ఈ సంవత్సరం తప్పకుండా పాసవుతాడు. చూస్తూ వుండండి.

(సుందరమ్మ సంతోషిస్తుంది)

సుంద:—ఏదో మా దయవల్ల నువ్వు ప్రయోజకుడి వయినందుకు వాడిని కూడా ప్రయోజకుణ్ణి చేస్తివా....

గోపా :—ఆ కొసరెందుకే! వెధవ బుద్ధి. పద! లే రఘూ! స్నానం చేస్తావా? చెరువు కెళ్దాం రా!

* * *

(చక్కని మేడ—విశాలమైన హాలు—సోఫాల్లో రఘు, కేశవ రావుగారు కూర్చుని వుంటారు. కేశవరావుగారి వయసు దాదాపు యాభై వుంటుంది. అయినా దృఢంగా ఉంటాడు. వ్యక్తిలో ఏదో ఠీవి, గాంభీర్యం కనిపిస్తుంది.)

కేశ :—ఇవాళ నువ్వు చేసిన ఆపరేషన్ అద్భుతం. నువ్వు నిజంగా



జీనియస్‌వి. లోకంలో చిరస్థాయిగా గుర్తుంచుకోదగిన డాక్టర్లలో నువ్వూ ఒకడి వవుతావు.

రఘు:—(వినయంగా) ఏదో, మీ దయ........

కేశ :—ఇద్దరు రోగులూ సీరియస్‌గా ఉన్నారు. నేను బెడ్ నెం. 3 ని వదిలి బెడ్ నెం. 14 దగ్గరకు వెళ్ళాను. ఆ సమయంలో నువ్వు సమయస్ఫూర్తితో ట్రెచెస్టెమీ (Tracheastomy) చేసి ఉండక పోతే ఆ రోగి బ్రతికి ఉండేది కాదు. నాకు చాలా సంతోషంగా వుంది.

రఘు :—మొదట నాకు ధైర్యం చాల లేదు. కానీ లారినిక్స్‌లో (Larynx) డిఫ్తీరియాతో బాధపడుతున్న ఆ రోగి చావుబ్రతు కులలో వుంది. సాహసించాను.

కేశ :—ఫలితం దక్కింది. నాకు పేరు తెచ్చావు. నీకు మంచి భవిష్యత్తు ఉంది రఘూ! కమలా! ఫలహారం కాఫీ పట్టుకు రామ్మా!

(కమల కాఫీ, ఫలహారం ట్రేలో సర్ది తీసుకొస్తుంది. సాధారణమైన అందం. ఒక విధమైన గాంభీర్యం ఉట్టిపడే సౌమ్యమైన వ్యక్తిత్వం)

కేశ :—మా అమ్మాయి కమల. బి. ఏ. పాసయింది. కమలా! బ్రిలియంట్ డాక్టరని నేను చెప్పలేదూ! డాక్టర్ రఘు ఈయనే!

(కమల నమస్కారం చేస్తుంది. రఘు ప్రతి నమస్కారం చేస్తాడు. కమల లోపలికి వెళ్ళిపోతుంది.)

కేశ :—నీ హౌస్ సర్జన్ ఒక్క నెలలో పూర్తయిపోతుంది. ఏం చేద్దామనుకుంటున్నావ్?

రఘు :—ప్రైవేట్ ప్రాక్టీస్ పెట్టుకోగలిగే స్థోమత నాకు లేదు. మంచి ఉద్యోగం దొరికితే చేరిపోవాలని ఉంది. చాలాచోట్ల అప్లయి చేశాను. ఏ వూళ్ళో వస్తుందో? అసలు వస్తుందో? రాదో?

కేశ :—మనవూళ్ళోనే గవర్నమెంట్ హాస్పిటల్ ఉందిగా! ప్రయత్నించలేదా?

రఘు :—అక్కడ నాకెలా వస్తుందండీ? ఆ ఉద్యోగానికి ఎమ్.డి.లు

ప్రయత్నిస్తున్నారు. కనీసం మూడేళ్ళ అనుభవం కావాలిట!

కేశ :—నువ్వు అప్లయి చెయ్యి. ఆ ఉద్యోగం నీకు వచ్చేలా నేను చూస్తాను.

రఘు :—(సంభ్రమంతో) థేంక్స్—వస్తానండీ!

కేశ :—విష్ యు ది బెస్ట్ ఆఫ్ లక్.

* * *

(అదే మేడలో హాలు—కమల చదువుకుంటూ ఉంటుంది. రఘు వస్తాడు)

రఘు ;—నాన్నగారు లేరా ?

(కమల పుస్తకం మూసి గౌరవంగా లేచి నించుంటుంది.)

రఘు :—(నవ్వుతూ) కూర్చోండి, నన్ను గౌరవించక్కర్లేదు.

కమల :—(కూర్చొని) నన్ను మీరు అని పిలవకండి.

రఘు :—నువ్వు అనగలిగే అధికారం ఇంకా రాలేదుగా! నాన్నగారు ఎక్కడికి వెళ్ళారు?

కమల :—ఢిల్లీలో డాక్టర్స్ కాన్ఫరెన్స్‌కు వెళ్ళారు. వైద్య సంఘానికి ఈసారి మిమ్మల్ని సెక్రటరీగా చెయ్యాలనుకుంటున్నారు నాన్నగారు. ఆయనకు మీమీద కన్నకొడుకుకంటే అభిమానం.

రఘు :—నాకూ ఆయన తండ్రికంటె ఎక్కువ. ఆయన అండదండలు లేకపోతే నేనింతవాడిని అయ్యేవాడిని కాను. నా వృత్తిలో నేనింతగా రాణించడానికి, ఆయన ప్రోత్సాహమూ, సలహాలే కారణం.

కమల :—మీరు మరోలా అనుకోకపోతే, ఒక విషయం చెప్పాలనుకుంటున్నాను.

రఘు :—ఎవరైనా ఏమైనా అనుకుంటారని మనం చెప్పదలచింది మానకూడదు. చెప్పండి.

కమల :—మా నాన్నగారిపట్ల కృతజ్ఞతాభావంతో మీరు నన్ను పెళ్ళి చేసుకోవద్దు. ఈ పెళ్ళి జరిగినా, జరగకపోయినా మా నాన్నగారికి మీమీద అభిమానం అలాగే ఉంటుంది. వివాహాన్ని వ్యాపారంలా చూడటం నా కెంతమాత్రం....

రఘు :—ఇష్టం లేదు. నాకూ అంతే! కేశవరావుగారిపట్ల కృతజ్ఞతాభావంతో మిమ్మల్ని పెళ్లి చేసుకోవటం లేదు. మిమ్మల్ని నాకిస్తున్నందుకు పరింత కృతజ్ఞుడి నవుతున్నాను,

కమల :—ఇదే నిజమైతే, ముందా 'మీరు' మానెయ్యండి. భరించలేక పోతున్నాను.

రఘు :—కమలా! నేనూ కొంత చెప్పదల్చుకున్నాను. నీకు ప్రేమలో నమ్మకముందా?

కమల :—నాకు తెలియదు. కానీ 'విధి' లో నమ్మకముంది.

రఘు :—భర్తగా నా విధి నేను నిర్వహిస్తాను. కాని....

కమల :—ఇంక 'కాని' ఏమిటి ? మీరు చెప్పదలచుకున్నది నాకు అర్థమయింది. జీవితంలో అనేకం జరుగుతూ ఉంటాయి. వాటికి మనం ప్రాధాన్యం ఇవ్వక్కర్లేదు. మన 'విధి' మనం మరిచిపోనంతవరకూ మన సంసారంలో ఎలాంటి ఒడిదుడుకులూ రావు.

(రఘు కమలను ప్రశంసాదృక్కులతో చూస్తాడు. కమల సిగ్గుపడుతుంది. అంతలో చిట్టి వస్తాడు.)

చిట్టి :—బాబాయ్!

రఘు :—ఇలా వచ్చావేం చిట్టీ! రేపటి పరీక్షకు చదవక్కర్లేదూ?

చిట్టి :—చదవక్కర్లేదు.

రఘు :—చదవకుండా ఎలా వ్రాస్తావురా ?

చిట్టి :—వ్రాయక్కర్లేదు.

రఘు :—(కోపంగా) అంటే ?

చిట్టి :—కాపీ కొట్టానని నన్ను పరీక్ష హాల్లోకి రావద్దన్నారు.

కమల :—(విభ్రాంతితో) గాడ్! ఎలాంటి విషయాన్ని, ఎంత నిశ్చింతతో నవ్వుతూ చెపుతున్నాడు?

రఘు :—కాపీ కొట్టావా? బుద్ధి లేదా? ఒక సంవత్సరమంతా తగలబడింది. ఎందు కలాంటి వెధవపని చేసావ్?

చిట్టి :—పట్టుబడితే అన్నీ వెధవ పనులే! పట్టుబడకపోతే అవే రాజా పనులు! నిన్న కాపీ కొట్టాను. బ్రహ్మాండంగా వ్రాసాను. పట్టుకోలేదు. ఇవాళ పట్టుకుంటారని కల కన్నానా ?

రఘు :—వెధవ పనులు చేసేవారు ఒకరోజు కాకపోతే మరోరోజు పట్టుబడక మానరు. కాపీలు కొట్టద్దని ఎన్నిసార్లు చెప్పాను?

చిట్టి :— నువ్వేగా క్లాసు తెచ్చుకోవాలని చెప్పావు?

రఘు :— అయితే?

చిట్టి :—కాపీలు కొట్టకుండా నాలాంటివాళ్ళకి క్లాసు లెలా వస్తాయి? నన్ను పట్టుకున్నారు. కళ్ళారా చూసికూడా ప్రకాశంగాడిని పట్టుకోగలిగారా?

రఘు :—అదేం?

చిట్టి :—వాడు మినిస్టరుగారి మేనల్లుడు. ఇలా దర్జాగా పాసయి ఆఫీసరయినా అవుతాడు లేకపోతే వాడూ మరో మినిస్టరవుతాడు.

కమల :—(దిగాలుగా) రోజురోజుకూ ఎక్కడికి దిగజారుతున్నాం మనం?

రఘు :—(కోపంగా) చేసిన ఘనకార్యాలకు సమర్థింపులు కూడానా? నడు!

చిట్టి :—బాబాయ్! నువ్వు కాస్త ప్రయత్నిస్తే నన్ను మళ్లీ పరీక్షకు కూర్చోనిస్తారు.

రఘు :—అట్లాంటి పిచ్చిపనులు నేను చెయ్యను. ఇప్పటినుండీ శ్రద్ధగా చదివి పై సంవత్సరమన్నా జాగ్రత్తగా వ్రాయి.

చిట్టి :—బాబాయ్! ప్రభుత్వం నిరుద్యోగ సమస్య పరిష్కరించడానికి మంచి మార్గం కనిపెట్టింది, స్టేండర్డ్ విపరీతంగా పెంచింది.

పాఠశాలల్లో, కళాశాలల్లో ఉపాధ్యాయులు, అధ్యాపకులు సరిగ్గా బోధిస్తున్నారో, లేదో, గమనించటం మానేసింది. ఎవరికీ డిగ్రీలు రాకుండా జాగ్రత్త పడుతోంది. చూడు! ముందు ముందు "నాకు డిగ్రీ ఉంది—ఉద్యోగం లేదు" అని ప్రభుత్వాన్ని అడగటానికి ఎక్కువమంది ఉండరు. నేను ఇంటర్‌లో చదివిన చదువునుంచి హైజంప్ ఈ బి.యస్‌సి నాబోటి సాధారణమైన తెలివితేటలు కలవాడు ఎన్ని సంవత్సరాలు, ఎంత శ్రద్ధగా చదివినా క్లాసు తెచ్చుకోలేడు. కాపీ తప్ప అన్యథా శరణం నాస్తి....




కమల :—బాబూ! నీపేరు నాకు తెలియదు. సీరియస్‌గా తీసుకోవలసిన విషయాలనుకూడా నువ్విలా తేలిగ్గా మాట్లాడడం నాకు నచ్చలేదు.

రఘు :—చావుకబుర్లు చల్లగా చెప్పటంలో వీడికి వీడే సాటి. వస్తాం కమలా! పదరా!

* * *

(పెళ్ళి సందడి—పట్టుబట్టలతో హడావుడిగా తిరుగుతూ ఉంటారు. కమల పెళ్లికూతురి వేషంలో కూర్చుని వుంటుంది. సుందరమ్మ, గోపాలయ్య, చిట్టి, కేశవరావుగారు అంతా హడావుడిగా ఏదేదో మాట్లాడుతూ ఉంటారు)

ఒక గొంతు :—విడిదికి కాఫీ వెళ్ళిందా?

మరో గొంతు :—ఎవరైనా ఆ పూలు కాస్త మాల కట్టండర్రా! టైమయిపోతోంది.

మరో గొంతు :—ఒసేయ్ కామాక్షీ! నా జిగినీ గొలుసు నీ మెళ్ళోగాని పెట్టానా? చూడవే కనబడటం లేదు.

మరో గొంతు :—ఈ ఆకు పచ్చరంగు చీరమీదికి ఎరుపురంగు జాకెట్టు బాగుంటుందా? మరీ కొట్టొచ్చినట్టు ఉంటుందా?

మరో గొంతు :—ముందు మీరంతా పెళ్లికూతుళ్లలా సింగారించుకుంటున్నారు. అవతల వంటబ్రాహ్మలు అరుస్తున్నారు. ఏం కావాలో చూడండి....

మరో గొంతు :—పూర్వకాలం మేజువాణీ లుండేవి. సరదాగా ఉండేవి. కనీసం ఏ వైజయంతిమాలనో, వహీదా రెహమాన్‌నో పిలిపించినా బాగుండును.

మరో గొంతు :—ఎక్కడైనా పేక దొరుకుతుందేమో చూడండర్రా! అడ్డాట ప్రారంభిద్దాం!

మరో గొంతు :—ఎవరక్కడ? కాస్త కాఫీ పంపించండి! వెధవది! నాకు గంటకోసారి కాఫీ త్రాగటం అలవాటు!

సుందరమ్మ :—బాబయ్యగారూ?

కేశవ :—నన్నేనా?

సుందర :—మిమ్మల్నే! నేను రఘుకు వదిననే కాని తల్లిలా పెంచాను. వియ్యపురాలికి జరగవలసిన మర్యాదలన్నీ నాకు జరగవలసిందే!

గోపా :—సుందరం....

సుంద :—మీ రూరుకోండి! ఇప్పుడే చెప్తున్నా! నాకే కొంచెం మర్యాద లోపం జరిగినా వెంటనే ఇక్కడినుండి వెళ్ళిపోతాను.

గోపా :—నన్ను మాత్రం రమ్మనకు. నేను రాను.

కేశవ :—మీ కేమాత్రం అమర్యాద జరగనియ్యను. మీకు అన్నీ అమిరాయో, లేదో, నేనే స్వయంగా చూసుకొంటాను....

(కమల కళ్ళు పెద్దవిచేసి సుందరమ్మనూ, జాలిగా తండ్రినీ చూస్తుంది.)

కేశవ :—కాఫీ తాగారా?

(సుందరమ్మ పక్కనే త్రాగిన కాఫీ కప్పు కనబడుతుంది)

సుంద :—ఎలా తాగుతాను? నా కెవరూ ఇవ్వందే!

కేశవ :—ఎవర్రా అక్కడ? వియ్యపురాలికోసం ప్రత్యేకం స్ట్రాంగ్‌గా కాఫీ తయారుచేసి పట్టుకురండి.

(కాఫీ వస్తుంది. అప్పుడే కాఫీ త్రాగిన సుందరమ్మ మళ్ళీ త్రాగలేకపోతుంది.)

సుంద :—ఛీ! పాడు కాఫీ! చేదు....

కేశవ :—(కంగారుగా) కాఫీ చేదుగా ఉందా? అయితే మీకు లో జ్వరం ఉండివుండాలి. ఏదీ చూడనివ్వండి.

(చెయ్యి చూడబోతాడు. కంగారుగా లాక్కుంటుంది.)

సుంద :—అబ్బెబ్బె! జ్వరం లేదు. కొద్దిగా జలుబు చేసింది. అందుకని....బహుశా....

కేశవ :—మై గాడ్! జలుబా! జలుబు అంటు జబ్బు! ఇక్కడ అందరికీ అంటుకుంటుంది. మీరు వేరే గదిలో ఉండవలసిందే! పదండి.

సుంద :—కాస్త జలుబుకి ఇంత హడావుడి చేస్తారేమిటండీ! అదే పోతుంది

కేశవ :—చిన్న పామునైనా పెద్ద కర్రతో కొట్టాలి. ఒక ఇంజక్షన్ యిస్తాను. మీరు కదలకుండా గదిలో పడుకోండి.

(చెయ్యి పట్టుకుని లోపలి గదిలోకి ఈడ్చుకుపోతాడు)

సుంద :—(గింజుకుంటూ) అయ్యబాబోయ్! నాకు ఇంజక్షనంటే భయం. నాకేం వద్దు.

కేశవ :—తెల్లారి లేస్తే నా రోగులంతా ఇదేమాట అంటారు. అలా అని ఇంజక్షన్ చెయ్యటం మానేస్తామా? అందులో మీరు నాకు వియ్యపురాలితో సమానం. మీ ఆరోగ్యం విషయం అశ్రద్ధ చేస్తానా?

సుంద :—దేవుడోయ్! నాకే రోగమూ లేదంటూంటే.

కేశవ :—రోగం సంగతి మీకేం తెలుస్తుందండీ! డాక్టర్‌ని నాకు తెలుస్తుంది. మీ రోగానికి మంచి మందిచ్చి చక్కగా కుదురుస్తాను.

సుంద :—నన్ను వదలండి.

(గింజుకోవటంలో కాలు గడపకి తగిలి రక్తం చిమ్ముతుంది.)

సుంద :—ఓయ్ దేవుడోయ్! దెబ్బ! రక్తం! నా తల తిరిగిపోతోంది.

కేశ :—దెబ్బా! పెద్దది తగిలిందా?

సుంద :—ఇంతా అంతా పెద్దదెబ్బ కాదు. కంఠ ఊడొచ్చింది.

కేశ :—అయితే ఏ మేకో గుచ్చుకుని ఉంటుంది. భయపడకండి. వెంటనే ఏంటీ సెప్టిక్ ఇంజక్షన్ చేస్తాను.

సుంద :—హమ్మ నాయనో! మరో ఇంజక్షనా? నన్నిలా బ్రతకనియ్యండి. నన్ను వదలండి.

కేశ :—వదిలేస్తే మీ కాలు కుళ్ళిపోతుంది. కాలు కొట్టెయ్యవలసి వస్తుంది. పదండి.

సుంద :—ఏం కాలేదండీ! చిన్న దెబ్బ!

కేశ :—నాకు తెలుసు. ఇంజక్షన్‌కు భయపడి అలా అంటున్నారు. మీ విషయంలో ఏదైనా అశ్రద్ధ జరిగితే, మా అమ్మాయి ఊరుకుంటుందా? రఘుకు కోపం రాదూ! వియ్యపురాలితో సమానమయిన మీకు నేను లోటు రానిస్తానా? నర్స్! రెండు ఇంజక్షన్లూ సిద్ధం చెయ్యి.

(గింజుకుంటున్న సుందరమ్మకు బలవంతాన ఇంజక్షన్లు చేసి, గదిలో మంచంమీద పడుకోబెట్టి గది తలుపులు బయట వేసేస్తాడు.)

కేశ :—గోపాలంగారూ! మరేం కంగారు పడకండి! ఆవిడ రోగానికి తగిన మందులిచ్చి నయం చేసేస్తాను.

గోపా :—కంగారేం లేదండీ! సంతోషంగా ఉంది. ఇన్నాళ్ళూ దాని రోగం కుదర్చటం నాకు చేతకాకే అలా ముదిరిపోయింది.

కమల :—నాన్నగారూ! పాపం ఆవిడ అలా ఆ గదిలో ఒక్కరూ...

కేశ :—కమలా! ఈ విషయంలో మాత్రం నువ్వు నా మాట కెదురు చెప్పటానికి వీల్లేదు. మిగిలిన విషయాలన్నీ నువ్వు చెప్పు. నేను వింటాను. వైద్యం విషయంలో నామాట అందరూ వినవలసిందే!

గోపా :—పరవాలేదమ్మా కమలా! సుఖంగా దాన్ని అక్కడ ఉండనియ్యి. మావయ్యగారూ! ఇవన్నీ పెళ్ళిలో వచ్చిన బహుమానాలనుకుంటా చూడండి.

(వెండి కప్పులూ, సాసర్లూ వగైరా చూస్తూంటాడు. ఒక చిత్రం కనిపిస్తుంది.)

కేశ :—ఈ అమ్మాయికి ఎనిమియా-ఐరన్ టానిక్స్ ఇవ్వాలి. కేప్సూల్స్ వాడినా పరవాలేదు. నిలవలేనట్లు తూలి పడుతోంది. అందాకా ఒక గ్లూకోజ్ ఇంజక్షన్ ఇవ్వాలి. నర్స్!

కమల :—(నవ్వుతూ) నాన్నగారూ! అది చిత్రం. మనిషి కాదు....

కేశ :—ఓ! అయామ్ సారీ! మా వియ్యపురాలు ఎలా ఉన్నారో చూస్తాను.

(తలుపు తీసి చూస్తాడు)

కేశ :—ఎలా వుందండీ!

సుంద :—దేవుడోయ్! నా కళ్ళు తిరుగుతున్నాయి. నన్ను బయటికి రానియ్యండి.

కేశ :—కళ్ళు తిరుగుతున్నాయా? అంటే పైత్యం అన్నమాట! నర్స్!

సుంద :—హమ్మ నాయనోయ్! మరో ఇంజక్షనా? నాకేం లేదు. ఏ కళ్ళూ తిరగటం లేదు.

(మంచంమీద వాలిపోయి భయంగా కళ్ళు మూసుకుంటుంది. జాగ్రత్తగా తలుపులు బిగిస్తాడు కేశవరావు.)

*　　*　　*

(అందమైన గదిలో నూతన వధూవరులు కమల, రఘు.)

రఘు :—ఏవిటాలోచిస్తున్నావు కమలా?

కమల :—ఏమని చెప్పను? రకరకాల భావాలతో నా మనసు ఊగిపోతోంది. గర్వమూ, సంతోషమూ, భయమూ. నా మనసును ఊపివేస్తున్నాయి.

రఘు :—ఎందుకో?

కమ :—మీవంటి భర్త దొరికినందుకు గర్వం. మీతో కలిపి పంచుకోబోయే జీవన మాధుర్యాన్ని ఊహించుకుని సంతోషం. మనను బంధించిన ఈ పవిత్ర బంధంలో నా బాధ్యత సక్రమంగా నిర్వహించుకోగలనో, లేనో, అని భయం.

రఘు :—కమలా! రూపము, సంపద, చదువు, అన్నీ కలిపి ఉండడమే అపురూపం. వీటికితోడు చాలా తక్కువమందిలో ఉండే, సౌహార్ద్రత, విచక్షణకూడా ఉన్నాయి నీలో! నావల్ల నువ్వు సుఖపడతావో లేదో గాని, నీవల్ల నా కేనాడూ ఏ కొరతా రాదని నిశ్చింతగా చెప్పగలను.

కమల ;—భలేవారు! మీ సుఖమూ, నా సుఖమూ వేరుగా ఉంటాయా? ఈ నాటినుండీ ఏదైనా ఇద్దరమూ కలిసే అనుభవించాలి.

రఘు :—(చిలిపిగా) అందుకే!.... ముందు ఆ లైటు తీసెయ్యి.

కమల :—(సిగ్గుతో కందిపోయి) పొండి! నేనా ఉద్దేశంతో అనలేదు.

రఘు :—నా ఉద్దేశం మాత్రం ఇదే!

(లైటు ఆర్పేస్తాడు.)

## 3

(హాస్పిటల్‌లో రఘు రోగులను పరీక్షిస్తూ ఉంటాడు. ఇద్దరు పోలీసులు వస్తారు. వెనుక మూడు స్ట్రెచర్లమీద ముగ్గురు వ్యక్తులను మోసుకొస్తారు.)

పో :—డాక్టర్ రఘు మీరేనా ?

రఘు :—అవును. ఏం జరిగింది ?

పో ;—కారు యాక్సిడెంట్ జరిగింది. అందులో ఉన్న ముగ్గురు వ్యక్తులకూ గాయాలు తగిలాయి. ఒకావిడ మాత్రం కొద్ది స్పృహలో ఉంది. రఘు! అని కలవరించింది. ఆవిడ హేండ్ బాగ్‌లో దొరికిన ఫొటోబట్టి విచారించగా ఆ రఘు మీరేనని తేలింది. ఇక్కడికి తీసుకొచ్చాం!

(రఘు ఆతృతగా స్ట్రెచర్ల దగ్గిరకి వచ్చి చూస్తాడు.)

రఘు :—వీణా !.... ....

(దిగ్భ్రాంతితో బొమ్మలా నిలిచిపోతాడు. పోలీస్ నర్వస్‌గా కదులుతాడు.)

పోలీ :—డాక్టర్ ! మిగిలిన ఇద్దర్నీ చూడండి. ఆయన మరణించా రనుకుంటాను.

రఘు :—(తెప్పరిల్లి ప్రభాకర్‌రావుగారిని చూస్తాడు.) లాభం లేదు. ప్రాణం పోయింది. (కుసుమని చూస్తాడు.) నర్స్ ! వెంటనే ఈ పేషెంట్‌ని సర్జికల్‌వార్డ్‌లో చేర్పించు. నే నిప్పుడేవస్తాను.

(వీణాధరిని తనే స్వయంగా చేతులతో ఎత్తుకుని బెడ్‌మీద పడుకోబెడ్తాడు. మతిపోయిన వాడిలా వీణాధరినే చూస్తుంటాడు. కనుకొలకులలో నీటిబిందువులు నిలుస్తాయి.)

నర్స్ :—డాక్టర్.... ....

రఘు :—వస్తున్నాను.... ....

* * *

(హాస్పిటల్—చాలామంది రోగులు మంచాల మీద పడుకుని ఉంటారు. వీణాధరి చైతన్యంలేని దానిలా పడి ఉంటుంది. రఘు ఆతృతగా ఆమెనే పరిశీలిస్తూ ఉంటాడు )

రఘు :—వీణా! వీణా !

(ఆ ధ్వని వీణాధరికి ముందు ఎక్కడో దూరం నుంచి విని పించినట్లు వినిపిస్తుంది. నెమ్మదిగా నెమ్మదిగా స్పష్టమవుతుంది. కళ్ళు తెరుస్తుంది.)

వీణా :—రఘూ !

ఉద్రేకంతో లేచి అతని మెడచుట్టూ చేతులువేసి గాఢంగా కౌగిలించుకుంటుంది. అప్రయత్నంగా రఘు కూడా చేతుల్తో ఆమెను ఆప్యాయంగా అదుముకుంటాడు.)

వీణా :—రఘూ! బ్రతికుండగా తీరని కోరిక చచ్చిపోయాక తీరింది. నిన్నే తలుచుకుంటూ చచ్చిపోయాను. కళ్ళు తెరవగానే నువ్వే కనపడ్డావు.

(వీణాధరి మాటలకు ఉలికి పడతాడు. ఆవరించిన మైకం వదిలిపోతుంది. వీణాధరి కౌగిలి వదిలించుకోబోతాడు మరింత గాఢంగా అతణ్ణి హత్తుకుపోతుంది వీణాధరి )

వీణా :—వద్దు రఘూ! నన్ను వదలకు! నాకు దూరంకాక యీ రెండేళ్ళు ఎంత నరకం అనుభవించానో నీకు అర్థంకాదు. మళ్ళీ నన్నా నరకంలోకి తొయ్యకు. బ్రతుకుకంటే చావే బాగుంది నాకు.

రఘు :—వీణా! నువ్వు చచ్చిపోలేదు. ఇది హాస్పిటల్; నలుగురూ చూస్తున్నారు. వదులు.

(రఘును వదిలి చుట్టూ చూస్తుంది. బెడ్‌మీద వాలిపోయి అయోమయంగా రఘును చూస్తుంది.)

వీణా :—నేను చచ్చిపోలేదా? ఎలా? ఎలా బ్రతికాను నేను? అసం భవం.... ...

రఘు:—అదృష్టం! నీకూ కుసుమకూ కూడా పరవాలేదు.

వీణా:—అంటే? ఆయన? ప్రభాకరరావుగారు?

రఘు:—నువ్వు ఉద్రేక పడకు వీణా! నీ ఆరోగ్యానికి మంచిదికాదు

వీణా:—నా ఆరోగ్యం గంగతో కలవనీ! ప్రభాకరరావుగారి కేమ యిందో చెప్పు ఎక్కడున్నారు?

రఘు:—ఆయన.... ఆయన....

(వీణాధరి అర్థంచేసుకుని ఆర్తనాదం చేస్తుంది.)

వీణా:—ఆయన చచ్చిపోయారా? నేను బ్రతికానా? వీల్లేదు. అలా జరగటానికి వీల్లేదు. నేను చచ్చిపోవాలి. ఆయన బ్రతకాలి. అంతా తలక్రిందులయింది. ఇది నేను భరించలేను. నేను చచ్చి పోవాలి! చచ్చిపోవాలి!

(పిచ్చిదానిలా తల మంచానికేసి బాదుకుంటుంది. రఘు కంగా రుగా పట్టుకుంటాడు.)

రఘు:—వీణా! ఏమిటీ పిచ్చి! కొద్దిగా నిగ్రహించుకో! నిజమే! ఇది భరింపరాని కష్టమే! కాని....

వీణా:—ఈ క్షోభ నీ కర్థం కాదు, రఘూ! రఘూ! దీనావస్థలో ఉండి ఒక సహాయం కోరతాను. చేస్తావా?

రఘు:—తప్పకుండా చేస్తాను. ఏం చెయ్యను?

వీణా:—నన్ను వెంటనే చంపేసే మందు ఏదైనా ఇయ్యి. త్వరగా ఇయ్యి. నాకు విముక్తి కలిగించు.

రఘు:—వీణా! నేను డాక్టర్ని. మనుష్యుల్ని బ్రతికించే వృత్తి నాది!

వీణా:—ఇప్పుడు నువ్వు నన్ను చంపికాని బ్రతికించలేవు. ప్లీజ్ రఘూ! నన్ను కనికరించు! ఇంత వ్యధ నేను భరించలేను.

రఘు:—(కొంచెం ఆశ్చర్యంగా). నువ్వు ఎలాగో నీ సంసారంలో సర్దుకుంటావనుకున్నాను. కానీ ప్రభాకరరావుగారిని ఇంతగా ప్రేమిస్తావనుకోలేదు.

వీణా:—సంసారంలో సర్దుకుంటా ననుకున్నావా? నేను.... నేను.... ప్రభాకరరావుగారిని ప్రేమిస్తున్నానా?

(విరగబడి నవ్వుతుంది. రఘు వారించబోతాడు. విదిలించుకుని పిచ్చిదానిలా నవ్వి నవ్వి సొమ్మసిల్లి పడిపోతుంది. రఘు స్మెల్లింగ్ సాల్ట్ వాసన చూపిస్తాడు. ప్రయోజనం లేకపోగా ఇంజక్షన్ ఇస్తాడు. కొంతసేపటికి వీణాధరి కళ్లు తెరుస్తుంది.)

వీణా:—కుసుమ....కుసుమ ఎలా ఉంది రఘూ?

రఘు:—ప్రాణాలకు భయంలేదు.

వీణా:—పోనీ, కుసుమ అయినా క్షేమంగా ఉంది. ఒకసారి ఇక్కడకు రమ్మను రఘూ!

రఘు:—కుసుమ రాలేదు వీణా! పాపం! కుసుమకు ఒక కాలు పూర్తిగా పోయింది,

వీణా:—ప్రభాకరరావుగారు పోయారా? కుసుమకు కాలు విరిగిందా? నేను మాత్రం రాయిలా ఉన్నానా? భగవంతుడా! రఘూ! నేను బ్రతుకుతాను. కుంటి కుసుమకోసం తప్పకుండా బ్రతుకుతాను. కాలు కుంటు పడినా, జీవితం కుంటు పడకుండా అడ్డుకుంటాను.

రఘు:—నీ కూతుర్ని నువ్వింతగా అభిమానిస్తున్నందుకు చాలా సంతోషంగా ఉంది వీణా!

(వీణాధరి నిరసనగా విరక్తిగా నవ్వుతుంది ఆ నవ్వు చూసి ఆశ్చర్యపోతాడు రఘు.)

వీణా:—రఘూ! నన్ను కుసుమ దగ్గిరకి తీసికెళ్ళు.

రఘు:—కుసుమ శరీరంలోంచి రక్తం చాలా పోయింది. కొద్ది క్షణాల క్రిందటే స్పృహ వచ్చింది. ఎలా ఉందో నేను చూసి తరువాత నిన్ను తీసికెళ్తాను.

వీణా:—కుసుమకు రక్తం కావాలంటే నేనిస్తాను.

రఘు:—ఆ అవసరం లేదు. బ్లడ్ బేంక్‌లో కుసుమ గ్రూప్ రక్తం దొరికింది. కుసుమ సర్జరీ వార్డ్‌లో ఉంది. చూసి వస్తాను.

* * *

(కాలికి కట్లతో కుసుమ బెడ్‌మీద ఉంటుంది. రఘు వస్తాడు.)

రఘు:—కుసుమా! ఎలా వుందమ్మా?

కుసుమ:—చాలా హాయిగా ఉంది డాక్టర్.

(బాధగా నవ్వుతుంది.)

రఘు:—ఎంత బాధనైనా చిరునవ్వుతో భరిస్తావు కుసుమా!

కుసుమ:—అమ్మ పోయినప్పటినుండీ బాధ భరించటం అలవాటయి పోయింది డాక్టర్!

రఘు—ఒక అమ్మపోయినా. మరో అమ్మ వచ్చిందిగా!

కుసుమ:—ఆవిడ మా నాన్నగారికి భార్యకాదు. నాకు అమ్మా కాదు.

రఘు:—కుసుమా!

కుసుమ:—సారీ డాక్టర్! ఏదో మాట్లాడేసాను. ఇలాంటి మాటలు ఎక్కడా మాట్లాడనని మానాన్నగారికి మాటిచ్చాను.

రఘు:—ఏమిటి కుసుమా! ఏం జరిగింది?

కుసుమ:—నన్ను క్షమించండి డాక్టర్! మీకు నేనేం చెప్పలేను. మీకే కాదు లోకంలో ఎవరికీ ఏం చెప్పుకోలేను. నన్ను మాట్లాడించకండి. మనసంతా అల్లకల్లోలంగా ఉంది. తల్లీ తండ్రీ లేని అనాధనయ్యాను.

(కుసుమ కళ్ళలో నీళ్లు నిలుస్తాయి. రఘు ఆప్యాయంగా ఆ కన్నీళ్ళు తుడుస్తాడు.)

రఘు:—అంతమాట అనకు కుసుమా! వీణాధరి....మీ అమ్మ.... నిజంగానే నిన్ను అభిమానిస్తోంది. నీకిలా కాలు తెగిందని విని చాలా బాధపడింది. అవసరమయితే తన రక్తం ఇస్తానంది.

కుసుమ:... ఆవిడ ఏదైనా అనగలదు. ఏమైనా చెయ్యగలదు. రక్తం ఇస్తానందా? అదృష్టవంతురాలిని, మీరా రక్తం తీసుకోలేదు. ఆ విషపు రక్తంతో ప్రాణాలు నిలుపుకొనే కంటె నా ప్రాణాలు పోతేనే సుఖం నాకు.

రఘు:—అంతగా ద్వేషిస్తున్నావా, మీ అమ్మను?

కుసుమ:—మీకు పుణ్యం ఉంటుంది, ఆ 'అమ్మ' అనే పదాన్ని వాడకండి, పవిత్రమైన ఆ సంబోధనకు అర్హురాలు కాదావిడ! ద్వేషిస్తున్నానా? అవును. తీవ్రంగా ద్వేషిస్తున్నాను. నాకే శక్తి ఉంటే తరువాత ఏదెలా జరిగినా, నా చేతులతో ఆవిడ పీక నులిమేద్దును. కాని. మా నాన్నగారు నా చేతులను బంధించి వెళ్ళారు. నా ప్రాణమున్నంతవరకూ ఆవిడకి ఏలోటూ రానివ్వను.

రఘు:—చిత్రంగా ఉంది. ప్రేమతోనో, ద్వేషంతోనో మీరిద్దరూ ఒకరినొకరు ఆదుకోవటానికే సంకల్పించుకున్నారు . మీ అమ్మ.... సారీ....వీణాధరి....నిన్ను చూడాలను కుంటోంది. రమ్మననా?

కుసుమ:—వద్దు! వద్దు! డాక్టర్! ఇప్పట్లో నేనావిడ ముఖం చూడలేను. నాకింకా అంతశక్తి రాలేదు. ఇంకా కొన్నాళ్లు పోనియ్యండి. నన్ను కాస్త నిగ్రహం తెచ్చుకోనియ్యండి. నేనిలా అన్నానని చెప్పండి....

రఘు:—అనవసరంగా దేనిని గురించీ ఆందోళనపడకు కుసుమా!

కుసుమ:—మీరు ఆ వీణాధరి ప్రస్తావన తేనంతవరకూ ఎలాంటి ఆందోళనా పడను. ఎలాంటి కష్టాలైనా భరించగలను.

(భారంగా కళ్ళుమూసుకుంటుంది. రఘు నెమ్మదిగా అక్కడినుంచి వెళ్ళిపోతాడు.)


(వీణాధరి బెడ్‌మీద వరిగి కూచుని ఎటో శూన్యంలోకి చూస్తూ ఉంటుంది. రఘు అడుగుల చప్పుడుకు త్రుళ్ళి పడు తుంది.)

రఘు:—నేనే! ఎందుకలా త్రుళ్ళిపడ్డావ్?

వీణా:—నాకు.... నాకు.... చాలా భయంగా ఉంది.

రఘు:—భయమా? నీ కంటె చిన్నపిల్ల కుసుమే నయం. కాలుపోయినా ధైర్యంగా నవ్వుతోంది.

వీణా:—నాకు రెండు కాళ్ళూ, రెండు చేతులూ పోయినా, రెండు కళ్ళూ పోయినా, నవ్వగలిగి ఉండే దాన్ని. కాని....




రఘు:....ఏవిటి వీణా! ఎందుకింత క్షోభ పడుతున్నావ్? దేనికా కలవరం? ఒక్కసారి ముఖం తుడుచుకో! శరీరమంతా ఎందుకిలా చమటలు పడుతోంది? దేనికింతగా ఉద్వేగపడుతున్నావ్?

వీణా:—(ఆర్తితో రఘు చెయ్యిపట్టుకుని) రఘూ! ఒక్క వాగ్దాన మియ్యి. ఈ రాత్రి నన్ను వదలనని మాటియ్యి. చీకటి భరించ లేక నాలో పిశాచాలు లేచి నన్ను అల్లరి పెడ్తున్నాయి. నేనిది భరించలేను.

రఘు:—(గతుక్కుమని)! రాత్రంతా నీ దగ్గిర ఉండమంటావా? అసంభవం. కమల నాకోసం ఎదురు చూస్తూ ఉంటుంది.

వీణా.—కమల ఎవరు?

రఘు:....నా భార్య.

(వీణాధరి అప్రయత్నంగా రఘు చెయ్యివదిలేస్తుంది. క్షణ కాలం ముఖంమీద నల్లని తెర అవరించినట్లవుతుంది. కళ్ళలో భరింపరాని అసూయ ఒక్కసారి పొంగి అంతలో అణిగి పోతుంది.)

వీణా!—పెళ్ళి చేసుకున్నావా?

రఘు:—నీ పెళ్ళి అయ్యాక....

వీణా:—(అదరుతున్న పెదవులతో) నా పెళ్ళి!.... అది పెళ్ళి.... నేను.... నేను—

(నిలువెల్లా వణుకుతుంది. మళ్ళీ రఘు చెయ్యి గట్టిగా పట్టు కుంటుంది.)

వీణా:—వెళ్ళకు రఘూ! నువ్వు వెళ్ళితే భయంతో నా గుండె పగిలి పోతుంది.

(ప్రాధేయపడుతున్న వీణాధరి కంఠం వింటూ, జాలిగా ఉన్న వీణాధరి చూపులు చూస్తూ కఠినంగా ఉండలేక పోతాడు.)

రఘు: —ఏమైనా తిన్నావా?

వీణా:—లేదు. తినాలని లేదు.

రఘు;—ఉన్నా లేకపోయినా తినాలి. అక్కడక్కడ చిన్న చిన్న దెబ్బలు తప్ప నువ్వు బాగానే ఉన్నావు.

వీణా:—బాగా పైకి కనిపిస్తున్నాను. కానీ రఘూ! వద్దు. నువ్వు వెళ్ళద్దు. ప్లీజ్!

రఘు:—కానీ, ఎన్నాళ్ళు నీతో ఉండగలను? రెండు మూడు రోజుల్లో నువ్వు హాస్పిటల్ నుంచి వెళ్లిపోతావు. అప్పుడు?

వీణా:—కుసుమకు రెండు మూడు రోజుల్లో నయమయిపోతుందా?

రఘు;—కుసుమను డిస్చార్జి చెయ్యడానికి ఇంకా వారం రోజులు పైగానే పడుతుంది.

వీణా:—కుసుమను వదిలి నే వెళ్తానా?

రఘు:—కానీ....కుసుమ....

వీణా:—నాకు తెలుసు. నన్ను చూడటానికి రావద్దంది.


రఘు:—అంటే ? మీ ఇద్దరికీ మొదటినుంచీ ఒకరంటే ఒకరికి పడదా ? కుసుమ....

వీణా:—కుసుమ చాలా మంచిది. పాపం, నేనంటే చాలా అభిమా నంగా ఉండేది.

రఘు:—ఇప్పు డెందు కింత ద్వేషం?

వీణా:—నా కర్మ ! రఘూ ! కంటినిండా నిద్రపోయి ఎన్నిరోజు లయిందో చెప్పలేను. నా మనసూ, శరీరమూ అలిసిపోయాయి. వెళ్ళకు రఘూ! నువ్వు నా దగ్గిరున్నావన్న ధైర్యంతో నిశ్చింతగా నిద్రపోతాను.

(కొంచెంసేపు తటపటాయిస్తూ పచారులు చేస్తాడు. అలసటతో, ఆవేదనతో పడిలిపోయిన వీణాధరిని చూస్తాడు.)



రఘు:—ఇదిగో! వెంకయ్యా! ఇంటికెళ్ళి అమ్మగారితో ఇవాళ ఇంటికి రాలేనని చెప్పు. హాస్పిటల్లో ఉండిపోవలసి వచ్చింది. నాకోసం ఎదురుచూడక భోజనంచేసి నిద్ర పొమ్మను.

(ఒక కుర్చీ వీణాధరి మంచం దగ్గిరగా లాక్కుని కూర్చుంటాడు. వీణాధరి అతని చెయ్యి అందుకుని, తన చెక్కిలి కానించుకుని నిద్రపోతుంది.)

*　　　*　　　*

(కమల కేరియర్‌తో ప్రవేశిస్తుంది. కుర్చీలో కూర్చునివున్న రఘును, రఘు చేతిని తన చేతిలో ఉంచుకుని నిద్రపోతున్న వీణాధరిని చూస్తుంది. బొమ్మలా నిలిచిపోతుంది. రఘు కంగారుగా లేవబోతాడు. నిద్రలోనే వీణాధరి అతని చెయ్యి మరింత గట్టిగా పట్టుకుని అస్పష్టంగా కలవరిస్తుంది. రఘు నెమ్మదిగా చెయ్యి వదిలించుకుని లేస్తాడు.)

రఘు:—కమలా! నువ్వు....ఎందుకొచ్చావ్?

కమ;—ఇంటికి రానని కబురు చేసారు. మీ భోజనం తీసుకొచ్చాను.

రఘు :—ఎందుకింత శ్రమ! నే నెక్కడో ఏదో తినేవాణ్ణిగా!

కమల :—ఇదివరకు ఎన్నెన్నో సీరియస్ కేసులొచ్చాయి. ఒక్కొక్క సారి రాత్రిళ్ళు హాస్పిటల్‌లో ఉండవలసి వచ్చినా, ఇంటికొచ్చి భోజనంచేసి వెళ్ళేవారు. అలాకూడా రాలేకపోయారంటే, ఎక్కడో ఏదో తినే తీరిక మీకుంటుందని ఎలా ఊహించుకోను?

(కమల పడుకునివున్న వీణాధరిని చూస్తుంది. రఘు కలవరపడ్తాడు.)

రఘు:—మరీ అంత ప్రమాదకరమైన పరిస్థితి కాదు. కానీ, నేను లేకపోతే నిద్రపోదు. నిద్రపోకపోతే....

కమల:—మీరు లేకపోతే నిద్రపోదా?....

రఘు:—అంటే....అది....

కమల:—ముందు భోజనం చెయ్యండి. ఆ తరువాత మాట్లాడుకుందాం! పదండి.

(కమల రఘు విశ్రాంతి గదిలోకి దారితీస్తుంది. రఘు ఆలోచిస్తూ వెనకే వెళ్తాడు. కాళ్లూ చేతులూ కడుక్కున్న రఘుకు కమల భోజనం వడ్డిస్తుంది.)

రఘు:—కమలా! ఆవిడ....

కమల:—కడుపునిండా తినండి. పొద్దునకూడా సమంగా తినలేదు.

రఘు:—ఆవిడ స్థితి....

కమల:—ప్రమాదం లేదు కదా?

రఘు:—ప్రమాదమేం లేదు. కాని....

కమల:—హమ్మయ్య! ఇంక మీరు నాకేం వివరించక్కర్లేదు. పెరుగు బాగా వేసుకోండి. లేకపోతే వేడి చేస్తుంది.

(కమల అక్కడి నుండి లేచి వెళ్తుంది రఘు భోజనం ముగించుకుని వార్డులోకి వస్తాడు. అంతకుముందు రఘు కూర్చున్న కుర్చీ స్థానంలో పడక కుర్చీ, దిండు ఉంటాయి )

కమల :—రాత్రంతా అలా కుర్చీలో కూర్చుంటే నడుం లాగుతుంది. ఈ వాలు కుర్చీలో పడుకోండి!

రఘు :—(బాధగా) కమలా!

కమల :—ఏం?

రఘు :—పద నేనూ నీతో వస్తాను.

కమల:—వద్దు. వద్దు. మీరు ప్రపంచ ప్రఖ్యాతిగన్న డాక్టర్లలో ఒకరు కావాలని నాన్నగారి ఆశయం. నా ఆశయమూ అదే! నా ప్రేమ మీ డ్యూటీకి అడ్డు తగలదు. వస్తాను.

(చిరునవ్వుతో వెళ్ళిపోతుంది. వాలు కుర్చీలో వాలి బాధగా నుదురు రాసుకుంటాడు. అంతలో వీణాధరి ఉలికిపడి లేచి కూచుంటుంది.)

వీణా :—నా తల దేనికో గుద్దుకున్నట్లనిపించింది. తల పగిలిపోతోంది.

రఘు :—మానసికంగా నువ్వా అనుభూతిలోంచి బయట పడలేకపోతున్నావు.

వీణా :—అసలే తలనొప్పిగా ఉంటే ఈ దిండు మరింత గుచ్చుకుంటోంది.

(రఘు తన దిండుతీపి వీణాధరి తలక్రింద పెడతాడు.)

వీణా :—రఘూ! ఇక్కడినుండి వెళ్ళిపోవుగా!

రఘు :—ఏవిటా పిచ్చి! నీ ఎదురుగానే ఉన్నానుగా!

(రఘు చెయ్యి గట్టిగా పట్టుకుని మళ్ళీ కళ్ళు మూసుకుంటుంది.)

*　　　*　　　*

(వీణాధరి కళ్ళు తెరుస్తుంది. ఎదురుగా నర్స్ కనిపిస్తుంది.)

వీణా :—రఘు ఎక్కడ?

నర్స్ :—డాక్టర్‌గారు యింటికెళ్ళారు.

వీణా :—ఎందుకు?

నర్స్ :—(నవ్వుతూ) అదేం ప్రశ్న! ఎవరెవరు ఎక్కడెక్కడ ఎంత

సేపున్నా చివరకు ఎవరింటికి వాళ్ళు వెళ్ళవలసిందేగా!

(వీణాధరి ముఖం పాలిపోతుంది. ఏం మాట్లాడదు. లేచి కుసుమ వార్డులోకి వస్తుంది.)

వీణా :—కుసుమా!

కుసు :—నువ్వా? పొద్దున్నే ఎందుకొచ్చావ్?

వీణా :—ఎలావుంది కుసుమా!

కుసు :—నా ప్రాణాలు పోలేదు. పోవని కూడా చెప్పారు.

వీణా :—అదృష్టం.... ..

కుసు :—ఎవరికి?

(దగ్గరగా రాబోతుంది. కుసుమ చీదరించు కుంటూంది.)

కుసు :—నీకు పుణ్యముంటుంది. నా దగ్గిరకురాకు. నన్ను ముట్టుకోకు. నువ్వు నా మీద ప్రేమ నటించక్కర్లేదు. నీకు నెలకి మూడు వందలిమ్మన్నారు నాన్నగారు ఇస్తాను. వెళ్ళు.

వీణా :—కుసుమా! నన్ను నమ్ము. డబ్బుకోసం నేను నీ దగ్గిరకి రాలేదు.

కుసుమ :—(కసిగా) డబ్బు కోసం కాదు. మా నాన్నగారిని గాఢంగా ప్రేమించినట్లే నన్నూ ప్రేమిస్తున్నావు. నమ్ముతున్నాను.

వీణా :—(దెబ్బతిన్నట్లయి) మీ నాన్నగారిని డబ్బుకోసమే చేసుకున్నాను. కాని........

కుసుమ :—వద్దు! మాట్లాడకు! ఇప్పటికే మానవత్వంలో నా కుండే విశ్వాసం నశిస్తోంది. నా మీద నిజంగా నీకు అభిమానముంటే వదిలి వెళ్ళు-నిన్ను చూస్తున్నకొద్దీ నాకు పిచ్చెక్కుతోంది వెళ్ళు.

(వీణాధరి తలవాల్చుకుని వచ్చేసి తన బెడ్‌మీద కూర్చుంటుంది. అప్రయత్నంగా ఆమె చూపులు దిండుమీద పడతాయి. అందంగా ఎంబ్రాయిడరీ చేసిన పువ్వుల మధ్య 'R' అనే అక్షరాన్ని తదేకంగా చూస్తూ ఉంటుంది, రఘు వచ్చిన విషయం గమనించదు)

రఘు:—వంట్లో బాగా కులాసాగా ఉన్నట్లుంది. అవునా?

(వీణాధరి రఘును చూసి నవ్వి అంతలో మూతి ముడుచుకుని ముఖం తిప్పుకుంటుంది.)

రఘు:—నా మీద నువ్వు కోపం తెచ్చుకోవటం అన్యాయం. నీకు బాగా నిద్ర పట్టేవరకూ ఇక్కడే ఉన్నాను. ఇంటి దగ్గిర తప్ప నాకు నిద్రరాదు. ఒక గంటైనా నిద్రపోకపోతే, ఇవాళ నా డ్యూటీ సమంగా చెయ్యలేను.

(వీణాధరి చెవుల్లో 'ఇంటి దగ్గర తప్ప నిద్రరాదు.' అనే వాక్యం మారుమ్రోగుతుంది. తదేకంగా దిండునే చూస్తూ కూర్చుంది.)

రఘు:—ఎంబ్రాయిడరీ బాగుందా? కమల కుట్టింది. రాత్రి కూడా నే వెళ్ళేవరకు కుడ్తూనే ఉంది. నన్ను చూసి నేను మందలిస్తాననే భయంతో ఆపేసింది. వెళ్ళటం మంచి పనే చేసాను. లేకపోతే కమల రాత్రంతా మేలుకునే ఉండేది!

వీణా:—(అకస్మాత్తుగా) నువ్వు కమలను ప్రేమిస్తున్నావా?

రఘు:—(గతుక్కుమని) ఆ విషయం నేనెప్పుడూ ఆలోచించలేదు. కమల నా భార్య.

వీణా:—నేను? నా మీద ప్రేమ లేదా నీకు?

రఘు:—నేను రౌండ్స్‌కు వెళ్ళాలి. ఇప్పుడే వస్తాను.

(త్వర త్వరగా వెళ్తాడు.)

* * *

(కుసుమ ప్లాస్టిక్ కాలుతో నడవటానికి ప్రయత్నిస్తూ ఉంటుంది. చిట్టి వస్తాడు. కుసుమ చటుక్కున కూర్చుంటుంది.)

చిట్టి:—క్షమించండి. బాబాయ్ ఇక్కడ ఉన్నాడంటే వచ్చాను.

కుసుమ:—ఈ ప్లాస్టిక్ కాలుతో నడవటం అలవాటు చేసుకోమని నాతో చెప్పి ఇప్పుడే ఎక్కడికో వెళ్ళారు.

(ఆవేదనతో కాలువంక చూసుకుంటుంది.)

చిట్టి:—మీరు చాలా అదృష్టవంతులు. ఈ ప్లాస్టిక్ కాలు మూలంగా సహజంగానే వయ్యారంగా నడవగలరు. రెండు కాళ్ళూ తిన్నగా ఉన్నవాళ్లు వయ్యారంగా నడవాలని ఎంత తిప్పలు పడతారో తెలుసా?

కుసుమ:—భలేవారు. దురదృష్టాన్ని అదృష్టంగా చూపిస్తున్నారు.

చిట్టి:—అలా చూడటం నేర్చుకోవాలి. మీరు....

కుసుమ:—ప్రభాకరరావుగారి అమ్మాయిని.

చిట్టి:—అంటే లక్షాధికారి ప్రభాకరరావుగారి....

కుసుమ:—అబ్బ! ఈ డబ్బు ప్రస్తావన లేకుండా నాతో మాట్లాడగలిగే ప్రాణి కనబడటం లేదు.

చిట్టి:—పాపము శమించుగాక! చూడండి ప్రతి మనిషికీ ఇంటిపేరు కాకుండా కొన్ని ఆనవాలు పేర్లు ఉంటాయి. మెల్లకన్ను సోమేశ్వరరావు. జిడ్డు సీతాపతి అప్పుల రామారావు, వెట్టి మాలోకం సుభద్రమ్మ, గయ్యాళి సుందరమ్మ, చాదస్తపు మహాలక్ష్మమ్మ ఇత్యాది. అలా మీ నాన్నగారి ఆనమాలు నామధేయం లక్షాధికారి. రేపొక వేళ ఆ లక్షలుపోయినా ఈ బిరుదుపోదు, జమీందారీపోయినా జమీందారు బిరుదుపోనట్లు ... అంతే!

కుమసు:—మీరు చాలా సరదాగా మాట్లాడతారు. ఎప్పుడైనా వస్తూ వుండండి.

చిట్టి:—ఎప్పుడూ వస్తుంటాను.

(చిట్టి వెళ్లిపోతాడు. కుసుమ తనలో తను నవ్వుకుంటుంది. వీణాధరి వస్తుంది.)

వీణా:—ఎవరతను?

కుసు:—(ముఖం చిట్లించుకుని) డాక్టర్‌గారి బంధువు....

వీణా:—రఘు బంధువా? నమ్మేలాలేదు. చవటలా ఉన్నాడు.

కుసు:—నాకు చాలా మంచివాడిలా కనిపించాడు.

వీణా:—ఎవరిని పడితే వాళ్ళను నమ్మకూడదు కుసుమా!

కుసు:—ఆ విషయం నువ్వు చెప్పక్కర్లేదు. అనుభవంమీద తెలుసుకున్నాను. (హేళనగా నవ్వుతుంది.)

(ఒక్కక్షణం వీణాధరి బాధపడుతుంది. అంతలో తనను తను నిగ్రహించుకుంటుంది.)

వీణా:—నన్ను ఎంత దెప్పినా పరవాలేదు. నీ బ్రతుకు పాడు చేసుకోకు!

కుసు:—నువ్వు కల్పించుకోకుండా ఉంటే నా బ్రతుకు పాడవదు.

(ఎంత చెప్పినా ప్రయోజనం లేదని దీర్ఘంగా నిట్టూరుస్తుంది.)

వీణా:—ఇంక నిన్ను ఇంటికి తీసికెళ్ళచ్చు అన్నారు డాక్టరుగారు.

కుసుమ:—నన్ను ఇంటికి నువ్వు తీసికెళ్ళక్కర్లేదు. మరోమాట! ఇంకముందు మనం ఒకే ఇంట్లో ఉండక్కర్లేదు.

వీణా:—ఒంటరిగా ఉంటావా?

కుసు:—మంచి మనసుకల నమ్మకస్థురాలైన ఆయాతో ఉంటాను. నువ్వు నీ యిష్టమొచ్చిన చోట ఉండు. నాకు ఎడ్రసిస్తే ఏనెలకానెల నీకు డబ్బు పంపిస్తాను.

వీణా:—అక్కర్లేదు.

కుసు:—చెయ్యి జాపి తీసుకునేవాళ్ళకు పౌరుషం పనికిరాదు.

వీణా:—కుసుమా!

కుసు:—ఏం? ఒకప్పుడు నువ్వు తీసుకున్నది బిచ్చంకాదా? ఇప్పుడెందుకీ పౌరుషం?

వీణా:—ఆ బిచ్చం తీసుకున్నది మీ నాన్నగారు. నేను కాదు. డబ్బంతా నీదని అప్పుడే నాకు తెలిసి ఉంటే....

కుసు:—మా నాన్నగారిని పెళ్ళి చేసుకునే దానివి కాదు. మేం సుఖంగా ఉండేవాళ్ళం. మా నాన్నగారు నాదగ్గిర బిచ్చం తీసుకున్నారంటావా? ఎంత దుర్మార్గురాలివి! అభిమానం, ఆప్యాయత ఉన్న వ్యక్తులు ఒకరి డబ్బు మరొకరు వాడుకుంటె బిచ్చం అనిపించుకోదు. అవేవీ లేకుండా వాడుకున్నప్పుడు, న్యాయంగా అయితే బిచ్చమవుతుంది. అన్యాయంగా అయితే కుట్ర అవుతుంది.

(వీణాధరి భరించలేక వేదనతో వెళ్ళిపోతుంది. కుసుమ కసిగా నవ్వుకుంటుంది.)

## 4

### (రుక్మిణి పెంకుటిల్లు)

రుక్మిణి:—సూపర్‌బజార్ కెళ్ళి ఈ సరకులన్నీ తెచ్చాను. ఇక్కడ కొట్లో ప్రతీదీ పదిపైస లెక్కువ.

వీణా:—సూపర్ బజార్ మన ఇంటికి చాలాదూరం కదు పిన్నీ! బస్‌ఛార్జీలు అవ్వవా?

రుక్మి:—బస్ ఛార్జీలా? ఎంతసేపు నిల్చున్నా వెధవ బస్సు రాలేదు. అందుకని టాక్సీలో వెళ్ళాను. మళ్ళీ ఇంకో టాక్సీ దొరుకుతుందో, దొరకదో అని దాన్ని అక్కడే వుంచి సరకులన్నీ బేరంచేసి చవగ్గా కొని మళ్ళీ అదే టాక్సీలో వచ్చాను. ముందు జాగ్రత్త వుండాలి....

కృష్ణ:—నీ ఎకానమీ అద్భుతం పిన్నీ! ఇండియాకు ఆర్థిక మంత్రిణిగా ఉండదగినదానివి. పిన్నీ! ఇంకముందు, నువ్వు మరీ ఇంత పొందిగ్గా ఉండక్కర్లేదు. నా చదువు పూర్తయింది. ఎక్కడో ఒకచోట మంచి ఉద్యోగం దొరక్కపోదు. చాలాచోట్ల అప్లయ్ చేసాను. అక్కయ్యా! ఇదంతా నీ చలవ....

వీణా:—కృష్ణా! నువ్వు నాకొక్క సహాయం చెయ్యగలవా?

కృష్ణ:—తప్పకుండా చేస్తాను. చెప్పు.

వీణా:—చెప్పటానికి నోరు రావటం లేదు. ఈ సహాయం నిన్ను కోరటం ఒకవిధంగా నీకు అన్యాయమే! తప్పనిసరి పరిస్థితుల్లో కోరుతున్నాను.

కృష్ణ:—అదేమిటో చెప్పక్కయ్యా! నేను నిన్ను ఆ మాత్రం అర్థం చేసుకోగలను.

రుక్మి:—వాడికి అన్యాయం జరిగేలావుంటే ఎందుకే ఆ సహాయం అడగటం? ఏమిటా సహాయం?

వీణా:—ఏం లేదు పిన్నీ! ఊరికే తమాషాకన్నాను. కృష్ణా! మనం తర్వాత మాట్లాడుకుందాం!

రుక్మి:—వీణా! పక్కవీధి జ్ఞానేశ్వరి మొన్ననే తిరుపతి వెళ్లొచ్చిందట! చూసివద్దాం, వస్తావా?

వీణా:—నే నిప్పుడు రాలేను పిన్నీ! నువ్వూ, కృష్ణా వెళ్లండి.

కృష్ణ:—అటువైపు నాకూ పనివుంది. రా పిన్నీ!

(రుక్మిణి, కృష్ణ వెళ్ళిపోతారు. వీణాధరి ఆలోచిస్తూ కూర్చుంటుంది. రఘు వస్తాడు.)

రఘు:—ఎందుకు అర్జంటుగా రమ్మని ఫోన్ చేసావ్?

వీణా:—జీవిత సమస్యలు వెంటనే తేల్చుకోకపోతే ఎలా?

రఘు:—నీకేం సమస్య?


వీణా:—ప్రధానమైన తిండి సమస్య రఘూ! నన్ను పోషిస్తావా? లేక మాడి చావమంటావా?

రఘు:—(విభ్రాంతితో) లక్షాధికారి ప్రభాకరరావుగారి భార్య....

వీణా:—ప్రభాకరరావుగారి డబ్బు ఆయనది కాదు. అంతా మొదటి భార్యది. ఆవిడ పోయాక సమస్తమూ కుసుమకే చెందింది. ఆయన ఖర్చుపెట్టే ప్రతి పైసా, కుసుమ అనుమతితో కుసుమ నడిగిఖర్చుపెట్టారు. ఈ విషయం కుసుమ మొదట్లోనే సూచనగా అంది. అర్థం చేసుకోలేక పోయాను.

రఘు:—ఇప్పుడు కుసుమ నీకేమీ ఇవ్వనందా?

వీణా:—ఇస్తానంది. బిచ్చంగా ఇస్తానంది. ప్రేమాభిమానాలు కరువైన చోట ఇచ్చి పుచ్చుకోవటాలకు అంతకు మించి ప్రాధాన్యం లేదంది. నువ్వుండగా మరొకరిదగ్గిర బిచ్చం అడుక్కోవలసిన కర్మ నాకేమిటి?




రఘు:—నీ పిన్నిదగ్గిరే ఉంటావా?

వీణా:—ఉండను.

రఘు:—మరి?

వీణా:—నీతో వచ్చేస్తాను.

రఘు: — (అదిరిపడి)అసంభవం. నాకు పెళ్ళయింది.

వీణా:—అయింది. కానీ, ఆవిడను నువ్వు ప్రేమించటంలేదు.

రఘు:—వీణా!

వీణా:—ఆత్మవంచన లేకుండా చెప్పు. నన్ను పూర్తిగా మరిచిపోయావా? నీకు నేనేమీ కానా? కమలను ప్రేమిస్తున్నావా నువ్వు?

రఘు:—కమల నా జీవితంలో ఒక భాగం. మా మంచి చెడ్డలు కష్టసుఖాలు అన్నీ ఒక దానితో ఒకటి పెనవేసుకునే ఉంటాయి. సంసారమంటేనే అది!

వీణా:—నిన్ను సంసారమంటే ఏమిటో అడగటం లేదు. 'నా మీద ప్రేమ లేదా' అని అడుగుతున్నాను.

(రఘు దగ్గిరగా వచ్చి భుజాలమీద చేతులువేసి కళ్ళలోకి చూస్తుంది. రఘు వీణాధరి చేతులు తొలగించబోతాడు. అప్రయత్నంగా అతని చేతుల్లో వీణాధరిచేతులు ఇమిడిపోతాయి. కొన్ని క్షణాలలా ఉండిపోయి నెమ్మదిగా విడిపించుకుంటాడు.)

రఘు:—నన్ను హింసించకు వీణా!

వీణా:—సరే! హింసించను. వెళ్లు. నువ్వు నాకే సహాయమూ చెయ్యక్కర్లేదు. కుసుమ దానాన్ని తిరస్కరించింది. మరొకరి దగ్గిర బిచ్చం అడుక్కోవటానికి కాదు.

రఘు:—ప్రేమాభిమానాలు లేనిచోట తీసుకుంటే బిచ్చం అవుతుంది. నా దగ్గిర తీసుకుంటే అది బిచ్చమెలా అవుతుంది వీణా!

వీణా:—అంత అభిమానం ఉంటే నన్ను నీతో ఎందుకు తీసుకు వెళ్ళవు?

రఘు:—మానవుడు పుడుతోనే కుటుంబంలో ఒక భాగంగా పుడ్తాడు, సంఘ జీవిగా పెరుగుతాడు. ఏవో అజ్ఞాత సూత్రాలతనిని అనుక్షణమూ బంధించి ఉంటాయి. చెయ్యాలనుకున్నంత మాత్రాన అన్ని పనులూ చెయ్యలేడు. ప్రస్తుతానికి నువ్వు వేరే ఉండు. నీకేలోటూ రాకుండా చూస్తాను.

వీణా:—నీకెందుకీ అవస్థ! నేను వెళ్ళిపోతాను. ఈ ఊళ్ళోంచే వెళ్ళిపోతాను.

రఘు:—నేను వెళ్ళనివ్వను. నిన్ను చూడకుండా ఉండలేను.

వీణా:—(నిట్టూర్చి) నీకు దూరంగా ఉండగలిగే శక్తి నాకుంటే ఇన్ని అనర్థాలు జరిగేవి కావు.

రఘు:—కానీ, ఒకనాడు నీ అంతట నువ్వే నాకు దూరమయ్యావు. ప్రభాకరరావుగారిని పెళ్ళి చేసుకున్నావు.

వీణా:—చెల్లెలి కోసం తమ్ముడికోసం విధిలేక పెళ్ళి చేసుకున్నాను. కానీ ఆయనతో ఒక్కరోజు కూడా కాపురం చెయ్యలేదు.

రఘు:—దురదృష్టవశాన ఆయన చచ్చిపోయారు, లేకపోతే....

వీణా:—ఆయనతో సంసారం చెయ్యగలిగే శక్తి నాలో లేకపోబట్టే, ఆయన చనిపోయారేమో?

రఘు:—(ఆశ్చర్యంగా) ఏమిటి వీణా....

వీణా:— (విరక్తిగా) ఏం లేదు. అనుకున్న దొకటి. అయ్యేవొకటి! ఎప్పుడూ ఇంతే!

రఘు:—నీలో నువ్వు ఎందుకిలా కుమిలి పోతున్నావో, అర్థం కావటంలేదు. ఇలా అయితే నీ ఆరోగ్యం దెబ్బతింటుంది తెలుసా?

వీణా:—డాక్టర్వి! కుసుమకు మంచి సంబంధం కుదిరి పెళ్ళయ్యే వరకూ నన్ను బ్రతికించు! చాలు! ఆ తరువాత నన్ను గురించి నాకు చింతలేదు.

రఘు:—కుసుమ నిన్ను అసహ్యించు కుంటున్నా, కుసుమ నింతగా ప్రేమిస్తున్నావా నువ్వు?

వీణా:—నాకు లేని గొప్పతనాన్ని అంటగట్టకు రఘూ! కుసుమ అమాయకురాలు. పైగా ధనవంతురాలు, వంటరిది. ఏ మోసాలలోనూ పడకుండా కుసుమను కాపాడటం నావిధి....

రఘు:—వెళ్తాను వీణా! భోజనానికి వేళయింది.

వీణా:—ఇక్కడ భోజనం చెయ్యి.

రఘు:—వద్దు వీణా! వెళ్ళాలి.

వీణా:—ఒక్క రోజుకి ఈ పేదరాలి చేతి తిండి తినలేవా?

రఘు:—అలా మాట్లాడకు! సరే! ఇక్కడే తింటాను. కమలకు చెప్పివస్తాను. పాపం, భోజనం చెయ్యకుండా నాకోసం ఎదురు చూస్తూ ఉంటుంది.

వీణా:—వద్దు! నువ్వు కమలకు చెప్పి రావక్కర్లేదు. వెళ్ళు.

రఘు:—అదేవిటి వీణా!

వీణా:—వెళ్ళు! వెళ్ళు!

(లోపలికి పోయి దభాలున తలుపులు వేసుకుంటుంది. రఘు మూసిన తలుపుల కేసి అయోమయంగా కొన్ని క్షణాలు చూసి వెళ్ళిపోతాడు.)

*　　　*　　　*

(వీణాధరి ప్రత్యేకంగా ఉంటున్న ఇల్లు-రఘు వస్తాడు.)

రఘు —వీణా శుభవార్త.

వీణా:—నీ ముఖం చూస్తేనే అర్థమవుతోంది ఉత్సాహంతో వెలిగి పోతుంది. ఏమిటో చెప్పు.

రఘు:—నేను తండ్రి నయ్యాను. కమలకు మొగబిడ్డ. ఇవిగో స్వీట్స్.

(వీణాధరి ముఖం పాలిపోతుంది. అది చూసి రఘు ఆశ్చర్య పోతాడు.)

రఘు:—వీణా! ఈ వార్త నీకు సంతోషం కలిగించటంలేదా!

వీణా:—నీబిడ్డకు తల్లిని నేను కాగలిగితే నీకంటె ఎక్కువగా ఆనందించే దానిని....

రఘు:—ఛీ! ఛీ! అలా మాట్లాడకు.

వీణా:—ఏం? కమల నిన్ను ఎంతగా ప్రేమిస్తోందో నేనూ అంతగానే ప్రేమిస్తున్నాను. కమల ఎంతటి శీలవతో నేనూ అంతే శీలవతిని. నీబిడ్డకు తల్లిని కాగలిగే అర్హత నాకు ఎందుకు లేదు? నాకే ఎక్కువగా ఉంది. నువ్వు కమలను ప్రేమించటం లేదు. నన్ను ప్రేమిస్తున్నావు. నిజం చెప్పు. నా బిడ్డకు తండ్రివి కావాలని లేదూ?

రఘు:—లేదు! ఆ బిడ్డను సమాజానికి ఏమని పరిచయం చెయ్యను? సంఘం కాకుల్లా ఆ బిడ్డను పొడుస్తుంటే ఎలా భరించను? తాను చెయ్యని నేరానికి ఆ శిశువు శిక్ష ననుభవిస్తూ తనకు జన్మనిచ్చిన వారిని నిందించుకుంటూ ఉంటే 'నీతండ్రి' నని ఆ బిడ్డముందు ఎలా నిలువగలను?

వీణా:—(కసిగా) పాడు సమాజం! ఎవరి బ్రతుకు వారిని బ్రతకనివ్వరు.

రఘు:—సమాజమంటే ఏమిటి? మానవ సమూహమేగా! అధిక సంఖ్యాకులకు అన్నివిధాలా అనుకూలంగా ఉండే సూత్రాలతోనే సామాజిక వ్యవస్థ రూపుదిద్దుకొంది. ఈనాటి శిశువులే రేపు పెరిగి పెద్దయి సమాజంలో ఒక భాగమవుతారు, సమాజానికి నూతన బలాన్ని కల్పిస్తారు. అంచేత ఆ సామాజికశిశువు ఉనికి సూత్రాల ఒద్దికలో ఇమడకపోతే సమాజం భరించదు. అది సహజం. న్యాయం.

వీణా:—సమాజంలో ఉన్న ఆచారాలన్నీ సవ్యమైనవేనా?

రఘు :—కాకపోవచ్చు. ఒకనాడు ఒక దశలో అవసరమైన ఆచారాలు మరొక దశలో అవసరం కావు. అనర్థకం కూడా అవుతాయి. అలాంటి ఆచారాలు నిలవవు. నశించిపోతాయి మనిషి అలవాటుకు బానిస కనుకా, అందరూ ఏకాభిప్రాయానికి రావటం కష్టం కనుకా, అలాంటి ఆచారాలు నశించి కొత్తవి ఏర్పడటానికి కొంత ఘర్షణ తప్పదు. కానీ, ఏవేవి ఎలామారినా కుటుంబ వ్యవస్థ మాత్రం మానవ సమాజంలో చెక్కుచెదరదు. ఎందుకో తెలుసా? చక్కని కుటుంబవాతావరణంలోనే తప్ప సమగ్రవ్యక్తిత్వం రూపు దిద్దుకోదు. సమాజం ఆరోగ్యంగా వుండాలంటే అలాంటి సంపూర్ణవ్యక్తులే కావాలి.

వీణా :—రఘూ! నా ఆశలూ, అనురాగాలూ, అన్నీ నీ చుట్టూ అల్లుకున్నాను. నీ సరసన నాకు స్థానం యియ్యలేవా? ఈ ఆర్తి నీకు అర్థం కాదా?

రఘు :—నీ ఆర్తి నేను అర్థం చేసుకోగలను. మన నిస్సహాయస్థితి నువ్వు అర్థం చేసుకోవటం లేదు. నా సరసన నీ స్థానం ఈ నాడు గౌరవాన్ని కలిగించలేదు, అప్రతిష్ట తప్ప—ఒక డాక్టరుగా, అనేకులచే ఆరాధింపబడే నేను నా జీవితంలోకి అప్రతిష్టను ఆహ్వానించలేను. అంతేకాదు, కమలను కష్టపెట్టే అధికారం నాకులేదు. ఇదివరకు నా సహచరిణి. ఇప్పుడు నా బిడ్డకు—నా భావి బంగారు కలల ప్రతి రూపానికి తల్లి........

(వీణాధరి ముఖం రోషంతో జేవురిస్తుంది.)

వీణా :—అయితే యిక్కడి కెందుకొస్తున్నావు? వెళ్ళు. నీ ముఖం నాకు చూపించకు.

(కుమిలి కుమిలి ఏడుస్తుంది. రఘు దగ్గరగా వచ్చి ఓదార్పుగా శిరస్సు నిమురుతాడు. వీణాధరి విదిలిస్తుంది.)

వీణా :—ఛో! నే నెలా ఏడిస్తే నీ కెందుకు? ఏమైపోతే నీ కెందుకు? నే నెవరిని నీకు? నీ సహచరిణి దగ్గిరకు వెళ్ళు........

రఘు :—వీణా! నువ్విలా కుమిలిపోతోంటే నేను సహించలేను. ఏం చెయ్యమంటావో చెప్పు. అప్రతిష్టలపాలయి, అమాయకురాలైన కమలను క్షోభపెట్టి, ఆరోగ్యంగా పెరగవలసిన పసివాడి మనసు విషమయం చేసి, సర్వనాశనమూ అయి....యిదేనా నీ ప్రేమ! ఇంతేనా నీకు కావలసింది! పద!.......

(వీణాధరి ముఖం పాలిపోతుంది. రఘు భుజంమీద తల ఆన్చి నిస్పృహగా కూర్చుండి పోతుంది. ఓదార్పుగా ఆమె భుజం తట్టాడు రఘు.)

వీణా :—నువ్వు వచ్చి చాలా సేపయింది వెళ్ళు.......

రఘు :—వెళ్ళను.

వీణా :—(కళ్ళు మెరుస్తుండగా) ఇక్కడే ఉంటావా ?

రఘు :—నువ్వు చిరునవ్వుతో చెప్తే వెళ్తాను. లేకపోతే నీ ప్రక్కన కూర్చుని నేనూ యేడుస్తాను. అంతకంటే మనం చెయ్యగలిగింది లేదుగా !

(వీణాధరి పెదవులు అదురుతాయి. ప్రయత్నంమీద నవ్వుతుంది.)

వీణా :—వెళ్ళు........

రఘు :—అనవసరమైన కలతలతో మనసు పాడుచేసుకోకు.

(రఘు వెళ్ళిపోతాడు. అణచుకున్న దుఃఖం కట్టలు తెంచుకుని వస్తుంది వీణాధరికి.)

* * *

(రఘు ఇల్లు.)

కమల :—మా బాబుని చూడండి, అంతా ఆయన పోలికే కదూ!

(వీణాధరి బాబును ఎత్తుకుంటుంది. ఆప్యాయంగా హృదయానికి హత్తుకుని వళ్ళో కూచోబెట్టుకుంటుంది.)

కమల:—ఇలా యివ్వండి. ఖరీదైన చీర పాడుచేస్తాడేమో!

వీణా:—ఈ చీర ఖరీదైనదని మీకెలా తెలుసు?

కమల:—చాలా అందంగా వుందన్నారు ఆయన. నేనే కొన్నాను.

వీణా:—మీరూ ఇలాంటి చీర కొనుక్కున్నారా?

కమల:—నేను కొనుక్కోలేదు. చిన్నప్పుడు బోలెడు మంచి చీరలు కట్టాను. ఇదుగో ఈ వంశోద్ధారకుడు ఉదయించాడుగా! ఇంక చీరలుకోసం డబ్బు తగలబెడితే ఎలా? మీకోసమే కొన్నాను.

వీణా:—(ఆశ్చర్యంతో) నాకోసం మీరు కొన్నారా?

కమల:—(మామూలుగా) "వీణాధరికి చీరలు కొనాలి" అన్నారు. మామూలుగా ఏది కొనాలన్నా ఇద్దరమూ కలిసే బజారుకెళ్తాం. ఇప్పుడూ అలాగే వెళ్ళాం. ఈ చీర చూసి బాగుందన్నారు. కొన్నాను.

(వీణాధరి విభ్రాంతిపోయి పిచ్చిచూపులు చూస్తుంది.)

కమల:—(చిరునవ్వుతో) అలా కూర్చుండిపోతే ఎలా? ఫలహారం చెయ్యండి. లేకపోతే మా బాబు ఊరుకోడు. "ఆ మాత్రం మర్యాద తెలీదా" అని తిడతాడు. మనుష్యుల్ని మృగాలనుండి విడదీసేది ఈ మంచి మర్యాదలేగా!

(వీణాధరి ఉలికిపడుతుంది. గబగబ తింటుంది.)


కమల:—మిఠాయి ఎలా ఉందండీ!

వీణా:—(గబగబ) చాలా బాగున్నాడు. అంతా మీ పోలికే! కాదు కాదు రఘు పోలిక, అహ! ఇద్దరి పోలికలూ వున్నాయి.

కమల:—భలేవారు! మిఠాయి ఎలా వుందని అడుగుతున్నాను.

వీణా:—తియ్యగా వుంది.

కమల:—పెళ్ళయ్యాక కలిసివుండక తప్పదు. మిఠాయి తియ్యగా



వుండక తప్పదు. నేను తియ్యదనంలో రుచి అడుగుతున్నాను.

వీణా:—నాకు స్వీట్స్ అన్నీ బాగుంటాయి. షుగర్ కోటెడ్ పిల్స్ మాత్రం భరించలేను.

కమల:—కానీ, అవి ఆరోగ్యానికెంత మంచివి! చేదు భరించవలసిన అవస్థ తప్పనిసరి అయినపుడు దానిని తీపిపూతతో తీసుకోవటం మేలు కదూ!

(రఘు వస్తాడు)

రఘు:—హలో వీణా! మా బాబు బాగున్నాడా?

వీణా:—మీ బాబు చాలా బాగున్నాడు.

కమల:—లోకంలో తన కొక్కడికే కొడుకు పుట్టినట్లు మురిసిపోతున్నారు.

రఘు;—కమలా! వాడికి టైం ప్రకారమే ఫీడింగ్స్ ఇస్తున్నావు కదూ!

కమల:—ఆ మాత్రం నాకు తెలుసు లెండి. నేనూ చదువుకున్న దాన్నే!

రఘు:—ఏదీ, ఇలా ఇయ్యి.

కమల:—(బాబును అందించి) జాగ్రత్తగా ఎత్తుకోండి. ఇంకా మెడలు నిలపడం లేదు.

రఘు:—ఆ మాత్రం నాకు తెలుసులే! నేనూ కన్న తండ్రినే!

(కమల పకపక నవ్వుతుంది. రఘు నవ్వుతో బాబును "చీ! చీ!" అని పలకరిస్తాడు. వీణాధరి లేచి నించుంటుంది.)

వీణా:—రఘూ! నేను వెళ్తాను.

రఘు:—అప్పుడే! ఉండు. నేనూ వస్తాను. కమలా! వీణాధరిని దిగబెట్టి వస్తాను.

కమల:—వెళ్ళిరండి. మీరు మిఠాయి తినరని మీ కోసం సేమ్యా పాయసం చేస్తున్నాను. అది చల్లారిపోకుండా రండి.

రఘు:—అలాగే!

* * *

(టాక్సీలో....)

వీణా:—రఘూ! కమలకు తెలియకుండా నీ దగ్గిర డబ్బేమీ ఉండదా?

రఘు:—(ఆశ్చర్యంగా) ఇంతవరకూ అలాంటి అవసరం రాలేదు. కమల ఓపిగ్గా ప్రతీదీ లెక్కలు వ్రాస్తుంది. గొప్పింటి బిడ్డయినా జాగ్రత్తగా ఖర్చుపెడుతుంది. అలా అని కార్టూనుల్లో గృహిణిలా నన్ను బాధించదు. ముందు నా అవసరాలు చూసాకే మిగిలినవి సర్దుకుంటుంది.

వీణా:—నాకు చీర కొనాలని ఆవిడతో చెప్పావా? అంతకంటె మానెయ్యక పోయావా?

రఘు:—ఏం! మంచి చీర కొందిగా! నీకు నచ్చలేదా?

వీణా:—ఇంతే అర్థమవుతుంది నీకు! ఆవిడ అనుమతితో తప్ప నువ్వు నాకు కొనలేకపోతే అసలు కొనకు!

రఘు:—సారీ వీణా! కమల ముఖం చూస్తూ అబద్ధం చెప్పలేను. కమల కాదంటే.... కాదని దెబ్బలాడితే....

వీణా:—అప్పుడు హాయిగా ఆవిడను ఉడికిస్తూ ఈ చీర గర్వంగా కట్టుకో గలిగే దానిని. ఇప్పుడు ఈ చీరతో, నేనంటే నాకు చీదర కలుగుతోంది.

రఘు:—సరే! సరే! ఇంక మీదట అలా జరగనివ్వను.

వీణా:—రఘూ! ఇవాళ ఎందుకో ఒంటరిగా భోజనం చెయ్యాలని లేదు. నువ్వు కూడా నాతో భోజనం చెయ్యవూ?

రఘు:—కానీ, కమల నా కోసం....

వీణా:—కమల నీ కోసం ఎదురు చూస్తుంది. నేను నీ కోసం ఎదురు చూడను. చూస్తే ప్రయోజనంలేదు. కనీసం ఒక్కరోజైనా, నా తృప్తి కోసమైనా నువ్వు నాతో భోజనం చెయ్యలేవు.

రఘు:—నీకు తెలియదు వీణా! ఒక్క రోజు నేను ఇంటికి భోజనానికి రాకపోతే కమల భోజనం చెయ్యదు.

వీణా:—(కసిగా) నేనూ చెయ్యను. ఇవాళే కాదు. ఎప్పుడూ చెయ్యను. నీ ఎదురుగా ఆకలికి మాడిచస్తాను. పీడ వదలిపోతుంది.

రఘు:—(చటుక్కున వీణాధరి చెయ్యి పట్టుకుని ఆర్తిగా గుండెల కదుముకుంటాడు.) అలా మాట్లాడకు. సరే! ఇవాళ నీతోనే భోజనం చేస్తాను.

* * *

(రఘు ఇల్లు. రాత్రి సమయం. గడియారం పదకొండు సూచిస్తూ ఉంటుంది. రఘు వస్తాడు.)

రఘు:—సారీ! కమలా! త్వరగానే వద్దామనుకున్నాను కానీ....

కమ:—ఇప్పటికే పొద్దుపోయింది. భోజనానికి లేవండి....

రఘు:—నేను చేసేశాను. నువ్వు చెయ్యి.

కమల:—నేనూ చేశాను.

రఘు:—నేను నమ్మను.

కమ:—ఎందుకు నమ్మరు! నేను మాత్రం మనిషిని కానా? నాకు మాత్రం ఆకలి ఉండదా? మీరక్కడ ఆవిడ ఇంట్లో తింటోంటే నేనిక్కడ తిన్నాను.

(పక పక నవ్వుతుంది. తలలో పూలు, మెడలో గొలుసు, మొదలైన అలంకరణలన్నీ ఒక్కొక్కటే తీసేస్తుంది.)

రఘు:—అవన్నీ ఎందుకు తీస్తున్నావు?

కమల:—అలంకరించుకుంటే నన్ను నేను అవమానించుకున్నట్లు అనిపిస్తోంది.

రఘు:—కమలా!.... ఎందుకే ముసుగులో గుద్దులాట! ఇంతకంటే మనం విడాకులు....

(కమల ముఖం పాలిపోతుంది. నిద్రపోతున్న బాబును తెచ్చి రఘు వళ్ళోపడేసి వెళ్ళిపోతుంది. బాబు నిద్రలేచి ఏడుస్తాడు. రఘు సముదాయించడానికి అవస్థపడతాడు. కొంత సేపటికి కమల వస్తుంది. బాగా ఏడ్చినట్లు కళ్ళు ఉబ్బి ఉంటాయి. ఒక్క క్షణం కమల ముఖంలోకి చూసిన రఘు కళ్లు భారంగా వాలిపోతాయి)

రఘు:—కమలా! అన్నం తిను....

కమల:—ఒక్క దాన్ని కూర్చుంటే సహించదు. మీరు ఊరికే సాయం కూర్చోండి.

రఘు:—అన్నట్లు నా కోసం పాయసం చేస్తానన్నావు కమూ? అది నాకు ఒక కప్పులో పోసియ్యి. నీతో కలిసి తింటాను.

కమ:—(పేలవమైన నవ్వుతో) జ్ఞాపకముందన్నమాట!

రఘు:—ఇంటినీ ఇల్లాలినీ ఎవరు మరిచిపోతారు? పద!

## 5

(వీణాధరి ఇల్లు. వీణాధరి కోపంతో మండిపడుతూ ఉంటుంది. రఘు వస్తాడు.)

రఘు:—వీణా! ఏం జరిగింది?

వీణా:—ఆ రౌడీవెధవ చూడు! నోటి కొచ్చినట్లు వాగుతున్నాడు. ఇంకా గుమ్మంముందే ఉన్నాడు.

(రఘు కోపంతో బయటికి వెళ్తాడు. జులాయిగా కనిపించే ఒక యువకుడు విలాసంగా సిగరెట్ కాలుస్తుంటాడు.)

రఘు:—ఎవరు నువ్వు? ఎందుకొచ్చావు?

యువ:—(నిర్లక్ష్యంగా) నీలాంటివాడినే! నువ్వొచ్చిన పనిమీదే వచ్చాను.

రఘు:—పళ్ళు రాలతాయి జాగ్రత్త....

యువ:—బలాబలాలు తేల్చుకోవాలని నువ్వనుకుంటే నాకు అభ్యంతరం లేదు. అయినా నేనంత చెయ్యకూడని పని ఏం చేశాను? "నిన్ను నేను ఉంచుకుంటాను. వస్తావా?" అన్నాను. తప్పేముంది? నువ్వు డబ్బిస్తున్నావు. నీతో ఉంటోంది. అంతకంటె ఎక్కువ డబ్బిస్తే నాతో ఉంటుందేమో కనుక్కోవాలనుకున్నాను. ఆవిడ నువ్వు కట్టుకున్న భార్య కాదుగా! నువ్వు చేస్తే ఒప్పు. నేను చేస్తే తప్పునా?

రఘు:—షటప్! (వాడిని కొట్టడానికి ముందుకు రాబోతాడు.)

యువ:—ఒక్క క్షణం ఆగు. రేపీపాటికి అన్ని పేపర్లలోనూ సుప్రసిద్ధ డాక్టరు శ్రీ రఘురామ్ ఒక యువతికోసం నడిబజారులో మరొకడితో యుద్ధంచేసాడని వార్త వచ్చేస్తుంది. ఫోటో గ్రాఫర్నికూడా పిలవనా? ఫోటోలుకూడా పడితే నిండుగా ఉంటుంది. లేదా, మన హడావుడి చూసి ఎవరో ఒకరు తీస్తారేమోలే! ఇంతమంచి అవకాశం పోగొట్టుకుంటారా? అయామ్ రెడీ!

(చొక్కా చేతులు పైకి లాక్కుంటాడు. రఘు పాలిపోయిన ముఖంతో, తల వాల్చుకుని లోపలి కెళ్లి పోతాడు. అతడు పక పక నవ్వుతాడు.)

వీణా:—వెధవకి బాగా బుద్ధి చెప్పావా?

(రఘు మాట్లాడడు.)

వీణా:—మాట్లాడవేం? మళ్లీ నాజోలికి రాకుండా బుద్ధి చెప్పవలసింది.

రఘు:—(చిరాగ్గా) నేనేం బుద్ధి చెప్పలేను! నీ జాగ్రత్తలో నువ్వుండాలి....

వీణా:—(దెబ్బతిన్నట్లయి) అంటే....

రఘు:—(సర్దుకుని) అబ్బే! అదేం కాదు. కానీ, వాడికి.... తెగించిన ఆరౌడీ వెధవకి నేనేం చెప్పగలను చెప్పు....

వీణా:—ఏమీ చెప్పలేవా? నన్ను గురించి మరొకరు అవమానకరంగా మాట్లాడినా సహించి ఊరుకుంటావా? ఇదే కమలను గురించి ఎవరైనా ఏమైనా అంటే ఊరుకోగలవా?

రఘు:—కమలను గురించా? డాక్టర్ రఘు భార్య.... శ్రీమతి కమలా రఘురామ్‌ను గురించి ఏదైనా అనటానికి ఎవరికి గుండెలు?

వీణా:—కమలను.... శ్రీమతి కమలా రఘురామ్‌ను ఎవ్వరూ ఏమీ అనలేరు. నేను.... వీణాధరిని.... బజారు మనిషిని.... నా జాగ్రత్తలో నేనుండాలి!

రఘు:—వీణా! నేనలా అనలేదు. వ్యక్తి విలువలు వేరు. సామాజిక రీతి నియమాలు వేరు. రెంటికి ఘర్షణవస్తే సమాజమే గెలుస్తుంది. వీణా! ఇటుచూడు! ఈ చీర నీకోసం తెచ్చాను. కమలకు తెలియదు.

వీణా:—నా కక్కర్లేదు!

రఘు:—కోపమా?

వీణా:—ఎవరిమీద కోపం తెచ్చుకుంటాను? ఏ అధికారంతో తెచ్చుకుంటాను?

రఘు:—వీణా! నా మనసులో నీకున్న స్థానం ఎవ్వరికీ లేదు. నీ




కోసం నాడబ్బు, నాప్రాణం, ఏది కావాలన్నా ఇస్తాను. కాని....

వీణా:—(ఆర్ద్రంగా) నాకు తెలుసు రఘూ! నేను కోపంతో ఆ చీర వద్దనలేదు.

రఘు:—మరి?

వీణా:—నువ్వు కమలకు చెప్పకుండా ఏదైనా కొనటం ఇదే మొదటిసారి కదూ?

రఘు:—అవును.

వీణా:—వద్దు రఘూ! నాకోసం కమలతో అబద్ధాలాడకు!

రఘు:—కానీ, నువ్వే....

వీణా:—కమలకు తెలిసి నువ్వు నాకు చీరలు కొంటే భరించలేనన్నాను. అందుకని, అసలు కొనకు.

రఘు:—నాకు అర్థం కావటం లేదు వీణా!

వీణా:—అర్థమయ్యేలా చెప్తాను వినండి హుజూర్! ఈ డబ్బంతా ఎవరిది? మాస్టర్ రఘు బాబుగారిది.... రఘూ! ఈ జన్మకు నాకు తల్లినయ్యే యోగంలేదు. నాకు మాత్రం బాబుకంటె ఎవరున్నారు? ఇంకమీదట నాకోసం ఏమీ ఖర్చు పెట్టకు రఘూ! నాకేదైనా ఉద్యోగం చూడు!

రఘు:—నీకా! ఉద్యోగమా?

వీణా:—ఏం? మెట్రిక్ పాసయ్యాను. నాకు ఉద్యోగం దొరకదా? పోనీ, నర్స్ ట్రైనింగ్ అవమంటావా?

రఘు:—నర్స్ ట్రైనింగ్ అవుతావా? అయితే, నిన్ను నాదగ్గిరే నర్స్‌గా వేసుకోగలను....

వీణా:—అందుకే! నీ నిజ జీవితంలో సహచరిణిని కాలేకపోయినా, వృత్తి జీవితంలో నయినా నీకు సహకరిద్దామని....

రఘు:—వీణా! నీకు ఉద్యోగం చెయ్యవలసిన అవసరమే మొచ్చింది? నేనున్నాను. నీకేలోటూ రానివ్వను.

వీణా:—నువ్వు నాకున్నావు. నేనూ నీకున్నాను. అందుకే నర్స్‌గా

రావాలను కుంటున్నాను. మొదటినుంచీ నర్స్ వృత్తి అంటే నాకు చిరాకు. అందుకు కావలసిన శాంతి సహనాలు నాకు లేవు. అయినా నీకోసం నర్స్‌ను కావాలను కుంటున్నాను. ఇంక లోటా? నా బ్రతుకులో వెలితిని ఎవరు పూరించగలరు?

రఘు:—నీకు ఆసక్తిలేని ఉద్యోగం మంచిది కాదు వీణా! అందులో నర్స్ ఉద్యోగం బాధ్యతగల ఉద్యోగం.

వీణా:—ఆసక్తి కల్పించుకుంటే వస్తుంది. బాధ్యతల కారణంగా బ్రతుకు మొత్తం బూడిద చేసుకునున్న దానిని, ఈనాడు ఉద్యోగంలో నా బాధ్యత మరిచి పోతానా?

రఘు:—నీ యిష్టం!

* * *

(రఘు ఇల్లు)

చిట్టి:—బాబయ్యా! శుభవార్త!

రఘు:—ఏమిటది? ఇప్పటికైనా పరీక్ష పాసయ్యావా?

చిట్టి:—ఎలా పాసవుతాను బాబాయ్! బొత్తిగా అన్యాయం జరిగి పోతోంది. కాపీ కొట్టడానికి వీల్లేకుండా ఉంది క్వశ్చన్ పేపర్! పుస్తకాలు చేతికిచ్చినా ఏ ప్రశ్నకు ఏ సమాధానమో అర్థం కావటంలేదు!

రఘు:—వాళ్ళ మాత్రం ఏం చేస్తారు? ఇష్టం వచ్చినట్లు కాపీలు కొట్టడం, కొట్టనియ్యని ఇన్‌విజిలేటర్లను చావబాదటం. ఈ బాధంతా భరించలేక ఒరిజినాలిటీ ఉన్నవాళ్ళ తప్ప ఆన్సర్ చెయ్యలేని విధంగా ప్రశ్న పత్రాలు తయారు చేస్తున్నారు. దీనివల్ల ఏవరేజ్ స్టూడెంట్స్ దెబ్బతినే మాట నిజమే కాని మీరు సృష్టిస్తున్న ఈ అరాచక వాతావరణంలో అంతకంటె చెయ్యగలిగిందేముంది?

చిట్టి:—ముందు సీట్ దొరకటం కష్టం, ఆ తర్వాత పరీక్ష పాసు కావటం మరింత కష్టం. ఆ తర్వాత ఉద్యోగం దొరకటం మహా కష్టం. దొరికాక ఆ జీతంతో జీవించటం గగనం! అందుకే, ఈ బాధలన్నీ పడక్కర్లేకుండా సులభమార్గం కనిపెట్టేసాను.

రఘు:—ఏమిటా సులభ మార్గం?

చిట్టి:—బోలెడు డబ్బున్న అమ్మాయిని పెళ్ళి చేసేసుకోవటం!

రఘు:—(నవ్వి) నీ సులభమార్గం బ్రహ్మాండంగా ఉంది. కానీ, నిన్ను పెళ్ళి చేసుకోడానికి సిద్ధంగా ఏ లక్షాధికారిణి ఉంది?

చిట్టి:—కుసుమ!

(అంతవరకూ వేళాకోళంగా మాట్లాడుతున్న రఘు ఉలికి పడతాడు.)

రఘు:—కుసుమా! కుసుమను చేసుకుంటావా? కానీ కుసుమకు ఒక కాలు....

చిట్టి:—కుసుమ కుంటిదయితేనేం బాబాయ్! కుసుమ డబ్బు కుంటిది కాదుగా!

రఘు:—వివాహ వ్యవస్థ ఎంతో ఉదాత్తమయినది. మన మంతా మన స్వార్థాలతో ఆ వ్యవస్థను కలుషితం చేస్తున్నాము. చిట్టీ, నువ్వు డబ్బుకోసం కుసుమను చేసుకోవటం నాకు నచ్చలేదు.

చిట్టి:—పోనీ ప్రేమకోసమే చేసుకుంటున్నాననుకో! ఎలా అనుకుంటే ఏం పోయింది?

రఘు:—కుసుమకు ఇష్టమేనా?

చిట్టి:—ఆ! పరీక్ష పాసవటం చేతకాదు కాని, ఆడపిల్లల ప్రేమ సంపాదించటం బాగానే చేతనవును బాబాయ్! అది మాత్రం తేలికనుకుంటున్నావా?

రఘు:—మీ అమ్మకూ, నాన్నగారికీ వ్రాసావా?

చిట్టి:—నువ్వు వ్రాసెయ్యి బాబాయ్! అంతా నిశ్చయమయిపోయినట్లే!

* * *

(వీణాధరి ఇల్లు!)

రఘు:—వీణా! శుభవార్త!

వీణా:—మరో పాపాయి పుట్టబోతున్నాడా!

రఘు:—(నవ్వి) కాదు. మనం బంధువులం కాబోతున్నాము. చిట్టి కుసుమను పెళ్ళి చేసుకుంటున్నాడు.

వీణా:—వీల్లేదు! కుసుమకు చిట్టి భర్త కావటమా? జరగనివ్వను.

రఘు:—ఏమిటి వీణా! ఎందుకింత ఆవేశపడుతున్నావ్!

వీణా:—రఘూ! అందరిలా నువ్వూ ఇంత స్వార్థంతో ఆలోచిస్తావనుకోలేదు. నీ అన్న కొడుకు బాగునే ఆలోచిస్తున్నావు కాని కుసుమ భవిష్యత్తు గురించి ఆలోచించటం లేదు! చిట్టి. కనీసం బి. యస్. సి. పాసుకాలేని చిట్టి. జీవితంలో దేనిపైనా లక్ష్యం లేని చిట్టి. జల్సాగా బ్రతికెయ్యటమే లక్ష్యంగా కల చిట్టి. కుసుమను పెళ్ళి చేసుకోవటం నాకు శుభవార్త అవుతుందనుకున్నావా? నిజం చెప్పు. చిట్టి డబ్బుకోసమే కుసుమను చేసుకుంటున్నాడని నీకు తెలియదూ!

రఘు:—తెలుసు! ఈ రోజుల్లో చాలామంది అలానే చేసుకుంటున్నారు. చేతులు కాలాక ఎంత కుమిలితే ఏం ప్రయోజనం (వీణాధరి ముఖం క్షణికంగా నల్లబడుతుంది)

వీణా:—ఈ పెళ్ళి జరగనివ్వను.

రఘు:—వాళ్ళిద్దరూ నిర్ణయించుకున్నారు. నువ్వు చిట్టిలో లోపాలు చూస్తున్నావు. కుసుమలో లోపం లేదా? ఒక కాలు....

వీణా;—వీల్లేదు! వీల్లేదు! వీల్లేదు! కుసుమకు ఒక కాలులేని కారణంగా ఎందుకూ పనికిరాని చవట కుసుమకు భర్త కావటానికి వీల్లేదు!

రఘు:—నువ్వు ఎంత ఉద్రేకపడ్డా ప్రయోజనం లేదు కుసుమ నీ మాట వినదు!

(వీణాధరి ఉస్సురని కూలబడుతుంది.)

* * *

(కుసుమ మేడ)

కృష్ణ:—నమస్కారం!

కుసుమ:—(పొడిగా) ఇలా వచ్చారేం?

కృష్ణ:—చెప్తాను కూర్చోవచ్చునా?

కుసుమ:—(దురుసుగా) నాకు పనుంది, బయటికెళ్ళాలి.

కృష్ణ:—(వింటునే) పత్రికలో పడిన మీ చిత్రం చూసి అభినందించాలని వచ్చాను. నాకూ చిత్రకళలో కొంచెం ప్రవేశముంది.

కుసుమ:—థేంక్స్! వచ్చిన పని అయిపోయిందా?

కృష్ణ:—ఏ కళకయినా మూడంగాలు వుంటాయి. జీవం, సౌందర్యం, శాస్త్రం ప్రధానమైనవి. జీవం - అది లేకపోతే కళాకారుడే కాలేడు ఆ జీవం మీ చిత్రంలో ఉంది. కానీ శాస్త్ర పరిజ్ఞానం....

(కుసుమ శ్రద్ధగా వినటం గమనిస్తాడు.)

కృష్ణ:—సారీ! మీరు ఎక్కడికో వెళ్లాలి కాబోలు! నేను వస్తాను.

కుసుమ:—పరవాలేదు. కూర్చోండి సుబ్బమ్మా! కొంచెం కాఫీ తీసుకురా! ఊఁ చెప్పండి....శాస్త్ర పరిజ్ఞానం....

ష్ణ:—(కూర్చుని) మీ ఇల్లు చాలా బాగుంది....

కుసుమ.—శాస్త్రపరిజ్ఞానం నాకు లేదు కదూ! నేను చిత్రకళ ఎవరి దగ్గిరా నేర్చుకోలేదు.

కృష్ణ:—నాకు డబ్బున్నవాళ్ళతో మాట్లాడాలంటే భయం! ప్రతి వాళ్ళూ వాళ్ళ డబ్బుకోసమే తాపత్రయ పడుతున్నారని అపోహ పడతారు.

కుసుమ:—మీరు చిత్రకళ ఎవరి దగ్గిర నేర్చుకున్నారు? నేనుకూడా ఎవరిదగ్గిరైనా నేర్చుకుంటే నా కళ ఇంకా రాణిస్తుందా?

కృష్ణ:—నేను కెమిస్ట్‌గా పనిచేస్తున్నాను. అయిదువందల జీతం! నామీద ఆధారపడినవాళ్ళు లేరు. నేను డబ్బుకోసం మరొకరిని ఎందుకు ఆశ్రయిస్తాను చెప్పండి. అయినా డబ్బున్నవాళ్ళకు అదొక అహంకారం!

కుసుమ.—మీరు గీసిన చిత్రాలున్నాయా? నాకు చూపించండి!

కృష్ణ:—నా కసలు డబ్బున్నవాళ్ళంటే—

కుసుమ:—(కోపంగా లేచి) మీరు ఆ డబ్బు ప్రస్తావన కట్టిపెట్టి నేను అడిగినదానికి సమాధానం చెప్పండి.

కృష్ణ:—అలా కోప్పడకండి! నాకు భయమేస్తోంది నేను వెళ్ళిపోతాను. ఇవిగో నా చిత్రాలు....

(కుసుమ ఆ చిత్రాలు చూస్తుంది)

కుసుమ:—ఎంత బాగున్నాయో? ఎవరిదగ్గర నేర్చుకున్నారు?

కృష్ణ:—మీకు నామీద కోపంగా వుంది. వెళ్తాను.

కుసుమ:—సారీ! నాకు మీమీద కోపమేం లేదు. కళాకారిణిని కాలేకపోయినా కళాకారులను గౌరవించలేనా?

కృష్ణ:—మీరు కళాకారిణి కాదని ఎవరన్నారు? మీ కళలో జీవం ఉందని చెప్పానుగా!



కుసుమ:—చెప్పారు, కాని....

కృష్ణ:—దీక్షితులుగారని ప్రసిద్ధి పొందిన చిత్రకళా పండితులు. నేను ఆయన దగ్గిరే నేర్చుకున్నాను.

కుసుమ:—ఆయనను మాయింటికి పిలిపించుకుని నేర్చుకుంటాను.

కృష్ణ:—కొన్నిలక్షలు పోసినా ఆయన మన ఇళ్ళకురారు. మనమే ఆయన ఆశ్రమానికి వెళ్ళాలి.

కుసుమ:—ఈ కుంటికాలితో బయటి కెలా వెళ్ళను? నలుగురికీ నా అవకరం ఎలా చూపించను?

కృష్ణ:—ఏం? మీ కాలు కుంటిది కావటం మీ అపరాధం కాదు. నలుగురిలోకీ రావటానికి ఎందుకు లజ్జపడాలి?

కుసుమ:—నలుగురూ నవ్వుతున్నారు.

కృష్ణ:—ఎప్పుడూ సమాజంలో సంస్కారవంతులూ, సంస్కార విహీనులూ ఇద్దరూ ఉంటారు. సంస్కార విహీనులు ఎదుటివాళ్ళ అవకరాన్ని చూసి నవ్వుతారు. నిజమే! కానీ, సంస్కారవంతులు మీకు సహకరిస్తారు. ఒక అవకరాన్ని లక్ష్యం చెయ్యకుండా మీ జీవితాన్ని మీరు చక్కదిద్దుకొనే కృషిని అభినందిస్తారు.

కుసుమ:—నాకు ధైర్యం చాలటం లేదు.

కృష్ణ:—ఆ భయమే వదిలిపెట్టండి. ధైర్యంగా సమాజంలోకి రండి. మనలో చాలామంది మంచివాళ్లున్నారు. ఆ విషయం మీకు అర్థం కావటం లేదు. ఒక కాలుకుంటిదయి నంతమాత్రాన ఆత్మవిశ్వాసాన్ని సడలనియ్యకండి.

"Life's battles do not always go
But sooner or later the Man who wins is
The Man who thinks he can."

వస్తాను.

* * *

(వీణాధరి ఇల్లు)

చిట్టి:—నన్ను రమ్మనికబురు సారు. ఎందుకనిచే ?

(ఎదుటి వ్యక్తులను సమ్మోహనపరిచే విధంగా, మత్తుగా నవ్వుతుంది వీణాధరి.)

వీణా:—మీకు ఇబ్బంది కలిగించానా?

చిట్టి:—అహా! ఇబ్బందేం లేదు. ఏంపనో తెలుసుకుందామని....

వీణా:—ఆ రోజు మిమ్మల్ని హాస్పిటల్‌లో చూసాను. అప్పటి నుండి మీరే నా మనసులో మెదులుతున్నారు. కలుద్దామంటె పడలేదు.

(గారాబంగా నవ్వుతుంది. చిట్టి మొదట ఆశ్చర్యపోతాడు. అంతలో సంబరంగా చూస్తాడు.)

చిట్టి:—కాకిచేత కబురంపినా మీముందు వాలేవాణ్ణి.

వీణా:—మీరంతటివారని నాకూ తెలుసు. అయినా....ఏమిటో.... ఇన్నాళ్ళూ సంకోచించాను....

చిట్టి:—మీకెందుకండీ సంకోచం మిమ్మల్నడిగే దెవరు?

వీణా:—చూసారా! అదిగో,అప్పుడే లోకువ చేసేస్తున్నారు. అందుకే మగవాళ్ళంటె నాకు భయం!

చిట్టి:—(కంగారుగా) లోకువ చెయ్యటంలేదు, భయపడక్కర్లేదంటున్నాను.

వీణా:—ఒంటరి ఆడదానికి భయం కాక ఏముందండీ? ఎవరైనా అండగా ఉంటే పరవాలేదు కాని....

చిట్టి:—నేనున్నాను!

వీణా:—అంతమాటన్నారు. అదేచాలు.

చిట్టి:—వట్టి మాటలు కాదు. మీ వంటిమీద ఈగ వాలనివ్వను.

వీణా:—మీ దర్శనభాగ్యం నాకు రోజూ కలిగించండి. అదే పదివేలు.

చిట్టి:—తప్పకుండా రోజూ వస్తాను....

వీణా:—పేదరాలివి. మీకే ఆతిథ్యమూ ఇయ్యలేను.

చిట్టి:—పరవాలేదు. కొంచెం రోజుల్లోనే మనం గొప్పవాళ్ళ మయిపోతాం!

వీణా:—మనం?!

చిట్టి:—నేనయితే మీ రయినట్లేగా? నాదంతా మీది కాదూ?

వీణా:—ఆహా!! ఎక్కణ్ణుంచి వస్తోందో ఆ "గొప్ప"?

చిట్టి:—మీ సవతికూతురు కుసుమను పెళ్ళి చేసుకుంటున్నాను.

(వీణాధరి పకపక నవ్వుతుంది)

చిట్టి:—ఎందుకలా నవ్వుతారు?

వీణా:—కుసుమ చాలా గట్టిదండీ! వాళ్ల నాన్న పోగానే నన్ను ఇంట్లోంచి గెంటేసింది, మీ చేతికి డబ్బు రానిస్తుందా?

చిట్టి:—ఓస్! అదా! కుసుమను బుట్టలో వెయ్యగలిగే చాకచక్యం నాకుంది లెండి! మీ కెందుకు? చూస్తారుగా! మీరు గెంటబడ్డ ఇంట్లోంచే మీకు కావలసినవన్నీ తెస్తాను....

వీణా:—నిజంగా! అయ్యో నా డ్యూటీకి టైమయిపోయిందండీ? ఎలా? మిమ్మల్ని వదిలి వెళ్లాలంటే కష్టంగా వుంది.

చిట్టి:—రేపు మళ్ళీ వస్తానుగా!

వీణా:—తప్పకుండా వస్తారుగా! రాకపోతే నామీద ఒట్టు.

చిట్టి:—అయస్కాంతం లాగుతోంటే ఇనుపముక్క రాకేం చేస్తుందండీ!

వీణా:—భలేవారు ఎంత తమాషాగా మాట్లాడతారు! ఏం తెలివితేటలు! మరి నే వెళ్లిరానా?

* * *

(కుసుమ మేడ)

కుసుమ:—మొన్న నే వేసిన చిత్రాన్ని అందరూ మెచ్చుకున్నారు. మీ దయ.

కృష్ణ:—నా దయ కాదు. దీక్షితులుగారిదయ.అన్నింటికంటె మీరు ఏం సంకోచం లేకుండా నలుగురిలోకి వస్తున్నందుకు సంతోషంగా వుంది.

కుసుమ:—మీ రన్నట్లు మనలో చాలామంది మంచివాళ్ళు ఉన్నారు. నా అవకరం గుర్తించనట్లే మసలుకుంటున్నవాళ్లను చూస్తే ఎంత గౌరవమో నాకు!

కృష్ణ:—ఆ విషయాన్ని పదేపదే గుర్తు చేసుకోవటం మానెయ్యండి మీరు!

కుసుమ:—అసలిప్పుడు నా కా విషయం గుర్తు రావటమే లేదు.

కృష్ణ:—వెరీ గుడ్! అన్నట్లు మీ పెళ్లని విన్నాను. కంగ్రాచ్యులేషన్స్.

(కుసుమ ముఖం తుడుచుకుంటుంది. తల దించుకుంటుంది, ఏం మాట్లాడదు)

కృష్ణ:—ఎన్నెన్నో విలువలు మారుతున్నాయి. ఆచారాలు మారుతున్నాయి. పాత సంప్రదాయాలు నశించి కొత్తవి ఏర్పడుతున్నాయి. కానీ, చెక్కుచెదరక నిలిచింది వివాహ వ్యవస్థ. మానవజీవితంలో దాని ప్రాధాన్యత ఎటువంటిదో చూడండి....

కుసుమ:—ఇప్పుడదీ శిథిలమయిపోతోంది.

కృష్ణ:—లేదు! లేదు! జాగ్రత్తగా పరిశీలిస్తే సమాజం ఈ వ్యవస్థ నిలబెట్టుకోవడానికే ఎంతగా ప్రయత్నిస్తోందో అర్థమవుతుంది.

కుసుమ:—రాను రాను ఇదీ ఒక వ్యాపారంలా మారటం లేదా?

కృష్ణ:—యుగ ధర్మం ఈ వ్యవస్థ మీదకు ప్రసరించిందనక తప్పదు. స్వార్థం, అధికార కాంక్ష, ధనదాహం, ఈ మూడు ప్రతి ఒక్కనిలోనూ ప్రబలిపోయి సామాజిక వాతావరణాన్ని విషమయం చేస్తున్నాయి. ఇవి వివాహవ్యవస్థలోనూ తొంగి చూస్తున్నాయి. అయితే ఒకటి,ఎవరైనా దీన్ని కలుషితం చెయ్యగలరేమో కాని నాశనం చెయ్యలేరు. జీవితానికే ఆలంబనమయిన వివాహాన్ని చేజేతులా కలుషితం చేసుకున్నవాళ్లు ఆ ఫలితాలు జీవితాంతం అనుభవించక తప్పదు.

కుసుమ:—(తమాషాగా) మిమ్మల్ని పెళ్ళాడే స్త్రీ అదృష్టవంతు

రాలు!


కృష్ణ:—నా అయిదువందల జీతంతో సంతృప్తి పడగలిగితే అదృష్టవంతురాలే!

కుసుమ: — సంతృప్తి పడలేకపోతే, పుట్టింటివారి నడిగి తెచ్చుకుంటుంది.

కృష్ణ:—అది నాకు ఇష్టంలేదు. నా భార్యను నేను పోషించుకోగలను....

కుసుమ:—ఒకవేళ ఆవిడకు చాలా డబ్బుంటే....

కృష్ణ:—కావాలంటే తన పిల్లలకు ఇచ్చుకో మనండి. నాకు అభ్యంతరం లేదు. నేను వాడుకోను. తనమీద ఆధారపడి ఉన్నానని నా భార్య అనుకుంటే నేను భరించలేను. అయినా ఈ తిప్పలన్నీ దేనికి? నేను బీదపిల్లనే చేసుకుంటాను. వస్తాను.




(కృష్ణ వెళ్లిపోతాడు. కుసుమ ఆలోచిస్తూ కూర్చుంటుంది.)

* * *

(కుసుమ మేడ)

చిట్టి:—కుసుమా! ఒక అవసరం వచ్చింది. అయిదు వందల రూపాయిలుంటే ఇయ్యి.

కుసుమ:—అయిదువందలా! ఎందుకు?

చిట్టి:—అయిదువందలంటే మనకొక లెక్కా?

కుసుమ:—నీకు లెక్క లేకపోవచ్చు. నాకుంది. నాడబ్బు కనుక....

చిట్టి:—నీ, నా, ఏమిటి కుసుమా?

కుసుమ:—ఎందుకో చెప్పు. చెప్పకూడని అవసరమా?

చిట్టి:—అహ! నీకు చెప్పకూడని అవసరాలు నా కేముంటాయి? నా స్నేహితులు ఉత్తరహిందూస్థానమంతా తిరిగి రావటానికి వెళ్తున్నారు. నేనూ వెళ్దామనుకుంటున్నాను. నువ్వు వద్దంటే మానేస్తాను.

కుసుమ:—నేనూ వస్తాను.

చిట్టి:—నువ్వా? నువ్వు .. నువ్వెందుకు?

కుసుమ:—ఏం? కుంటిపిల్ల నీతో వస్తే నీకు అవమానమా?

చిట్టి:—ఏం మాటలు కుసుమా? కాస్త నడుస్తున్నప్పుడు కుంటి అని తెలుస్తుందే తప్ప. నీకేం లోటూ? ఎంత అందంగా ఉంటావని? అందరూ మొగవాళ్ళు. నీకు మామధ్య ఇబ్బందిగా ఉంటుందని వద్దన్నాను. వస్తే రా!

కుసుమ:—ఇదిగో డబ్బు!

చిట్టి:—నువ్వూ రా!

కుసుమ:—ఊహూ! రాను!

(చిట్టి ముఖంలో కనిపించిన రిలీఫ్ చూసి బాధగా పెదవి కొరుక్కుంటుంది కుసుమ. అది గమనించని చిట్టి హుషారుగా వెళ్ళిపోతాడు.)

* * *

(ఒక హోటల్—చిట్టి వీణాధరితో కబుర్లు చెబుతూ ఏదో తింటూ ఉంటాడు. ఆ సమయంలో కుసుమ స్నేహితులతో అదే హోటల్‌కు వస్తుంది. చిట్టినీ, వీణాధరినీ చూసి నిర్ఘాంతపోతుంది. చిట్టి ముఖం పాలిపోతుంది.)

వీణా:—ఎంత మంచివారండీ! ఈ జన్మలో యింత ఖరీదైన హోటల్స్‌కు రాగల ననుకోలేదు. మీ స్నేహం దొరకబట్టి ఇవన్నీ రుచి చూడగలుగుతున్నాను.

చిట్టి:—హుం! హుం!

(కుసుమ విసురుగా చిట్టిదగ్గిరకు వస్తుంది.)

కుసుమ:—నువ్వు నన్ను మోసంచేసినా క్షమిస్తాను. ముందు ఈ విషనాగును వదిలి రా!

వీణా:—నేను విషనాగునా? చూసారా! వెళ్ళండి. ఇంక నా జోలికి రాకండి.

(చేతిరుమాలు కళ్ళకి అడ్డు పెట్టుకుంటుంది.)

చిట్టి:—కుసుమా! ఆవిడ నీకు సవతితల్లి అయినంత మాత్రాన అంత దారుణంగా మాట్లాడకు!

కుసుమ:—నీ కర్థంకాదు లే! ఇంటికి వెళ్దాం రా!

వీణా:—వెళ్ళు! ఆవిడ ఆజ్ఞని కాదని నువ్వు బ్రతకగలవా? ఆవిడ ఆజ్ఞాపించే యజమానురాలు. నువ్వు చేతులు కట్టుకుని తలాడించే బానిసవి.

ఏట్టి:—నీ తల్లి అనే గౌరవంతోనే ఈవిడతో వచ్చాను. ఇలా అవమానించటం బాగుండదు.

కుసుమ:—అనవసరపు మాటలు మాట్లాడకు. వస్తావా? రావా?

వీణా:—గుడ్! కుసుమా! అలా నీ చేతులలో పెట్టుకుని ఆడించాలి!

చిట్టి:—నాన్సెన్స్! నన్నెవరూ ఆడించలేరు, నా యిష్టం. నేను రాను.

కుసుమ:—ఇదే నీ తుది నిర్ణయమా? ఇంక నీకూ నాకూ సంబంధం ఉండదు.

వీణా:—హమ్మయ్యో! ఇంకమీద నువ్వు వీధుల్లో అడుక్కుతినాలి. వెళ్ళి కాళ్ళమీద పడు—బానిసలా పడివుంటే గుప్పెడు మెతుకులు దొరుకుతాయి.

చిట్టి:—నే నంత అడుక్కుతినటంలేదు కుసుమా! నువ్వు వెళ్ళచ్చు. నేను రాను.

కుసుమ:—సరే! వెళ్తున్నాను. ఇంక నువ్వు నా దగ్గరకు రానక్కర్లేదు. నీకూ నాకూ ఏ సంబంధమూ లేదు....

(కుసుమ వెళ్ళిపోబోతుంది.)

చిట్టి:—(కుసుమకు వినపడేలా) ఆహా! ఆ నడక చూడు! అంత వయ్యారం ఎక్కడైనా చూసావా?

(కుసుమ వెనక్కు తిరిగి కోపంగా చూస్తుంది. చిట్టి వెటకారంగా విరగబడి నవ్వుతాడు. వీణాధరి జాలిగా కుసుమని చూసి అంతలో పకాలున నవ్వుతుంది.)

* * *

## 6

(వీణాధరి ఇల్లు)

రఘు:—వీణా! నువ్వెందుకింత మారిపోయావో నాకు ఆశ్చర్యంగా వుంది?

వీణా:—కొత్తగా మారిందేముంది?

రఘు:—చిట్టిని నీ చుట్టూ ఎందుకు తిప్పుకుంటున్నావ్? నువ్వు చిట్టిని ప్రేమించావంటే నమ్మను.

వీణా:—చిట్టిని పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నాను.

రఘు:—ఏ మన్నావ్? చిట్టిని పెళ్ళి చేసుకుంటావా?

వీణా:—ఎందుకంత ఆశ్చర్యం? వితంతువివాహాలు యిప్పుడు మామూలేగా!

రఘు:—వీల్లేదు! నే నొప్పుకోను.

వీణా:—ఎవరితో అంటున్నావు ఈ మాటలు? నేను శ్రీమతి రఘురామ్‌ను కాను.

రఘు:—వీణా! నా మాటకు విలువలేదా?

వీణా:—ఎల్లకాలం యిలా మొండిగా బ్రతక మంటావా? నాకూ మొగుడూ పిల్లలూ కావాలనిపించింది.

రఘు:—నా మీద ప్రేమ పోయినట్లేనా?

వీణా:—ప్రేమఉండి బావుకుంటున్న దేమిటి? లేక నష్టపోయే దేమిటి.

రఘు:—వీణా! నీ అంతట నువ్వు దూరమయ్యావు. విచిత్రంగా మళ్ళీ నా జీవితంలోకి వచ్చావు. ఇప్పుడు మళ్ళీ దూరమవుతావా?

వీణా:—దూరంకాక దగ్గర యిందేముంది?

రఘు:—చిట్టిని వదిలెయ్యి నా అన్న వదినలు చాలా బాధపడతారు. నీ కిది న్యాయం కాదు.

వీణా:—ఏం? చిట్టికి నేను తగినదాన్ని కానా? నీ అన్న వదినెలు, నీ అన్న కొడుకు, నీ భార్యా బిడ్డలు నీకు ముఖ్యం. అలాగే నా సుఖం నేను చూసుకుంటున్నాను.

రఘు:—(నవ్వి) సుఖపడగలవా?

వీణా:—ఎందుకు సుఖపడలేను?

(రఘు వీణాధరి దగ్గిరగా వచ్చి ఆమె భుజంమీద చేతులు వేసి కళ్ళలోకి చూస్తాడు.)

రఘు:—పిచ్చిదానా! ఎక్కడ దొరుకుతుంది నీకు సుఖం?

(కళ్ళలో నీళ్ళు సుడులు తిరగ్గా అతని గుండెలమీద వాలిపోతుంది వీణాధరి.)

* * *

(రఘు యిల్లు)

సుంద:—ఇదేమిటయ్యా! చదివించి యేదో ప్రయోజకుణ్ణి చేస్తావని నీ వెంట పంపితే, చివరికిదా నువ్వు వెలగబెట్టిన నిర్వాకం?

గోపా:—వాడేం చేస్తాడే! కుక్కతోక వంకరని యెవరు చక్కదిద్దగలరు?

సుంద:—లక్షాధికారుల పిల్లని పెళ్ళాడు తున్నాడని రాస్తే పొంగిపోయాను. చివరికి ముండమోసింది దొరికిందా వీడికి?

గోపా:—రఘూ! నువ్వైనా చెప్పి చూడకపోయావా?

రఘు:—అన్నివిధాలా ప్రయత్నించాను అన్నయ్యా! లాభం లేకపోయింది.

సుంద:—ఉండు! నే వెళ్ళి దాన్నే నాలుగూ అడిగొస్తాను.

* * *

(వీణాధరి యిల్లు....సుందరమ్మ వీణాధరిని చూస్తూనే తనను తను మరిచిపోతుంది.)

సుంద:—ఆ ఉంగరాల జుట్టు యెంత బాగుందో? అయితే అమ్మాయ్, ఆ ఉంగరాలు సొంతమా! పెట్టుకున్నావా?

(వీణాధరి విచిత్రంగా చూస్తుంది.)

వీణా:—(చిలిపిగా) పెట్టుకున్నవి.

సుంద:—ఎలా పెట్టుకుంటారు?

వీణా:—క్లిప్స్ ఉంటాయి. అవి పెట్టుకుంటే వస్తాయి. ఫాన్సీ షాపుల్లో దొరుకుతాయి.

సుంద:—నీ శరీరం ఎంత నిగనిగ లాడుతోందో? ఏమైనా రాస్తావా?

వీణా:—(వింతగా చూస్తూ) ఆ! క్రీమ్స్‌రాస్తాను. అని మందుల షాపుల్లో దొరుకుతాయి.

సుంద :—ఎంత నాజూగ్గా వున్నావో. సన్న బడటం ఎలాగో తెలుసా ?

వీణా :—ఇదివరకు నేనూ మీ కంటె లావుగా ఉండేదాన్ని.

సుంద :—ఆ, ఆ,....ఎలా సన్నబడ్డావో చెప్పు.


వీణా :—వ్యాయామం చెయ్యాలి. తీరిగ్గారండి. నేర్పిస్తాను. ఇప్పుడు డ్యూటీకి వెళ్ళాలి.

* * *

(రఘు యిల్లు)

గోపా :—ఏమే ! నాలుగూ అడిగావా ?

సుంద :—ఆ ! అన్నీ అడిగానండీ ! ఫాన్సీ షాపుల్లో క్లిప్స్ దొరుకు తాయిట ! మందుల షాపుల్లో క్రీమ్స్ దొరుకుతాయట ! తెచ్చిపెట్టండీ ! ఈ సారి రమ్మంది. సన్నబడటానికి మార్గం చెపుతుందిట !




గోపా :—వెళ్ళి మగవాళ్ళని ఎలా వలలో వేసుకోవాలో కూడా అడిగి రా !

సుంద :—ఏవిటండీ ఆ మాటలు ?

గోపా :—లేకపోతే ఏవిటే ? నువ్వు వెళ్ళిన పనేమిటి ? చేసుకొచ్చిం దేమిటి ? రానురాను మతిపోతోంది. తల క్రిందులుగా తపస్సు చేసినా ముసలితనం పోయి పడుచుతనం రాదు.

సుంద :—అప్పుడే ముసలిదాన్నయి పోయానా ? చిన్నతనంలోనే పాడు వళ్ళొచ్చింది.

గోపా :—చాల్లే గోల ! చిట్టీ !

(చిట్టి వస్తాడు )

గోపా :—చదువుకోమని పంపిస్తే ఇదిరా నువ్వు చేస్తున్న నిర్వాకం ?

చిట్టి :—నేను చదువుకుని పెద్ద ఆఫీసర్ కావాలని నీ ఆశ ! కానీ, ఆ చదువు నాకు వంటబట్టకపోతే నేనేం చెయ్యగలను నాన్నా ? నీ ఆశ నీది కాని నా సంగతి అర్థం చేసుకోవేం ? నా చదువు కోసం ఖర్చుపెట్టిన డబ్బుతో ఏదైనా వ్యాపారం చేసినా....

గోపా :—నోరు మూసుకోరా ! గాడిదలా తిరుగుతోంటే చదువెలా వంటపడుతుంది ?

రఘు :—చిట్టి చెప్పిన మాటలు కూడా ఆలోచించవలసిందే అన్నయ్యా ! వాడికి చదువులో ఆసక్తి లేనప్పుడు మనం ఎంత రాపాడించినా ప్రయోజనం లేదు.

సుంద :—బాగానే ఉంది వరస. అయితే చిట్టీ ! నువ్వు కామాక్షమ్మ కొడుకులా కలెక్టర్ అవ్వవుట్రా ? ఆ కామాక్షమ్మ తెగనీలుగుతూ నా కొడుకు "కలెక్టర్" అయ్యాడు అంటే "నా కొడుకూ అవతాడు" అని చెప్పుచ్చుకు కొట్టినట్లు చెప్పొచ్చా ! ఇప్పుడు దాని ముందు తలెలా ఎత్తుకోనురా ?

గోపా :—చిట్టీ ! చదువు కోనని తెగేసి చెప్తున్నావు. ఇంక ఇక్కడెందుకు ? ఇంటికి పద !

చిట్టి :—వస్తాను. మీ కోడలితో కలిసి గృహప్రవేశానికి.

సుంద :—ఆ వెధవ ముండని వెంటబెట్టుకుని వస్తావుట్రా ?

చిట్టి :—అమ్మా ! నువ్వు "వెధవముండ" అంటున్నది నీ కోడల్ని. నీకు నేనొక్కణ్నే కొడుకుని.

(వెళ్ళిపోతాడు)

గోపా :—(బెంగగా) రఘూ !

రఘు :—దిగులు పడకు అన్నయ్యా ! నేను ఏదో ఉపాయం ఆలోచిస్తాను.

* * *

(హాస్పిటల్)

రఘు :—హలో ! కుసుమా ! ఇలా వచ్చావేం వంట్లో కులాసాగా ఉందా ?

కుసుమ :—చాలా ఆరోగ్యంగా ఉన్నాను.

రఘు:—కనిపిస్తున్నావు ఏదో హుషారుగా కూడా ఉన్నావు.

కుసుమ:—ఏ ధ్యేయమూలేని జీవితం నిస్సారంగా ఉంటుంది. ఈ మధ్య నేను చిత్రాలు గీస్తున్నాను. కొంత బాగానే గీయ గలుగుతున్నాను. అందుకే సంతృప్తిగా ఉంది.

రఘు:—వెరీగుడ్ ! కంగ్రాచ్యులేషన్స్.

కుసుమ:—డాక్టర్ ! నేను మీతో మాట్లాడాలని వచ్చాను.

రఘు:—నాతో మాట్లాడాలనా ! అలా నా విశ్రాంతి గదిలో కూర్చో ! కొద్దిసేపట్లో వస్తాను.

(రఘు విశ్రాంతి గది)

రఘు:—ఏమిటో చెప్పు.

కుసుమ:—మీ చిట్టి గురించి....అతను....

రఘు:—అయామ్ సారీ కుసుమా ! చిట్టి ప్రవర్తనకు నేను కూడా బాధపడుతున్నాను. పాపం భగవంతుడు నీకు అన్నివిధాలా

అన్యాయం చేస్తున్నాడు.

కుసుమ:—(రోషంగా) మీరు నన్ను చూసి జాలిపడక్కర్లేదు. నేనే మీమీద జాలిపడి మిమ్మల్ని హెచ్చరించటానికి వచ్చాను.

రఘు:—వాట్ !?

కుసుమ:—వీణాధరి చిట్టిని ప్రేమిస్తోందనే అనుకుంటున్నారా?

రఘు:—..........!

కుసుమ:—చిట్టిని వీణాధరినుండి విడదీయక పోతే చిట్టి మీకు దక్కడు.

రఘు:—నాకు అర్థం కావటం లేదు కుసుమా!

కుసుమ:—అర్థమయ్యేలా వివరిస్తాను. వీణాధరి ఎవరినో ప్రేమించింది. కానీ డబ్బుకోసం మా నాన్నగారిని పెళ్ళి చేసుకుంది. ఆ ప్రేమించిన వ్యక్తితో తప్ప మరెవరితోనూ వీణాధరి జీవించ లేదు. మరొకరి స్పర్శకూడా భరించలేదు తప్పని సరి పరిస్థితుల్లో చంపడానికీ, చావడానికీ అయినా సిద్ధపడుతుంది. కాని మరొక రితో సంసారం చెయ్యదు.

రఘు:—(పాలిపోయిన ముఖంతో)నీ కెలా తెలుసు?

కుసుమ:—ఆ నాటి కారు ఏక్సిడెంట్....అది ఏక్సిడెంట్ కాదు, వీణాధరి మా నాన్నగారిని పెళ్ళి చేసుకున్న రోజు, ఆ రోజంతా ఆవిడ ఎలాగో ఉండటం గమనించాను. కాని ఇంత ఘాతుకం మనసులో పెట్టుకుందని అనుకోలేక పోయాను. నవ్వించడానికి ఎంతగానో ప్రయత్నించాను. కానీ ఆ ముఖం జీవం నశించినట్లే ఉంది. నాన్నగారి దగ్గిరే పెళ్ళికాకముందు కారు డ్రైవింగ్ నేర్చుకుంది వీణాధరి. ఆ రోజు మేమంతా కారులో వెళుతున్నాం. వేగం విపరీతంగా ఎక్కువ చేసింది వీణాధరి. క్షణంలో మలుపు తిప్పింది. మరు క్షణంలో కొండకు గుద్దేసింది. నాన్నగారు ప్రమాదం గుర్తించారు. ఒక చేత్తో నన్నూ, మరో చేత్తో వీణాధరినీ అవతలకు తోసేసి తను స్టీరింగ్ పట్టుకోవటానికి ప్రయత్నించారు.

"కుసుమా! ఈ విషయం ఎక్కడా అనకు. వీణాధరికి ఏలోటూ రానివ్వకు' అన్నారు

ఇవే నాన్నగారి చివరి మాటలు!

(కుసుమ వెక్కి వెక్కి ఏడుస్తుంది. రఘు రాతిబొమ్మలా కూర్చుంటాడు.)

కుసుమ:—నాన్నగారు నన్ను బయటికి తోస్తున్నప్పుడు నేను కారులోనే ఉండాలని పెనుగులాడాను. అందుకే నా కాలు....ఈ విషయాలన్నీ ఎవరికీ చెప్పదలచుకోలేదు. కానీ, మీరు చాలా మంచివారు. మీ చిట్టికి అపాయం కలగటం నా కిష్టం లేదు. అందుకని చెప్పాను, వస్తాను.

*　　*　　*

(వీణాధరి ఇల్లు)

రఘు:—వీణా!....

వీణా:—ఏమిటి. మాట్లాడటం మాని తదేకంగా అలా చూస్తున్నావ్?

రఘు:—చూస్తున్నాను. సామ్రాజ్యాలు తలక్రిందులు చేసే స్త్రీ శక్తిని....మహాయుద్ధాలకు కారకమైన స్త్రీ శక్తిని ...చరిత్రలు సృష్టించే స్త్రీ శక్తిని....మానవుని మహోన్నత శిఖరాలకు నడిపించే స్త్రీ శక్తిని....అగాధంలోకి అణగద్రొక్కే స్త్రీ శక్తిని....

వీణా:—చూడు! కరగిపోతూ కాంతులు చిమ్మే కొవ్వొత్తిలాంటి స్త్రీ మూర్తిని....బడబానలాన్ని గర్భాన దాచుకుని శీకర తరంగాలలో ఊగించే సాగరంలాంటి స్త్రీ మూర్తిని....విషాన్ని మింగుతూ అమృతం సృష్టించగలిగే అమరమూర్తిని....

రఘు:—వీణా! స్వార్థంకోసం ఒకరి బ్రతుకు పాడుచెయ్యటం అన్యాయం కాదా?

కుసుమ:—కాదని ఎవరనగలరు?

రఘు:—చిట్టిని నీ ఆకర్షణలో ఎందుకు బంధించావు? ఆ తరువాత వాడీ ఆశాభంగానికి తట్టుకోలేక విలవిలలాడితే ఆ దోషం నీది కాదా?

వీణా:—నా ముందొక కర్తవ్యం ఉంది ఆ నిర్వహణలో నేను మరేదీ లక్ష్యపెట్టను. మీ చిట్టిని పాడు చేస్తున్నందుకు నువ్వు నన్ను అసహ్యించుకున్నా సరే!

రఘు:—అసంభవం వీణా! నాకు నిన్ను అసహ్యించుకోగలిగే శక్తి లేదు. నువ్వేం చేసినా, హత్యలు చేసినా, నిన్ను ప్రేమించటం మానలేను....

వీణా:—(పాలిపోయిన ముఖంతో) హత్యలు చేసినా....?

రఘు:—ఊరికే మాట సామెతకు అన్నాను....నాకోసమయినా చిట్టిని వదిలిపెట్టలేవా?

వీణా:—క్షమించు రఘూ! మన మనసులు ఎంత సన్నిహితంగా ఉన్నాయో మన జీవితాలు అంత దూరమయ్యాయి. నువ్వు నీ కుటుంబంకోసం తాపత్రయపడుతున్నట్లే, నేనూ నా కుటుంబం కోసం తాపత్రయ పడుతున్నాను.

రఘు:—నీ కుటుంబంకోసం తాపత్రయపడుతున్నావా? అంటే?

వీణా:—అర్థమయ్యేరోజు వస్తుంది. అంతవరకూ నేనేం చెప్పలేను.

రఘు:—నువ్వు నర్స్‌గా రాణిస్తావో, రాణించవో అనుకున్నాను. నీ డ్యూటీ నువ్వు చాలా చక్కగా చేస్తున్నావు.

వీణా:—నాచేత అలా చేయిస్తున్నది నీకు సహాయపడాలనే ఉత్సాహం. నాకు ఆనందం కలిగిస్తున్నది అందుకొంటున్న జీతం కాదు. నీతో కలిసి పనిచేయ గలుగుతున్న సంతృప్తి.

*　　*　　*

(వీణాధరి ఇల్లు)

చిట్టి:—వీణా! ఇంకా ఎన్నాళ్ళు నన్నిలా మురిపిస్తావు? నీకోసం లక్షలతో వచ్చే కుసుమను వదులుకున్నాను. తలిదండ్రుల్ని ఎదిరి

రించాను. చివరికి బాబాయికికూడా ఎదురు తిరిగాను. నీ మనసులో ఉద్దేశమేమిటో స్పష్టంగా చెప్పు. నీకసలు నామీద ప్రేమలేదు.

వీణా:—ఎంత దారుణంగా మాట్లాడుతున్నావు? ఇలా నా కళ్ళలోకి చూసి చెప్పు. నేను నిన్ను ప్రేమించటం లేదూ?

చిట్టి:—అది కాదు....నాకు తెలుసు....కానీ ఎన్నాళ్లిలా....!

వీణా:—కొంచెంరోజులుఓపిక పట్టలేవూ? ప్లీజ్....

చిట్టి:—(ఉద్రేకంగా) ఊహుఁ! ఓపిక పట్టలేను. చెప్పు. నన్ను పెళ్లి చేసుకుంటావా? లేదా? చేసుకుంటే వెంటనే చేసుకో? లేకపోతే వెళ్ళి కుసుమను క్షమాపణ కోరేస్తాను. ఆ డబ్బైనా వస్తుంది. రెంటికీ చెడిన రేవడిని కావటం దేనికి?

వీణా:—ఇప్పుడు నువ్వు క్షమాపణలు కోరినా కుసుమ క్షమించదు.

చిట్టి:—ఓహ్! ఆ మాత్రం చాకచక్యం నాకుంది లే! వెఱ్ఱిబాగులది! త్వరలోనే కరిగిపోతుంది.

వీణా:—నీ చాకచక్యం నాకు తెలియదూ? మొగవాళ్ళంటే మండిపడే మనిషిని. నన్ను నీ దానిని చేసుకున్నావు.

చిట్టి:—(పొంగిపోయి) ఏం లాభం? ఎప్పటి కప్పుడు ఆమడ దూరాన ఉంచుతున్నావుగా!

వీణా:—పెళ్ళయ్యేవరకేగా ఈ దూరం! ఆ తరువాత.

(సిగ్గుపడుతూ మనోహరంగా నవ్వుతుంది.)

చిట్టి:—ఆ రోజెప్పటికి వస్తుందో అర్థం కావటం లేదు. నీ అభ్యంతరం ఏమిటి?

వీణా:—చెట్టంత ఎదిగిన కూతురుండగా నేను ముందు పెళ్ళి చేసుకుంటే లోకులు ఆడిపోసుకోరూ........


చిట్టి:—కుసుమ నీ కూతురా? పైగా మీ కిద్దరికీ ఒకళ్ళంటే ఒకళ్ళకి పడదుగా........

వీణా:—ఇవన్నీ లోలోపల విషయాలు! సంఘంలో ఉన్నాక సమాజానికి కాస్త వెరవాలిగా! అందుకని కుసుమకి పెళ్ళయ్యా అవగానే మనం పెళ్ళి చేసుకుందాం!

చిట్టి:—బ్రహ్మాండంగా వుంది. ఆ కుంటిదానికి పెళ్ళి కావటం మాటలా? డబ్బుకి ఆశపడి నేను చేసుకుంటానన్నాను. కుంటితనానికితోడు తలకిమించిన గీర! రూపమూలేదు. ఎవడు చేసుకుంటాడు దాన్ని?

(ఆవేశం అణచుకోలేక పిడికిలి బిగించి బల్లమీద గట్టిగా గుద్దుతుంది వీణాధరి.)

చిట్టి:—ఏమిటి?




వీణా:—ఆవేదన అణచుకోలేక పోయాను.

చిట్టి:—దేనికి ఆవేదన?

వీణా:—నువ్వు చెప్పేవరకూ కుసుమ పెళ్ళి కావటం యింత కష్టమని అనుకోలేదు. మన పెళ్ళికి ఆలస్యమవుతుంది కదా, అని ఆవేదన!

చిట్టి:—అందుకే........

వీణా:—అందుకే! ఒక్క సంవత్సరం ఆగు. అప్పటికీ కుసుమ పెళ్ళి కాకపోతే, మనం పెళ్ళి చేసేసుకుందాం!

చిట్టి:—ఒక్క సంవత్సరం! ఆ తరువాత ఒక్కరోజు కూడా ఆగను.

(వెళ్ళబోయి ఆగి........) వీణా! ఒక్కమాట! ఆ తరువాత నువ్వు నన్ను మోసం చేస్తే ప్రాణాలతో వదలను.

(వీణాధరి పకపక నవ్వుతుంది.)

చిట్టి:—ఎందుకా నవ్వు?

వీణా:—నీ తెలివితక్కువ తనానికి! నర్స్ ఉద్యోగం చేస్తున్నాను. చిటికెడు విషం కాఫీలో కలిపిస్తే ఏమయిపోతావు నువ్వు? నన్ను ప్రాణాలు తీస్తానని బెదరిస్తున్నావు.

(చిట్టి ముఖం పాలిపోతుంది. సర్వాంగాలూ వణుకుతాయి.)

వీణా:—(కంగారుగా) ఛ! ఛ! నాకు నీ మీద విశ్వాసం లేకపోవటం యేమిటి? ఏదో ఉద్రేకంలో అన్నాను. నీ కోసం ప్రాణాలు యిస్తానేగాని నీ ప్రాణాలు తీస్తానా?

(వెకిలిగా నవ్వుతాడు. అంతకంటే వెకిలిగా నవ్వుతుంది వీణాధరి)

*    *    *

(చిత్రకళా ప్రదర్శనోత్సవం.)

ఒక కంఠం:—కుమారి కుసుమగారికి అభినందనలు. ఇంత చిన్న

వయసులో ఇంత ప్రతిభ అపురూపం.

మరో కంఠం :—మేడమ్! నా ఆటోగ్రాఫ్‌లో సైన్ చెయ్యరూ?

మరో కంఠం :—మిస్ కుసుమా! మీ చిత్రాలలో జీవం ఉట్టిపడుతూ వుంటుంది.

మరో కంఠం :—మోడ్రన్ ఆర్ట్ కూడా ప్రాక్టీస్ చేస్తున్నారా?

మరో కంఠం :—మీలాంటి చిత్రకారిణులు వుండటం భారతీయ చిత్రకళకే గర్వకారణం.......

కుసుమ:—(చిరునవ్వుతో అందరినీ చూపి) థేంక్స్! నే నింకా నేర్చుకుంటున్నాను.

మరో కంఠం :—కళాకారుడు ఎప్పుడూ గుర్తుంచుకోవలసిన మాట అన్నారు. కళాకారుడు నిరంతరం నేర్చుకుంటూనే వుండాలి.

కృష్ణ :— కుసుమా! ఈయన ప్రఖ్యాత చిత్రకారులు సుందరంగారు.

కుసుమ :—మిమ్మల్ని కలుసుకోగలిగినందుకు చాలా సంతోషంగా వుంది.

సుంద :—కృష్ణ మిమ్మల్ని గురించి చెప్పాడు మిమ్మల్ని కలుసుకో గలిగినందుకు నాకు చాలా సంతోషంగా వుంది. కళాకారులకు కళే జీవితం. ఏ పరిస్థితుల్లోనూ నిరుత్సాహాన్ని దగ్గరకు రానీయకండి. మీ ప్రతిభను వ్యర్థం చెయ్యకండి

కుసుమ :—కళలో జీవించటం కృష్ణ నాకు నేర్పించారు. ఇంక మీద నిరుత్సాహం నా దరిదాపులకు కూడారాదు.

సుంద :—గుడ్!

*  *  *

(కుసుమ మేడ)

కుసుమ :—మీకు నా కృతజ్ఞతలు యెలా చెప్పుకోవాలో అర్థం కావటం లేదు.

కృష్ణ :—దేనికి కృతజ్ఞతలు?

కుసుమ :—మీరు నన్ను చిత్రకళా ప్రదర్శనానికి ప్రోత్సాహపరచి తీసికెళ్ళకపోతే, నన్ను అభిమానించే జనులు యిందరున్నారని నాకు తెలిసేది కాదు. నా కాలు కుంటిదయినా బ్రతుకు కుంటిది కాలేదు.

కృష్ణ:—ఎప్పటికీ కాదు. ఈ సమన్వయం సృష్టిలోనే ఉంది. ఒక వైపు ఎంత పోగొట్టుకుంటామో, మరో వైపు అంత పొందు తాము. భౌతిక శాస్త్రంలో ప్రాథమిక సూత్రం ఇది.

కుసుమ:—ఈ రోజుల్లో లలితకళలకు తగినంత ప్రోత్సాహమే లేదు. జీవితం మరీ యాంత్రికం ఆయిపోతోంది.

కృష్ణ:—ఒకరిద్దరు ఉత్సాహంతో ముందుకొచ్చి నేర్చుకున్నా, వాళ్ళకు ఆ కళలతో భుక్తిగడవటం లేదు. ఆ కారణంగా ప్రతిభావంతు లయిన కళాకారులలో కూడా ఉత్సాహం తగ్గిపోతోంది.

కుసుమ:—నా డబ్బంతా ఖర్చుపెట్టి శాంతినికేతన్ లాంటి ఆశ్రమం స్థాపిస్తాను. శిల్పం, చిత్రలేఖనం, సంగీతం మొదలైన లలిత కళలన్నీ విద్యార్థినీ విద్యార్థులకు నేర్పించే ఏర్పాట్లు చేస్తాను.

కృష్ణ:—ఉద్దేశం చాలా బాగుంది. కానీ, మీరు దీని నొక వ్యాపా రంగా భావిస్తే మాత్రం మీకు లాభమే వస్తుందని చెప్పలేను. మీ డబ్బు దండుగ!

కుసుమ:—లాభాలు గడిద్దామని నాకు లేదు. నా బ్రతుకు కొక అర్థాన్నీ, ఆధారాన్నీ కల్పించుకోవాలని ఇలా సంకల్పించు కున్నాను.

కృష్ణ:—ఇన్నాళ్ళుగా భోగ భాగ్యాలలో ఓలలాడిన మీరు బీదరి కాన్ని ఎదుర్కోవలసివస్తే సహించగలరా?

కుసుమ:—ఈ నాడు నాకు కావలసింది మానసికమైన శాంతి. సంతృప్తి. దారుణమైన అశాంతితో వేగిపోతూ ఏం తింటున్నానో, ఏం కట్టుకుంటున్నానో కూడా గుర్తించ లేని నేను ఈ ఐశ్వర్యం వల్ల పొందగలిగిన దేమిటి? కుంటి తనానికి తోడు డబ్బు కూడా లేని నన్ను ఎవరూ పెళ్ళాడరు. పోనీయండి!

కృష్ణ:—ఈ నిశ్చయం మీరు దృఢంగా చేసుకున్నట్లేనా? తరు వాత పశ్చాత్తాప పడరుగా!

కుసుమ:— పడను కానీ, నాకు మీ సహకారం కావాలి.

కృష్ణ :—ఎంతాశ? సహకారం ఊరికేనే వస్తుందా? మూల్యం చెల్లించాలి!

కుసుమ:—మీరు కూడా డబ్బు కోసం....

కృష్ణ:....డబ్బు కాక పోతే, మరొకటి....

కుసుమ:—ఏం కావాలో అడగండి....

కృష్ణ: - మీరు నా భార్య కావాలి.

కుసుమ:—(కన్నీళ్ళతో) నిస్సహాయురాలినని వేళాకోళం చెయ్య కండి.

కృష్ణ:—మీతో వేళాకోళాలాడే అధికారం మీరు నాకింకా ఇవ్వ లేదుగా! ఇది వేళాకోళం కాదు.

కుసుమ:—మీరు ఎందు కింత త్యాగం చేస్తున్నారో అర్థం కావటం లేదు.

కృష్ణ:—త్యాగం అనకండి. అమాయకమైన మీ మనసు అర్థం చేసుకున్నాక, మీరు నాకు అన్నివిధాలా తగిన భార్య కాగలరని నిశ్చయించుకున్నాక, మీ డబ్బు మన మధ్య అడ్డు గోడలా నిలవదని తేల్చుకున్నాక, ఈ ప్రస్తావన తెచ్చాను, తొందర లేదు. నిదానంగా ఆలోచించుకోండి.

కుసుమ:—ఆలోచించుకోవలసింది మీరే! ఒకప్పుడు చిట్టిని చేసు కోవాలని నిశ్చయించుకున్నాను. నా మనసు బలహీన మయినదని మీరు....

కృష్ణ:—ఒక్కనాటికీ అనుకోను. చిట్టిని మీరు ప్రేమించలేదు. కాలు కుంటి పోయిందనే ఆవేదనలో ఉన్న మీకు కొద్దిగా సాను

భూతి నటించిన చిట్టి ఉదారుడుగా కనిపించాడు. ఈ నాడు మీకు సంపూర్ణమైన ఆత్మవిశ్వాసం వచ్చింది. ఒక వేళ నా అదృష్టం కొద్దీ మీరు నన్ను అంగీకరిస్తే అది నిస్సహాయ స్థితిలో కాదు. నా మీద ప్రేమతోనే!

కుసుమ:—ఆశ్రమం స్థాపించటానికి నాకు సహకరిస్తారుగా !?

కృష్ణ:—నా అభ్యర్థన మన్నిస్తారుగా!

(కుసుమ హాయిగా ఉత్సాహంగా నవ్వుతుంది. కుసుమ, కృష్ణ పరస్పరం కరసంచాలనం చేసుకుంటారు)

## 7

(రఘు ఇల్లు—పేరంటం—డాక్టర్ల భార్యలు—ఆఫీసర్ల భార్యలు మొదలైన వాళ్ళతో సందడిగా వుంటుంది.)

1. శ్రీమతి:—మిసెస్ రఘురామ్! బాబు అచ్చు మీ పోలికే! చాలా బాగున్నాడు,

2. శ్రీమతి:—తల్లి పోలిక వస్తే అదృష్టమంటారు!

3. శ్రీమతి:—అంటే, తండ్రిగారి తెలివికూడా వచ్చినట్లే!

(అందరూ నవ్వుతారు. వీణాధరి వస్తుంది. తనచేతిలో పాకెట్ కమల కందిస్తుంది.)

వీణా:—బాబుకు నా చిన్న కానుక.

కమల:—రండి. కూర్చోండి!

1. శ్రీమతి:—ఈవిడెవరు? ఏ పేరంటంలోనూ చూడలేదే?

2. శ్రీమతి:—ఎలా చూస్తారు? ఈవిడ హాస్పిటల్లో నర్స్.

1. శ్రీమతి:—నర్సా? డాక్టర్ రఘుది ఎంత విశాలమైన హృదయం? నర్సులనుకూడా ఆహ్వానించారన్నమాట!

2. శ్రీమతి:—మరీ అంత విశాలం కాదులే! అందరు నర్సులనూ ఆహ్వానించలేదు. ఈవిడ నొక్కదాన్నే....

1. శ్రీమతి:—ఏవిటో, ఆ ప్రత్యేకత?

2. శ్రీమతి:—రెండు కళ్ళూ పెట్టుకొని ఎవరి నడుగుతున్నావ్? కళ్లు మిరుమిట్లు గొలిపే ఆ అందంకంటె మరో ప్రత్యేకత ఏం కావాలి?

1. శ్రీమతి:—ఛ! డాక్టర్ రఘు చాలా మంచివారు!

2. శ్రీమతి:—నిజమే! కాని, త్యాగరాజు చెప్పలేదూ? "ఎంతవార లైనా....కాంతాదాసులే...."

1. శ్రీమతి:—అంతేలే!

(ఇద్దరూ నవ్వుకుంటారు. కమల బాధపడుతుంది.)


3. శ్రీమతి:—మిసెస్ రఘురామ్! ఈ నర్స్ మీకు బంధువా?

కమల:—స్నేహితురాలు.

4. శ్రీమతి:—(సన్నగా) ఎవరికి?

(ముసిముసి నవ్వులు)

3. శ్రీమతి:—హాస్పిటల్లో అందరు నర్సులుండగా ఈవిడ నొక్క దాన్నే ఆహ్వానిస్తే బంధువు లనుకున్నాను....ఏం అనుకోవద్దు .




కమల:—ఇందులో అనుకోడాని కేముంది లెండి!

5. శ్రీమతి:—ఈ రోజుల్లో అంతస్థులే కాని బంధుత్వం ఎవరికి కావాలండీ!

6. శ్రీమతి:—బంధుత్వానికి మించిన అనుబంధాలకు ఏ అంతస్థులూ అడ్డురావు లెండి!

(ఒక శ్రీమతి కమలను జాలిగా చూస్తుంది. కమల భరించలేక ముఖం తిప్పుకుంటుంది. వీణాధరి ముఖం కోపంతో జేవురిస్తుంది.)

7. శ్రీమతి:—నేను వెళ్ళొస్తానండీ! నాకు పనుంది.

(కమల లేచి తాంబూలాలు ఇస్తుంది. వీణాధరి సహాయం చెయ్య బోతుంది.)

1. శ్రీమతి:—మిసెస్ కమలా! నర్సుల సహాయం హాస్పిటల్లోనే అవసరం. ఇంట్లోకూడా ఆవిడ సహాయం చెయ్యటం ప్రారంభిస్తే నీ ఇల్లు నిలవదు. పెద్దదాన్ని నీ మేలుకోరి చెపుతున్నాను. జాగ్రత్త!

(కమల ముఖం పాలిపోతుంది. వీణాధరి కళ్ళలోంచి నిప్పులు కురుస్తాయి. ఆ కోపానికి వెటకారంగా నవ్వుతుంది శ్రీమతి. ఒక్కరొక్కరుగా అంతా వెళ్లిపోతారు. కమల వడిలిన ముఖంతో అలాగే కూర్చుంటుంది. రఘు వస్తాడు. కమల లేచి వెళ్లి టీ తెస్తుంది.)

రఘు:— కమలా! పేరంటం బాగా జరిగిందా?

కమల:—బాగానే జరిగింది.

రఘు:—అలా ఉన్నావేం? చాలా శ్రమ అయిందా?

కమల:—శ్రమ కాదు, ఆలోచిస్తున్నాను.

రఘు:—ఏమిటీ?

కమల:—మన వివాహ సమయంలో పురోహితుడికి మీరు సమాధానం చెప్పారు. "నాతి చరామి!" అని గుర్తుందా?

(రఘు ఉలికిపడి పరిశీలనగా కమల ముఖంలోకి చూస్తాడు.)

రఘు:—కమలా! ఏం జరిగింది?

కమల:—మీరు "నాతి చరామి!" అని వాగ్దానం చేసింది పదిమంది పెద్దల సమక్షంలో! అంటే ఆ మీ వాగ్దానం సమాజానికి! సామాజిక జీవనంలో అత్యంత ప్రధానమయిన గృహస్థాశ్రమంలో ప్రవేశించబోతూ సామాజిక రీతినీతులను అతిక్రమించి చరించనని వాగ్దానం చేసారు.

రఘు:—కమలా! నేనేం తప్పుచేసాను?

కమల:—తప్పొప్పులూ, మంచి చెడ్డలూ ఎవరు నిర్ణయించగలరు? మీ అంతరంగానికి వ్యతిరిక్తంగా మీరు ప్రవర్తిస్తే ఆ క్షోభ మీ ఒక్కరిదే! కానీ, సామాజిక న్యాయాన్ని వ్యతిరేకిస్తే దాని ఫలితాలు మీతోపాటు మీ కుటుంబమంతా పంచుకోవలసి వస్తుంది.

రఘు:—నేనేం చేసానో చెప్పు!

కమల:—ఈ రోజు పేరంటానికి వీణాధరిని ఆహ్వానించారా?

రఘు:—ఆహ్వానిస్తే తప్పా?

కమల:—ఆవిడ ఒక నర్స్ మాత్రమే!

రఘు:—అయితే? కమలా! నువ్వుకూడా ఈ అంతస్థుల తారతమ్యాలు....

కమల:—ఎంచను. కానీ, మీరు హాస్పిటల్‌లో నర్స్‌ల నందరినీ ఆహ్వానించ వలసింది. అప్పుడు నేను చాలా గర్వపడేదానిని. ఈ రోజు నన్ను చూసి నలుగురూ జాలిపడ్డారు. నేను యేదైనా భరించగలను. కానీ, మరొకరు నన్ను చూసి జాలిపడటం సహించలేను.

రఘు:—అయామ్ సారీ!

*       *       *

(వీణాధరి యిల్లు)

వీణా:—రఘూ! ఈ వెండి గిన్నె చూడు! బాగుందా?

రఘు:—చాలా బాగుంది. ఎందుకు కొన్నావ్?

వీణా:—బాబు కోసం! నువ్వు బాబుకి అన్నప్రాసన అని చెప్పిన దగ్గిరనుండీ కష్టపడి డబ్బు పోగు చేస్తున్నాను. నర్స్‌ని. ఎంత పోగుచెయ్యగలను చెప్పు? కష్టంమీద నూటయాభై కూడబెట్టాను. ఇది కొన్నాను.

రఘు:—వీణాధరీ! నువ్వు........

వీణా:—ఎందుకంత సంకోచిస్తున్నావు? చెప్పు!

రఘు:—నన్ను క్షమించు. నేను కావాలని యిలా చెయ్యటం లేదు. కాని........

వీణా:—విషయం చెప్పు.

రఘు:—బాబు అన్నప్రాసనకి నువ్వు అక్కడికి రావద్దు వీణా! ఇప్పుడేకాదు. ఇలాంటి వేడుకలకు అసలు రావద్దు.

(వీణాధరి ముఖం పాలిపోతుంది. చేతుల్లోంచి వెండిగిన్నె జారి పడుతుంది.)

వీణా:—అర్థమయింది! కనీసం, ఈ గిన్నె బాబుకి యివ్వగలవా? ఆ మాత్రం అర్హత అయినా ఉందా నాకు?

రఘు:—ఇది నేనుతీసుకున్న నిర్ణయంకాదు వీణా! సమాజం నిర్ణయించిన విధానం.

*       *       *

(వీణాధరి ఇల్లు)

కృష్ణ:—అక్కయ్యా! నీ దయవల్ల నేను ప్రయోజకుణ్ణి అయ్యాను. ఇంకా నీ కెందుకీ శ్రమ? ఈ నర్స్ వృత్తి మానెయ్యి. సుఖంగా నా దగ్గిర ఉండు!

వీణా:—ఆ సుఖమనేది నా కెక్కడా దొరకదు కృష్ణా! నన్నిలా ఉండనియ్యి. ఈ మాత్రం ఆధారమైనా లేకపోతే నేను బ్రతకలేను.

కృష్ణ:—అక్కయ్యా! నేను నీకు ఏ లోటూ రానివ్వను. నా జీతమంతా నీకే ఇస్తాను. నర్స్‌గా నువ్వు సంపాదించేదెంత? నా మాట విను ఈ ఉద్యోగం మానెయ్యి.

వీణా:—బ్రతకటానికి కావలిసినది డబ్బొక్కటే కాదయ్యా! ఇంకా చాలా చాలా కావాలి. అన్నీ కాకపోయినా, కొద్దిగా నయినా, నర్స్‌గా ఉంటూ పొందగలుగుతున్నాను. ఇది వదులుకోను.

కృష్ణ:—రోగులకు సేవచేస్తూ మనశ్శాంతి పొందగలుగుతున్నావా అక్కయ్యా!

(వీణాధరి సమాధానం చెప్పదు. నవ్వుతుంది.)

*       *       *

(కుసుమ మేడ)

రాజారావు:—కుసుమా: ఎన్ని సంబంధాలు తెచ్చినా వప్పుకోవు. కట్నంకోసం నిన్ను చేసుకునేవాళ్ళను చేసుకోనంటావు. ఇలా ఒంటరిగా ఎంతకాలం ఉంటావమ్మా!

కుసుమ:—ఇంక ఒంటరిగా ఉండక్కర్లేదు బాబయ్యగారూ!

రాజారావు:—అంటే? వీణాధరినికూడా ఇక్కడే ఉండమంటావా?

కుసుమ:—ఛీ! ఆ పాపిష్టిదాని పేరు నా దగ్గిర తేకండి! నేను.... నేను.... పెళ్లి చేసుకోబోతున్నాను.

రాజారావు:—కంగ్రాచ్యులేషన్స్. ఎవరినమ్మా?

కుసుమ:—కృష్ణను....

రాజారావు:—ఆ వీణాధరిని అంతగా ద్వేషిస్తున్నావు. ఆవిడ తమ్ముణ్ణి....

కుసుమ:—కృష్ణ చాలా మంచివాడు బాబయ్యగారూ!

రాజారావు:—ఏమోనమ్మా! అతనికి మాత్రం నీ డబ్బుమీద ఆశ లేదంటావా?

కుసుమ:—ఎంతమాత్రం లేదు బాబయ్యగారూ! నా డబ్బంతా పెట్టుబడి పెట్టి లలితకళలు అభివృద్ధి చెయ్యటానికి ఆశ్రమం స్థాపించి

నాను. ఆ తర్వాతనే అతను నన్ను పెళ్లి చేసుకుంటానన్నాడు.

రాజారావు:—నీ డబ్బంతా ఖర్చుపెట్టి ఆశ్రమం స్థాపించావా? ఎంత పిచ్చిపని చేసావమ్మా!

కుసుమ:—డబ్బున్నది ఆనందించటానికేగా బాబయ్యగారూ, ఆ ఆనందం ఒక్కొక్కరికి ఒక్కొక్కదానిలో దొరుకుతుంది. నాకు ఇందులోనే ఆనందం ఉంది.

రాజారావు:—ఏం చెప్పాలో తోచటం లేదమ్మా! మీ నాన్నగారంటే అన్నీ ఆయన చూసుకొనేవారు! ఎంతో మంచి స్నేహితుణ్ణి పోగొట్టుకున్నాను. ఎప్పుడూ కారు రేసుల్లో మునిగి తేలే వ్యక్తి... సర్కస్ ఫీట్లకంటె అద్భుతమైన ఫీట్లు కారు డ్రైవింగ్‌లో చెయ్య గలిగిన వ్యక్తి....చివరకు కారు....

కుసుమ:—(ఏడుస్తూ) బాబయ్యగారూ! మీకు పుణ్యం ఉంటుంది. ఆ విషయాలు గుర్తు చెయ్యకండి. భరించలేను.

రాజారావు:—ఊరుకోమ్మా! ఊరుకో! ఏ లోకాలలో ఉన్నా మీ నాన్న నిన్ను ఆశీర్వదిస్తూనే వుంటాడు.

* * *

## 8

(రఘు ఇల్లు. రఘు జ్వరంతో మంచం మీద పడుకొని ఉంటాడు. కమల రఘు ప్రక్కనే మంచం మీద కూర్చొని వుంటుంది వీణాధరి ఎదంగా కుర్చీలో కూర్చొని ఉంటుంది)

వీణా—కమలా! రెండు రోజుల్నించీ అలా కూర్చుని ఉన్నారు. వెళ్ళి విశ్రాంతి తీసుకోండి. నేనుంటాను ఇక్కడ!

కమ:—ఏం మాట్లాడుతున్నారు! ఈయనను జ్వరంలో వదిలి వెళ్ళి విశ్రాంతి తీసుకోనా? ఎక్కడ దొరుకుతుంది అది నాకు?

వీణా:—తిండీ, తిప్పలూ లేకుండా....

కమ:—ఏదో తింటున్నాను, పోనీయ్యండి. ఆ విషయా లేమీ మాట్లాడకండి. నన్నసలు మాట్లాడించకండి.

వీణా:—మాట్లాడకుండా కూర్చుంటే మరింత బెంగగా ఉండదా?


కమ:—మీరు నవ్వుతారేమో! నా చాదస్తం నాది! మనసులో ఈయన వ్యాధి తగ్గించమని భగవంతుణ్ణి ప్రార్థించు కొం టున్నాను.

రఘు:—(నవ్వి) కమలా! కాస్త జ్వరానికే అలా అయిపోతే ఎలా?

కమ:—మీకు అర్థంకాదు! వీణాధరి గారినే అడగండి ఏం వీణాధరీ! లోకంలో ఏ ఆడదానికయినా భర్త ప్రాణాలకంటె ముఖ్యమైనది ఉంటుందా?

రఘు:—(వారిస్తూ) కమలా....

కమ:—నేను అన్నదాన్లో తప్పేముంది? కుంకుమకు నోచుకోని వీణాధరి ముఖం చూసినప్పుడల్లా ఆ దురవస్థ శత్రువుకు కూడా వద్దనిపిస్తుంది. పాపం! ఆవిడ భర్త ఏక్సిడెంట్‌లో మరణిం చారు. లేకపోతే తన ప్రాణాలొడ్డి కాపాడుకొనేది కాదా? తన




భర్త ఆరోగ్యం ముందు, తన సౌఖ్యం తన ఆకలి, తన కష్ట సుఖాలు లక్ష్యపెట్టగలిగేదా?

(వీణాధరి ముఖం పాలిపోతుంది. రక్తం చిమ్మేలా పెదవి కొరుక్కుంటుంది, ఉద్వేగం అణచుకుంటూ చేతులు ఒకదానితో ఒకటి బంధించి గట్టిగా నొక్కుకుంటుంది. కళ్ళెత్తి కమల ముఖంలోకి చూసి ఆ చూపులతో చూపులు కలపలేక రఘు ముఖంలోకి చూస్తుంది, ఆ చూపులలో దైన్యానికి కరిగిపోతాడు రఘు)

రఘు:—కమలా! ఆ ప్రస్తావన వదిలెయ్యి....

కమల:—ఎందుకు? ఆవిడ బాధ పడుతున్నారనా? పడనీయండి. ఈ ఆవేదనలోనూ ఒక మాధుర్యం ఉంది. కాదా, వీణాధరీ!

(వీణాధరి చేతులలో ముఖం కప్పుకుని ఏడుస్తుంది. చటుక్కున తలెత్తుతుంది. ముఖం గంభీరంగా అయిపోతుంది)

వీణా:—నా భర్త....నా భర్త....

(రఘు వీణాధరి ముఖం చూసి భయపడుతాడు)

రఘు:—వీణాధరీ! ఆయన మరణించారు. ఆ విషయం మరిచిపో!

వీణా.—లేదు! లేదు! నా భర్త మరణించలేదు. క్షేమంగా ఉన్నాడు. ఉంటాడు! ఎటొచ్చీ నా భర్తను నా భర్త అని చెప్పుకో లేని దౌర్భాగ్యపుస్థితిలో ఉన్నాను.

రఘు:—వీణా, ఉద్రేకపడకు.

కమల:—నాకు అర్థమయింది. మీ భర్త మీ మనసులో చిరంజీవిగా ఉన్నారు. ఆడదానినయి ఈ మాత్రం అర్థం చేసుకోలేనా?

(వీణాధరి నిర్ఘాంత పోతుంది. దీనాతి దీనంగా నవ్వుతుంది)

రఘు:—కమలా! దాహం!

కమల:—ఇప్పుడే పళ్ళరసం తెస్తాను.

వీణా:—నేను తీస్తాను పళ్ళరసం.

కమల :—మీకెందుకు శ్రమ!

వీణా :—ఇందులో శ్రమ ఏమీలేదు. స్నేహితురాలినయి ఆమాత్రం సహాయపడలేనా?

కమల:—క్షమించండి. ఆయనకు నా చేతులతో నేను ఇచ్చుకుంటాను. లేకపోతే నాకు సంతృప్తి ఉండదు.

(కమల లోపలకు వెళ్తుంది. రఘు, వీణాధరి ఒక్కక్షణం ఒకరి కళ్లలోకి ఒకరు చూసుకుంటారు. అణచుకున్న కన్నీళ్లు వీణాధరి కళ్లలో పొంగుతాయి. రఘు బలహీనమైన చేత్తో వాటిని తుడుస్తాడు.)

వీణా :—రఘూ! నీకు నేనేమీ చెయ్యలేనా? ఇలా పరాయిదానిలా కూర్చోవలసిందేనా?

రఘు:—ఏం చెయ్యక్కర్లేదు వీణా! నువ్వు నాకు చెయ్యలేదని నేననుకుంటానా?

వీణా:—నువ్వు అనుకుంటావనా? ఇంతేనా నువ్వు అర్థం చేసుకున్నది? నా సర్వస్వమూ అయిన నువ్వు జ్వరంతో బాధ పడుతోంటే, తలపట్టలేను. పళ్ళరసం ఇవ్వలేను. మందు లివ్వలేను. కనీసం దగ్గిరగా కూర్చోలేను. గుండెలు పగిలేలా ఏడవగలనే తప్ప, ఏం చెయ్యలేను! ఎలాంటి నరకం! ఇది నేను భరించలేను రఘూ! నాకు ఏ ఆనందమూ, సౌఖ్యమూ అక్కర్లేదు. నీకు సేవచెయ్య నియ్యి.

రఘు:—(జాలిగా) వీణా! నీ కోసం, నా చేతులలో ఉన్న దేదైనా చేస్తాను. ఏం కావాలన్నా ఇస్తాను. (తన ప్రక్కన మంచం మీద సైగచేసి) ఈ స్థానం కమలది. నే నెలా లాక్కోగలను? ఈ ఇల్లు కమలది. ఇక్కడ మరొకరికి అధికారం నేనెలా ఇయ్యగలను?

(కమల పళ్ళరసంతో వస్తుంది. కమల రఘును లేవదీసి పళ్ళరసం త్రాగిస్తోంటే వీణాధరి గుండెలవిసే ఆవేదనతో చూస్తుంది. ఒక నర్సువస్తుంది.)

నర్స్:—వీణాధరీ! ఇవాళమీరు డ్యూటీకి రారా? సెలవు చీటీ కూడా పంపలేదు.

వీణా:—రాను.

నర్స్:—ఎందుకూ?

వీణా:—రావాలని లేదు.

నర్స్:—ఈ మాటే కేశవరావుగారితో చెప్పనా? ఆయన మండిపడతారు.

వీణా:—పడమను.

(కమల విచిత్రంగా చూస్తుంది)

కమల:—మా నాన్నగారికి అన్నింటికన్న ముందు డ్యూటీ ప్రధానం. ఆయనలో కన్న తండ్రికంటే వైద్యానికే సర్వమూ అర్పించే డాక్టరే ప్రధానంగా కనిపిస్తాడు నాకు. నిష్కారణంగా ఎవరైనా తమడ్యూటీ అశ్రద్ధచేస్తే ఆయనకు చాలా కోపం వస్తుంది. మీరు వెళ్ళరాదూ!

వీణా:—వెళ్ళలేను.

కమల:—ఇంత మంచి వాళ్ళను ఎక్కడా చూడలేదు. ఉద్యోగం ఎల్లకాలం వుండేది. ఈ జ్వరం ఇవాళ ఉండి రేపు నయమయ్యేది. వెళ్ళండి. ఇక్కడ ఉండి చేసేదేముంది?

వీణా:—చేసేదేం లేదు—కాని వెళ్ళను.

కమల:—(రఘుతో) మీరు చెప్పండి! నాన్నగారి కోపం మీకు తెలుసుగా!

రఘు:—వెళ్ళు వీణా! మామగారికి డ్యూటీలో అశ్రద్ధ పనికిరాదు. ఆయన కోపానికి నేను కూడా భయపడతాను.

(వీణాధరి చటుక్కున లేచి నించుంటుంది.)

వీణా:—నేను వెళ్ళకపోతే మీ మామగారికి కోపం వస్తుంది. అందుకని నేను వెళ్లాలి! సరే! వెళ్తున్నాను ఇంకరాను.

(రఘు ఏదో అనబోతాడు. వీణాధరి విసురుగా వెళ్ళి పోతుంది. రఘు ఆత్రుతతో లేవబోతాడు. కమల పట్టుకుంటుంది)

కమల:—(దీనంగా)—ఏం కావాలి? మీరు ఏంకావాలన్నా నేను తీసుకొస్తాను. మిమ్మల్ని మాత్రం కదలనీయను. ఏం కావాలో చెప్పండి.

రఘు:—(నిస్పృహతో పక్కమీద వాలిపోయి) ఏం అక్కర్లేదు.

* * *

(అదేగది. కేశవరావుగారు రఘును పరీక్షిస్తూ వుంటారు.)

కేశ:—కమలా! ఇది టైఫాయిడ్! జాగ్రత్త! రోగిని కదలనియ్యకు.

కమల:—(బెంగగా) నాన్నగారూ!

కేశ:—డాక్టర్ కూతురివయి అలా బెంబేలు పడితే ఎలా? ఈ రోజుల్లో కొత్తకొత్త మందులు చాలావస్తున్నాయి. ఎలాంటి జబ్బులూ త్వరలో నయమయి పోతున్నాయి. నీ కెందుకు? వారంలో నయంచేస్తాను.

రఘూ? ఏవిటి? ఎందుకలా వెతుక్కుంటున్నట్లు నాలుగువైపులా చూస్తున్నావ్?

రఘు:—రా లేదా?

కేశ:—ఎవరు? ఎవరురావాలి?

(కమల పెదవి కొరుక్కుని కళ్ళతో నీళ్ళు కనపడకుండా తల తిప్పుకుంటుంది.)

రఘు:—ఏంలేదు. ఎవరూ రానక్కర్లేదు.

కేశ:—కమలా! పాపం! వాళ్ళ అన్నా వదినలను చూడా లనుకుంటున్నాడేమో! ఉత్తరం వ్రాయరాదూ!

కమల:—(పేలవంగా నవ్వుతూ) అలాగే నాన్నగారూ!

కేశ:—చిన్న దొరగారు మాస్టర్ రఘుగారు ఏడీ? కమలా! వీడు చాలా చిక్కిపోయాడు. నేను చెప్పిన టానిక్స్ ఇస్తున్నావా? అదీగాక....

కమల:—(నవ్వి) నాన్నగారూ! ఆ టానిక్స్, మందులు, ప్రస్తావన లేకుండా ఎప్పుడైనా మాట్లాడగలరా? బాబు ఆరోగ్యంగా వున్నాడు. ఏ మందులూ అక్కర్లేదు.

కేశ:—అమ్మాయ్! వైద్యంలోమటుకు నామాట కాదంటే ఒప్పుకోను తెలిసిందా?

కమల:—(నవ్వుతూ) అలాగే నాన్నగారూ!

(రఘు ఉలికిపడినట్లయి లేచి కూర్చుంటాడు. కమల చటుక్కున దగ్గిరగా వస్తుంది.)

కమల:—ఏం కావాలండీ?

రఘు:—అడుగుల చప్పుడు వినబడితే వచ్చిందనుకున్నాను. రాలే దన్నమాట!

కేశ:—ఎవరు రఘూ!

రఘు:—ఎవరూ లేరు.

(కమల కళ్ళలో నీటితెరలు చూస్తారు కేశవరావుగారు.)

కేశ:—కమలా! నువ్వు....ఎందుకూ....

కమల:—(నోటిమీద చెయ్యివుంచి వారిస్తూ) ఇలారండి నాన్నగారూ!

(ప్రక్కగది. కమల అణచుకోలేక తండ్రి గుండెలమీద వాలి ఏడుస్తుంది)

కేశ:—కమలా! ఏమిటిది? ఏడవకు! నేను చెప్తున్నానుగా! అతనికి నయమవుతుంది. త్వరలోనే నయమవుతుంది.

కమల:—(కళ్ళు తుడుచుకుని శాంతస్వరంలో) మీరు ట్రీట్ చెయ్యటం, నయం కాకపోవటం ఉంటుందా నాన్నగారూ!

కేశ:—(గర్వంతో) తెలుసు కదః మరి దిగులుపడకు.

కమల:—హాస్పిటల్‌లో వీణాధరి అనే నర్స్ ఉంది తెలుసుగా నాన్నగారూ!

కేశ:—తెలుసు. ఆవిడంటే చాలా కోపంగా వుంది నాకు....

కమల:—ఎందుకు?

కేశ:—ఎందుకేమిటి? నిష్కారణంగా మొన్న డ్యూటీకి రాలేదు. లీవ్ లెటరయినా పంపలేదు. నిన్న వచ్చింది. కాని, ఎక్కడో, ఏ లోకంలోనో ఉన్నట్లుగా వుంది. ఒక రోగి కియ్యవలసిన ఇంజక్షన్ మరో రోగి కియ్యబోయింది. సమయానికి నేను గమనించాను గనుక కానీ, లేకపోతే నిష్కారణంగా ఆ రోగి అవస్థ పడేవాడు. నర్స్ వృత్తిలో ఉండే వ్యక్తికి పరధ్యానం పనికిరాదు. రఘు రికమెండ్ చేసిన వ్యక్తి కనుక ఇంత దారుణమైన పొరపాటు సహించాను. మరొకరైతే....

కమల:—ఆవిడను ఇక్కడి కొకసారి రమ్మనండి........

కేశవ:—ఆవిడనా? ఎందుకు? పాపం! రఘును ఒక్కదానివే కనిపెట్టి ఉండలేక పోతున్నావా? అవును చాలా శ్రమ!

కమల:—ఆయన దగ్గిర ఉండటం నాకు శ్రమా నాన్నగారూ!

కేశవ:—కాదు! కాదు! శ్రమ కాదు. కానీ, నర్స్ దేనికి? సరే! మరో మంచి నర్స్‌ను పంపుతాను. వీణాధరిని పంపను.



కమల?—మరో నర్స్ ఎందుకు నాన్నగారూ!

కేశ:—రఘుకు........

కమల:—ఆయన దగ్గిరకి మరొకరిని రానియ్యను. నేనే ఉంటాను.

కేశవ:—అయితే, వీణాధరి దేనికి?

కమల:—ఆయన ఎదురు చూస్తున్నది, కలవరిస్తున్నది, ఆవిడ కోసం........అందుకని........

కేశవ:—వాట్? వాళ్ళు బంధువులా? కాదే!

కమల:—చెప్పుకోతగిన బంధుత్వం లేదు నాన్నగారూ!

కేశవ:—అంటే?....రఘు....? నేను నమ్మను! రఘు చాలా మంచివాడు కమలా. నా కంతా గందరగోళంగా వుంది. నాకు అరమయ్యేలా చెప్పు.

కమల:—చెప్పలేను నాన్నగారూ! ఇది ఎవరికీ అర్థంకాదు.

కేశవ:—నాకు అర్థమయింది. ఇప్పుడే ఆ రాక్షసిని మెడపట్టి బయటకు గెంటుతాను, సర్వనాశనం చేస్తాను.

కమల:—నేను కోరింది అది కాదు నాన్నగారూ! ఆవిడను ఇక్కడికి తీసుకురమ్మని........

కేశ.:—నీకు మతిపోయిందా కమలా? నువ్వే భర్త దగ్గిరకి ఎవరినో స్వయంగా తీసుకుకొస్తానంటున్నావా? ఈ సిల్లీపాతివ్రత్యపు సెంటిమెంటంటే నాకు వొళ్ళు మంట!

కమల:—నేను అంత పతివ్రతను కాను నాన్నగారూ! నా సంసారంలోకి మరో స్త్రీ నీడ కూడా పడనియ్యను.

కేశవ:—ఏమిటిది మరి? దానిని తీసుకు రమ్మంటున్నావుగా!

కమల:—నా సంసారంలోకి కాదు. ఆయన వ్యాధి ముదరకుండా నయం కావటానికి....నా పసుపు కుంకుమ నిలవటానికి! నా బిడ్డ తండ్రి సంరక్షణలో చక్కగా పెరగటానికి........

కేశ—నాన్సెన్స్! నీకు చాదస్తం ఎక్కువవుతోంది. ఆవిడ రాకపోతే రఘు జ్వరం వారం రోజుల్లో నయం కాకపోతే అడుగు

ఇప్పుడే పోయి ఆ ఛండాలినిని ఈ ప్రాంతాలలో లేకుండా వెళ్ళ గొడతాను....

కమల ;—నాన్నగారూ !

(కేశవరావు కోపంగా వెళ్ళిపోతాడు.)

*  *  *

(వీణాధరి యిల్లు.)

వీణా:—రండి ! కూర్చోండి !

కేశవ :—నువ్వు రాక్షసివి. పిశాచివి. దుర్మార్గురాలివి. పాతకురాలివి, నువ్వు....నువ్వు....చాలా చెడ్డదానివి.

వీణా:—(చిరునవ్వుతో) చాలా హాయిగా వుంది. ఇలా వినటానికి ! కాఫీ తెస్తాను. త్రాగుతూంటే మరో యిన్ని తిట్లు గుర్తొస్తాయి.

(వీణాధరి కాఫీ తెస్తుంది. ఒక్క గ్రుక్కలో తాగేస్తాడు కేశవ రావు)

కేశ:—నువ్వు మా కమల సంసారం నాశనం చేస్తున్నావు.

వీణా:—చెయ్యలేదు, తలచుకుంటే చెయ్యగలను.

కేశ :—ఎంత సిగ్గులేదూ ?

వీణా:—సిగ్గెందుకు? అందులో మీ ముందు....

కేశ:—(సిగ్గుపడి తేరుకుని) జాగ్రత్తగా మాట్లాడు.

వీణా:—మాట్లాడాలని వచ్చింది మీరు ! ఆ జాగ్రత్త ఏదో మీరు తీసుకుని త్వరగా మాట్లాడెయ్యండి ?

కేశ :—నువ్వు....మా రఘును....ఎలా ప్రేమించావు ! అతడు మా కమల భర్త.

వీణా:—నేను అంతకు ముందే ప్రేమించాను.

కేశ:—ఇప్పుడు మానెయ్యాలి!

వీణా:—అది నా చేతుల్లో లేదు.

కేశ:—నా చేతుల్లో చాలా ఉంది. నిన్ను ఏంచేస్తానో తెలుసా?....

వీణా:—ఏమైనా చెయ్యండి. నాకు దేవికీ భయంలేదు.

కేశ:—వీణాధరీ ! ఎంత క్రూరురాలివి నువ్వు? పాపం! కమల రాత్రింబగళ్ళు రఘుకు సేవలుచేస్తూ చిక్కి శల్యమయింది. నువ్వు దర్జాగా రఘును ప్రేమిస్తున్నా నంటున్నావు.

వీణా:—అంటాను, మీ కమల ప్రేమ కంటె నా ప్రేమ తక్కువది కాదని కూడా అంటాను. కమల అదృష్టవంతురాలు. రఘు ప్రక్కన రాత్రింబగళ్ళు ఉండగలుగుతోంది. అలా ఉండ లేక, రఘుకు సేవచెయ్యాలని ప్రాణం కొట్టుకుపోతున్నా చెయ్యలేక, కనీసం చూడటానికయినా నోచుకోక....నేను మనసులో క్షోభించి....క్షోభించి....అబ్బా !....

(వీణాధరి పడిపోతుంది. కేశవరావుగారు ఆత్రుతతో వంగి చూస్తారు)

కేశ:—అరె? ఏంజరిగింది? హార్ట్ ఎటాక్! విపరీతమయిన మానసి కాందోళన వల్ల కానీ రాదు. అంటే?....పాపం ఈవిడ....

(చటక్కున వీణాధరిని తన చేతులలో ఎత్తుకుని కారులో హాస్పి టల్‌కు తీసుకెళ్తాడు)

*  *  *

(రఘు ఇల్లు)

కమల:—ఆవిడను తీసుకొచ్చారా నాన్నగారూ !

కేశ:—లేదమ్మా ! రఘునే అక్కడకు తీసికెళ్ళాలి !

కమల:—నాన్నగారూ! ఈ స్థితిలో ఆయనను కదుపుతారా? ఎందుకు ?

కేశ :—వీణాధరికి హార్ట్ ఎటాక్ వచ్చింది, హాస్పిటల్‌లో ఉంది. విపరీతమైన మానసికాందోళన వల్ల కాని ఆ ఎటాక్ రాదు. దానికి కావలసిందల్లా మానసికమైన విశ్రాంతి. ఎలాటి ఆందోళనలూ కలిగించకూడదు. లేకపోతే కోలుకోరు....

కమల:—(దిగ్భ్రాంతితో) నాన్నగారూ! మీరు ఆవిడకోసం బాధ పడుతున్నారా?

కేశ:—నా ట్రీట్‌మెంట్‌లో ఉన్న రోగికోసం బాధ పడుతున్నాను. కమలా! ఇంతవరకు మానవుడు ఎన్నెన్నో సాధించాడు. కానీ, ఒక్కసారైనా పోయిన ప్రాణాలు తేగలిగాడా? నేను డాక్టర్ని కమలా. నాకు అన్నింటికంటె రోగి ప్రాణాలు కాపాడటం ముఖ్యం. ఒక్కసారి రఘును ఆవిడ దగ్గిరకు తీసికెళ్తాను.

కమల:—వీల్లేదు ఆయనను కదలనియ్యను.

కేశ:—కమలా! ప్లీజ్! తండ్రిగా కాక డాక్టర్‌గా అడుగుతున్నాను.

కమల:—నాన్నగారూ! మీరే నన్నిలా హింసపెట్టడం న్యాయమేనా? ఎవరికోసమో అనారోగ్యంతో ఉన్న నా భర్తను శ్రమపెట్ట మంటారా?

కేశ:—కమలా! రఘుకు టైఫాయిడ్! తప్పకుండా కొంచెంరోజుల్లో కోలుకుంటాడు. ఇప్పుడు రఘు కనబడకపోతే ఆవిడ బ్రతకదు!

కమల:—పోనీయండి!

కేశ:—అలా వీల్లేదు కమలా! నేను కాపాడగలిగినంతవరకు నా చేతుల్లోంచి ఒక ప్రాణం పోవటానికి వీల్లేదు. కమలా! రఘును తీసికెళ్తాను.

కమల:—(ఏడుస్తూ) ఆయన ప్రేమకు నోచుకోకపోయినా, ఆయన ఇల్లాలిని. అందచందాలకు నోచుకోకపోయినా ఆత్మాభిమానమున్న ఆడదానిని. కనీసం నా అభిమానాన్ని కాపాడండి. ఈ విషయం మీకు తెలిసినట్లు ఆయనకు తెలియనీయకండి.

కేశ:—(అప్యాయంగా కమల తలనిమురుతూ) అయామ్ సారీ కమలా! వెరీవెరీసారీ.

(రఘు గది)

కేశ:—రఘూ! ఒక్కసారి నువ్వు హాస్పిటల్‌కు రావాలి!

రఘు:—ఎందుకు?

కేశ:—వీణాధరిని చూడటానికి....

రఘు:—(ఆరటంతో) ఏం? వీణాధరి కేమయింది?

కేశ:—హార్ట్ ఎటాక్ వచ్చింది. నేను నడిపిస్తాను. రా! నెమ్మదిగా నడిచి కారులో కూర్చుందువు గాని....

రఘు:—పదండి! (చటుక్కునలేచి అంతలో వెనక్కు వాలి పోతాడు)

కేశ:—ఏం రఘూ? లేవలేకపోతున్నావా? నీరసంగా ఉందా?

రఘు:—నేను రాలేను.

కేశ:—వీల్ చైర్ తెప్పించనా!

రఘు:—అక్కర్లేదు. నడవగలను. అందుకు కాదు. ఈస్థితిలో నేను వీణాధరిని చూడటానికి వెళ్తే కమల భరించలేదు. కమల నంత క్షోభ పెట్టలేను.

కేశ:—కానీ, వీణాధరికి హార్ట్ ఎటాక్....

రఘు:—ఏంచేయ్యను నేను? కమల మనసు క్షోభపడితే....ఏదైనా అఘాయిత్యం తలపెడితే....బాబు గతేం కావాలి?

కేశ:—కమలకు తెలియనివ్వను. స్పెషల్ ట్రీట్‌మెంట్‌కోసం నిన్ను హాస్పిటల్‌కు తీసికెళ్తున్నానని చెప్తాను.

రఘు:—థేంక్యూ! (ఉత్సాహంగా లేవబోయి, అంతలో మావగారి ముఖంచూసి లజ్జపడతాడు.) నన్ను క్షమించండి. కమల కే అన్యాయమూ చెయ్యలేదు. కాని....

కేశ:—అవన్నీ తరువాత! పద....

* * *

(హాస్పిటల్.)

రఘు:—వీణా!

వీణా:—రఘూ! నువ్వు....నువ్వేనా! ఎన్నోసార్లు ఇలాగే నా కల లోకి వచ్చి అంతలో మాయమయిపోయావు. ఒక్క క్షణం. నా కళ్లముందు నిలు రఘూ!

రఘు:—ఎక్కడికీ వెళ్ళను వీణా! నీ కళ్ళముందే వుంటాను.

వీణా:—ఉండాలనుకుంటావు. కానీ ఉండలేవు. ఎవరెవరు యెక్క డెక్కడ యెంతకాలం తిరిగినా, యెవరింటికి వాళ్ళు వెళ్ళక తప్పదు. నేను వెళ్తాను, నా యింటికి....


(వీణాధరి మాట్లాడలేక పోతుంది. ఊపిరి అందటం కష్టమవుతుంది.)

రఘు:—వీణా!

కేశ:—రఘూ! డాక్టర్ ఏ పరిస్థితుల్లోనూ తను డాక్టర్‌నని మరువ కూడదు. ప్రేకిట్ యిాజీ!

(వీణాధరిని పరీక్షచేస్తూ వుంటాడు. చాలాసేపటికి కళ్లు తెరుస్తుంది వీణాధరి.)

రఘు:—నిష్కారణంగా నిన్ను నువ్వే చిత్రహింస పెట్టుకుంటు




న్నావు వీణాధరీ! నీ మనసులో ఎందుకింత క్షోభ పడుతున్నావో అర్థం కాదు. నీ మానసికాందోళన తగ్గితే కాని, నువ్వు కోలుకోలేవు.

(పేలవంగా నవ్వుతుంది వీణాధరి.)

వీణా:—కుసుమ పెళ్ళి అయ్యేవరకు బ్రతికించు చాలు!

(వీణాధరి చేతిని తనచేతిలోకి తీసుకుని గట్టిగా పట్టుకుంటాడు రఘు. జాలిగా చూస్తుంది వీణాధరి.)

* * *

## 9

(హాస్పిటల్. నలుగురు వ్యక్తులు వస్తారు.)

ఒకవ్యక్తి:—మేము స్వచ్ఛంద సేవాసంఘ సభ్యులం. మీ సహకారం కోరివచ్చాము.

రఘు:—కూర్చోండి. ఏం కావాలి?

వ్యక్తి:—ఇటీవల మనదేశం రోజురోజుకీ ఎంత అధ్వాన్నపు దశ లోకి దిగజారుతోందో మీరూ గమనిస్తున్నారుగా! ఉద్యోగాలు లేవు. దారిద్ర్యం విలయతాండవం చేస్తోంది. నీతి నియమాలు సడలిపోతున్నాయి. స్వార్థం బుసలు కొడుతోంది. ఆకలి, నిరాశ, నిస్పృహ, యెటుచూసినా ప్రత్యక్షమవుతున్నాయి. ఇవి చాల వన్నట్లు ప్రకృతికూడా తన ప్రతాపం చూపిస్తోంది. విపరీతమైన ఎండలు! విపరీతమైన వానలు! విపరీతమైన చలి! పట్టణాలలో రాజవీధులలో మేడలు! ఆ ప్రక్కన ఇరుకు సందులలో పూరి గుడిసెలు. ఇటీవలి అతివృష్టి కారణంగా ఆ జనం యెంత నష్ట పోయిందీ మీకు వివరించ నక్కర్లేదుగా? ఇది చాలక ఆ ప్రాంతాలలో యిప్పుడు ఫ్లూ వ్యాపించింది. ఈ ఫ్లూ ఇదివరకులా మూడు రోజులతో పోవటం లేదు. వారం పైగా మనుష్యులను పీల్చి పిప్పిచేస్తోంది. ఎటుచూసినా రోగులు! మేం చెయ్యగలిగింది మేం చేస్తున్నాం! డాక్టర్‌గా మిమ్మల్ని మాతో సహకరించి ఆ దౌర్భా

గ్యులను కనికరించవలసిందని ప్రార్థిస్తున్నాం!

రఘు:—తప్పకుండా నేను చెయ్యగలిగింది చేస్తాను. ఒక వంక మన దేశ దుస్థితికి ఆవేదన కలుగుతున్నా. మన దేశంలో మీలాటి యువతరం వేల్కొని కృషి చేస్తున్నందుకు గర్వంగా ఉంది. హాస్పిటల్‌లో నా డ్యూటీ సాయంత్రం మూడు గంటల వరకూ ఉంటుంది. ఆ తరవాత తప్పకుండా మీతో పని చేస్తాను.

వ్యక్తి :....థేంక్యూ సర్!

* * *

(గుడిసెల మధ్య)

రఘు:—వీణా! నువ్వు వచ్చావా?

వీణా:—ఇక్కడ డాక్టర్ అవసర మయినపుడు నర్స్ అవసరం కాదా?

రఘు:—ఇటీవలే హార్ట్ ఎటాక్ వచ్చి కోలుకున్నావు వీణా! నీకు శ్రమ పనికిరాదు.

వీణా:—నాకు కావలిసినది మానసిక విశ్రాంతి రఘూ! ఇక్కడే దొరుకుతుంది అది.

సభ్యుడు:—రండి డాక్టర్! ఇదిగో, ఈ యింట్లో నలుగురికీ ఫ్లూ వచ్చింది. నిన్న అతను ఫ్లూతోనే పనికి వెళ్ళాడు. ఆవిడ పసిబిడ్డతల్లి! పాపకూ తల్లికీ కూడా జ్వరమే! చేసేవాళ్ళు లేక, పనులు చేసుకోలేక అవస్థపడుతోంది?

రఘు:—పదండి! రా వీణా!

సభ్యుడు:—ఆవిడ పదోసారి కడుపుతో ఉంది. నడి వయసు....

రఘు:—ఏంచెయ్యటం? చదువుకున్న వాళ్ళలో చాలామంది ఈ రోజుల్లో కుటుంబనియంత్రణ అమలు జరుపుతూనే ఉన్నారు. ప్రధానంగా కుటుంబనియంత్రణ అమలు జరుపవలసిన కూలి జనం మాత్రం అమలు జరపటంలేదు. వాళ్ళకు అర్ధమయ్యేలా మనం చెప్పలేక పోతున్నాం.

సభ్యు:—తరతరాలుగా పేరుకు పోయిన మూర్ఖత్వం కరిగించటం మాటలా డాక్టర్? సహనం పీడకుండా ప్రయత్నించాలి మనం.

* * *

(గుడిసెల మధ్య రాత్రి సమయం)

రఘు:—వీణా! నువ్వు....ఇంత రాత్రివేళ.

వీణా:—నువ్విక్కడ పని చేస్తోంటే నేను ఇంట్లో ఉండగలనా?

రఘు:—కానీ, రాత్రివేళ ఒక్కదానివీ ఎలా రాగలిగావ్! వీళ్ళంతా తెగ త్రాగుతారు. త్రాగుడు మైకంలో తమను తాము మరిచి పోతారు. ఏదైనా ప్రమాదం జరిగితే....

వీణా:—ఏమో రఘూ? నీ మాట కాదనలేక వెళ్ళాను. పడుకోడానికి ప్రయత్నించాను. నిద్ర పట్టలేదు. ఇక్కడ ఒక రోగికి సీరియస్‌గా ఉందనీ, నువ్వు అతడి కోసం ఇక్కడే ఉంటావనీ గుర్తుకొచ్చింది. వెంటనే లేచి వచ్చేసాను. దూరం కనబడలేదు. భయం తోచలేదు.

రఘు:—డాక్టర్‌గా చెపుతున్నాను. నీ కింత శ్రమ పనికిరాదు.

వీణా:—ఆడదాన్నిగా చెపుతున్నాను. ఇప్పుడున్నంత హాయిగా ఎప్పుడూ లేను

(రోగుల మూలుగులు. రఘు రోగులను పరీక్షించి మందు లిస్తుండగా వీణాధరి వాళ్ళకు సేవచేస్తూ ఉంటుంది.)

సభ్యుడు:—డాక్టర్! ఆ గుడిసెలో రోగి చచ్చిపోయాడు.

రఘు:—అనుకున్నాను. పనికి వెళ్ళొద్దన్నాను. వెళ్ళాడు. తాగొద్దన్నాను. తాగాడు.

సభ్యుడు:—(దిగాలుగ)రెండూ మంచివి కావు డాక్టర్! కానీ, పాపం, వాళ్ళ చేతుల్లో ఏం ఉందీ? ఎలాటి స్థితిలోనూ పనికి వెళ్ళక గడవదు. దిగుళ్ళే తప్ప ఉల్లాసం ఎరగని మనసు కల్లు చుక్కలతో తప్ప ఊరట పొందలేదు. ఎంత కృషిచేస్తే పైకి రాగలదు. ఈ జాతి? కృషి లేకపోగా కృంగదీస్తున్నాం!

(రఘు నిట్టూరుస్తాడు.)

సభ్యు:—మీదెంత విశాల హృదయం డాక్టర్! రాత్రి ఒంటిగంట అయింది. మీరు వెళ్ళిరండి.

(రఘు వీణాధరితో కలిసి బయలుదేరతాడు కారులో....)

రఘు:—నామాట విను వీణా! రేపటినుండి రాకు.

వీణా:—ఏం రఘూ! నావల్ల నీకు ఇబ్బంది కలుగుతోందా?

రఘు:—ఇబ్బందా?....వీణా! ఒక మంచిపని చెయ్యాలనే ఉత్సాహం మనసుకున్నా శరీరానికి శక్తి చాలదు ఒక్కొక్కప్పుడు. ఇక్కడికి వీళ్ళకు వైద్యం చెయ్యాలని వచ్చినా, అలసటతో విసుగని పిస్తుంది, ఒక్కొక్కసారి నిన్ను చూడగానే నాలో విసుగు మాయమవుతోంది. ఏదో క్రొత్త ఉత్సాహం వస్తోంది. నువ్వు పక్కనుంటే ఎంతపనైనా చెయ్యగల ననిపిస్తోంది.

వీణా:—మరి, రావద్దంటావేం?

రఘు:—ఎందుకా? అన్నింటికంటె నీ ఆరోగ్యం ముఖ్యం నాకు!

వీణా:—పరవాలేదు రఘూ! నీ ప్రక్కన నిలబడగలిగితే పోయిన ప్రాణాలుకూడా వచ్చి నాశరీరాన్ని చేరుకుంటాయి. ఆపు! నీతో నా ప్రయాణం చివరి[illegible]కూ కాదు. మధ్యలో దిగిపోవాలి.

* * *

(రఘు ఇల్లు)

రఘు:—కమలా! ఇంకా నిద్రపోలేదా?

కమల:—మీరక్కడ అవస్థపడుతోంటే ఇక్కడ నిద్రపోగలనా? వేణ్ణీళ్ళు సిద్ధంగా ఉన్నాయి. స్నానం చెయ్యండి.

రఘు:—ఇంత రాత్రివేళ వేణ్ణీళ్ళు సిద్ధంగా ఉంచావా?

కమల:—అసలా గుడిసెల మధ్య వాతావరణమే అనారోగ్యం. దీనికి తోడు మీరు రోగుల మధ్యనుంచి వస్తున్నారు. స్నానం చేస్తారని

నాకు తెలియదూ?

రఘు; — తువ్వాలు ఇలా ఇచ్చి నువ్వు వెళ్ళు కమలా!

కమల:—అదేం? నేను వీపు రుద్దుతాను.

రఘు:—వద్దు. నేను రోగుల దగ్గిరనుండి వస్తున్నాను.

కమల :—అయితే?....నాకు అంటుకుంటుందనా? నేను మీలో ఒక భాగాన్ని. మీరు జబ్బుపడితే శారీరకంగా ఆరోగ్యంగా ఉన్నా, నేనూ జబ్బు పడినట్లే! అంచేత మీ ఆరోగ్యం ముఖ్యం. నన్ను గురించి బెంగపెట్టుకోకండి అర్థమయిందా?

(అల్లరిగా నవ్వి తువ్వాలు భుజంమీద వేసుకుంటుంది. రఘు నవ్వుతాడు)

*   *   *

(వీణాధరి ఇల్లు)

రఘు :—వీణా! ఇవాళ ఆ స్వచ్ఛంద సేవాసమాజం వాళ్ళు వచ్చి నన్ను చాలా పొగిడారు. అక్కడ వాళ్ళందరి రోగాలూ చాలా వరకు తగ్గిపోయినట్లే! ఆ పొగడ్తలలో సగం నీకు!

వీణా :—వాళ్ళ పొగడ్తలు నా కక్కర్లేదు. నువ్వు పొగుడు. చాలు!

రఘు:—వీణా! వాళ్ళు నాకు ఒక కృష్ణ విగ్రహం బహూకరిస్తా మంటున్నారు. ఎంత వద్దన్నా వినటం లేదు. వాళ్ళకు నా మీది గౌరవాన్ని ప్రకటించడానికి ఇస్తారుట! తీసుకోక తప్పదని బలవంత పెడుతున్నారు.

వీణా :—ఎంత చక్కని ఆలోచన! కృష్ణ విగ్రహం బహూకరిస్తున్నారా? నాకు శ్రీ కృష్ణు డంటే చాలా ఇష్టం!

రఘు:—అయితే, ఆ కృష్ణ విగ్రహం నేను నీకు బహూకరిస్తాను. న్యాయానికి నువ్వూ నాతో సమంగా శ్రమపడ్డావు.

వీణా:—ఇయ్యి! నా శ్రమకు ప్రతిఫలంగా కాదు. నీతో కలిపి గడిపిన క్షణాల స్మృతిచిహ్నంగా పూజించుకుంటాను దాన్ని....

*   *   *

(సమావేశం. రఘు, కమల వేదికపైన కుర్చీలలో ప్రక్క ప్రక్కల కూర్చుంటారు. వీణాధరి వెనుక ఎక్కడో నలుగురితో ఉంటుంది)

సభ్యుడు:—డాక్టర్ రఘురామ్‌గారు మా ప్రార్థన మన్నించి మాతో సహకరించినందుకు మేం చాలా కృతజ్ఞులం. పురుషుని ప్రతిభ రాణించేది ప్రధానంగా ఇల్లాలి సహకారంతో! శ్రీమతి కమలా రఘురామ్‌గారికి మా కృతజ్ఞతలు. ఈ దంపతులపట్ల మాకు గల భక్తి గౌరవాలకు చిహ్నంగా ఈ వెండి కృష్ణ విగ్రహాన్ని అర్పించుకుంటున్నాం.

(కరతాళ ధ్వనుల మధ్య కృష్ణ విగ్రహాన్ని రఘురామ్‌కు అందిస్తారు. అతని చేతులలో నుండి కమల అందుకుని గర్వంగా చూస్తుంది దాన్ని)

*   *   *




(రఘు ఇల్లు)

కమల:—ఏవండీ! పూజామందిరంలోకి రండి. మన కృష్ణ విగ్రహానికి ఎంత చక్కని మండపాన్ని తయారు చేసానో, ఎలా అలంకరించానో, చూద్దురుగాని....

రఘు:—కమలా! ఆ కృష్ణవిగ్రహం....

కమల:—నా నగలన్నింటిలో విలువైనది. నా భర్త కీర్తి ప్రతిష్ఠలకు చిహ్నం, నాకు గర్వకారణం. ఆ విగ్రహాన్ని చూసినప్పుడల్లా గృహిణిగా నాజన్మ సార్థకమయిందని పొంగి పోతున్నాను.

*   *   *

(వీణాధరి ఇల్లు)

వీణా:—రఘూ! ఏదీ. ఆ కృష్ణ విగ్రహం తెచ్చావా? వేదికమీద నిన్నూ కమలను, ప్రక్క ప్రక్కల చూసి కమల అదృష్టానికి ఈర్ష్య పడ్డాను. అయినా అసలైన స్మృతిచిహ్నం నువ్వు నాకే ఇయ్యబోతున్నావని నన్ను నేను ఓదార్చుకున్నాను.

రఘు:—క్షమించు వీణా! ఆ విగ్రహం తేలేదు.

వీణా:—నాకిస్తానని మాట ఇచ్చావు.

రఘు:—నీకే అది బహూకరిస్తా రనుకున్నాను. అందుకని మాట ఇచ్చాను. కానీ. వాళ్లు మా దంపతులకు బహూకరించారు ఆ విగ్రహం. నా చేతులలో ఏముంది? నన్ను క్షమించలేవా?

వీణా:—క్షమించడానికి నీతప్పేం ఉంది? సార్వజనీనమూ, సార్వకాలికమూ అయిన సామాజిక సత్యంముందు మానవుడు నిస్సహాయంగా తలవంచక తప్పదు.

*   *   *

(రఘు ఇల్లు)

గోపా:—రఘూ! చిట్టికి నచ్చజెప్పగలిగావా?

రఘు:—నేనేం చెయ్యలేక పోతున్నాను. అన్నయ్యా! ఎంత చెప్పినా వాడికి అర్థం కావటంలేదు.

గోపా:—వాడికి చిన్నతనంలో ఫిట్స్ వచ్చేవి. నీకు తెలుసుగా! ఇటీవల మరీ తీవ్రంగా వచ్చాయి. అందుకే వాడిని కఠినంగా మందలించలేక పోతున్నాను. ఆ కారణంగా వాడు మరీ పాడయిపోయాడు.

రఘు:—వాడిని హాస్పిటల్‌లో జాయిన్ చేయించి పరీక్ష చేయిస్తే మంచిది అన్నయ్యా! ఇలా అశ్రద్ధ చెయ్యకూడదు.

సుంద: హమ్మ నాయనోయ్! ఎంతమాత్రం వద్దు. ఆరోగ్యంగా ఉన్నాడు బిడ్డ. తిని కూచుని ఆ దిక్కుమాలిన హాస్పిటల్‌లో చేర్పించకండి.

రఘు:—ప్రస్తుతం ఆరోగ్యంగా ఉన్నా మళ్ళీ ఫిట్స్ రావచ్చు వదినా!

సుంద:—అంతగా వస్తే అప్పుడు చూసుకుందాం! పోనీ లే, వీణాధరికి చెప్పి చూడకూడదయ్యా!

రఘు:—చెప్పాను వదినా! ఆవిడా వినిపించుకోలేదు.

సుంద:—నువ్వు వేయించిన ఉద్యోగమేగా! ఉద్యోగంలోంచి వెళ్ళగొడ్తానని బెదిరించు.

రఘు:—అలాటి బెదిరింపులకు లొంగదు.

సుంద:—అయితే ఉద్యోగం ఊడపీకి పంపెయ్యి.

రఘు:—నేనాపని చెయ్యలేను.

(అక్కడినుంచి వెళ్ళిపోతాడు.)

సుంద:—ఏమిటి?....ఏమిటేమిటి?

(బుగ్గలు నొక్కుకుంటుంది.)

* * *

(మరోగది)

కమల:—చిట్టిని దగ్గిరకు రానీయవద్దని మీరు వీణాధరికి చెప్పారా?

రఘు: చెప్పాను. కానీ, వినలేదు.

కమల: మీరిద్దరూ ఒకప్పుడు పెళ్ళి చేసుకోవాలనుకున్నారు. కదూ!

రఘు:—అవును.

కమల:—అయినా ఆవిడ డబ్బుకోసం వాసుదేవరావుగారిని చేసుకుంది.

రఘు:—తన కుటుంబంకోసం....

కమల:—ఇప్పుడు చిట్టిని తనచుట్టూ తిప్పుకుంటోంది.

రఘు:—.........

కమల:—ఇప్పటికీ మీరు ఆవిడని గౌరవిస్తునే ఉన్నారు.

రఘు:—ఎప్పటికీ గౌరవిస్తాను.

కమల:—అయితే నీతి నియమాలకు విలువ ఏమీ లేదా?

రఘు:—ఉంది. పిరికితనంకంటే అవినీతి మరొకటిలేదు. మనసులో ఒకటి దాచుకుని మరొక విధంగా జీవించవలసి రావటం నరకం. అంతకంటే ఎలాంటి పరిణామాలనైనా ఎదుర్కొని మనసులోది నిర్భయంగా బయట పెట్టడమే నీతి. దీనివల్ల అవహేళనలకు గురికావచ్చు. సమాజానికి వెలికావచ్చు. కానీ, ఆత్మ సంతృప్తి లభిస్తుంది. కమలా! నేను........

కమల:—ఆగండి! మీ జీవితం మీ ఒక్కరిదీ కాదు. అది నాతో, బాబుతో, పెనవేసుకు పోయింది. ఈ ఆత్మ సంతృప్తికోసం మరొకరి ఆత్మకు క్షోభ కలిగించటం మీకు న్యాయం కాదు. మీ మనసులో ఏయే భావాలు మీ కెంత క్షోభ కలిగించినా, అవి బయటపెట్టే అధికారం మీకు లేదు.

రఘు:—(బాధగా) కమలా!

కమల:—(తన మాంగల్యాలను చూపిస్తూ) వేదకాలం నుండి ఈ నాటివరకు ఏ సంస్థ మానవుల సమస్త సంస్కారానికి వెన్నెముకగా నిలిచిందో, దానిని మీరిపుడు రూపు మాపలేరు.

* * *

(వీణాధరి యిల్లు)

సుంద:—ఇదిగో వీణాధరీ! నీ కెంత డబ్బు కావాలంటే అంత డబ్బిస్తాను. మా చిట్టిని వదిలెయ్యి.

వీణా:—మీకు కావలసిన డబ్బు నేనే యిస్తాను. మీ చిట్టిని నా దగ్గిరకు రాకుండా చెయ్యండి.

సుంద:—(నిర్ఘాంతపోయి) నేనేం చెయ్యగలను? ఎన్ని విధాల చెప్పినా నా మాట వినటం లేదు. (కన్నీళ్ళతో) ఒక్కడే కొడుకు. వాడిని వదిలిపెట్టు........

వీణా:—నా మాట మాత్రం వింటాడా?

సుంద:—నీ మాట ఎవరైనా వింటారు. జబ్బు పడ్డావని విని ఎంత పాడవుతావో అనుకున్నాను. మరింత అందంగా తయారయ్యావు.

(పకపక నవ్వుతుంది వీణాధరి.)

సుంద:—ఎందుకు నవ్వుతావు? నన్ను చూస్తే అంత వేళాకోళంగా ఉందా? చిన్నతనంలోనే పాడు వళ్ళొచ్చింది........

వీణా:—మిమ్మల్ని చూసి కాదు. మీరు చాలా చిన్న పిల్లలా ఉన్నారు.

సుంద:—నిజంగా! నాకు నిజం చెప్పేవాళ్ళంటే చాలా యిష్టం. కానీ నువ్వు మా చిట్టిని........

వీణా:—మీరు నిశ్చింతగా ఉండండి. మీ అబ్బాయిని నేను పెళ్ళి చేసుకోను.

సుంద:—ఆ! ఎంత మంచిదానివి నువ్వు?

వీణా:—(నవ్వి) మంచి! నిజం? వెళ్ళిరండి!

## 10

(కుసుమ మేడ)

కృష్ణ:—మనం స్థాపించబోయే ఆశ్రమంలో సంగీతం, చిత్రలేఖనం, శిల్పం, నాట్యం, అన్నీ ప్రవేశపెడదాము. సంగీతానికి ప్రఖ్యాత విద్వాంసులు శంకరశాస్త్రిగారినీ, చిత్రలేఖనానికి

దీక్షితులుగారినీ, నాట్యానికి గౌరీశంకర్‌నూ, శిల్పానికి శర్మగారినీ ఆచార్యులుగా నియమిద్దాం..... ఇంకా వింటున్నావా ....''

కుసుమ :—ఆ! వింటున్నాను.

కృష్ణ :—నీకు అభ్యంతరం లేనట్లేగా.

కుసుమ :—దేనికి అభ్యంతరం?

కృష్ణ :—ఏం విన్నావు మరి?

కుసుమ :—మీ కంఠాన్ని.... ఈ ప్రశాంత ప్రకృతిలో ఏదో దివ్య నాదంలా నా హృదయానికి సోకే మీ కంఠస్వరాన్ని వింటున్నాను. తలచినంత మాత్రాన తనువెల్లా పులకింపచేసే మీ సుందర మూర్తిని కంటున్నాను. మనసును మైమరపించే మధుర భావాలు చిందించే మీ కళ్ళలో నా భావికలలు అల్లుకుంటున్నాను.

కృష్ణ :—(నవ్వి) మరీ అల్లరిదానివై పోతున్నావు.

కుసుమ :—(గారాబంగా) నేను బుద్ధిమంతురాలిని. మీరు నన్ను పాడు చేసేసారు.

(ఇద్దరు నవ్వుకుంటారు.)

కృష్ణ :—అక్కయ్యకి హార్ట్ ఎటాక్ వచ్చి తగ్గిన తరువాత చాలా నీరసంగా ఉంది.

కుసుమ :—.... .... .... ....

కృష్ణ!—నర్స్ వృత్తి మానేసి విశ్రాంతి తీసుకోమన్నాను. వినటం లేదు.

కుసుమ:—మీకు పుణ్యం వుంటుంది. నా దగ్గిర ఆవిడ ప్రస్తావన తేకండి.

కృష్ణ:—మా అక్కయ్యను నువ్వు అంతగా అసహ్యించుకుంటు న్నావా కుసుమా?

కుసుమ:—మీ అక్కయ్యను కాదు. నా బ్రతుకూ, మా నాన్నగారి బ్రతుకూ నాశనంచేసిన బ్రహ్మరాక్షసిని అసహ్యించుకోకుండా ఉండలేను.


కృష్ణ:—నీ బ్రతుకు నాశనమయిందా? అందుకే నాలాటి బీదవాడిని చేసుకోవాలనుకుంటున్నావా?

కుసుమ:—కాదు! కాదు! నన్ను అలా అపార్థం చేసుకోకండి. అలాటి అక్కకు యిలాటి తమ్ముడెలా వున్నాడా అని యెంత గానో ఆశ్చర్యపోతూ వుంటాను. మిమ్మల్ని వదలి నేను బ్రతక లేను. మీ అక్కయ్యకూ, మీకూ పోలిక లేదు.

కృష్ణ!—అవును. అక్కయ్యకూ, నాకూ పోలిక లేదు. ఆవిడ దేవత. నేను మామూలు మనిషిని.

కుసుమ:—ఆవిడ దేవత కాదు. పిశాచి....

కృష్ణ:—స్వార్థపిశాచి ఆవహించింది నన్ను! పై చదువులకోసం పాకులాడకుండా ఆనాడే అక్కయ్యను ఆదుకొనివుంటే, యిన్ని అనర్థాలు జరిగేవి కావు. మా అందరికోసం అక్కయ్య తన బ్రతుకు నాశనం చేసుకుంది.




కుసుమ:—నాశనమయింది ఎవరు? మా నాన్నగారు! కుమిలుతున్నది ఎవరు? నేను!

కృష్ణ:—విధి అలా వుంది?

కుసుమ:—విధి... ప్లీజ్! కృష్ణా! ఇంకొక్కసారి మీ అక్కయ్య ప్రస్తావన తేకండి. మరేదైనా భరించగలను,

కృష్ణ:—మా అక్కయ్యను నువ్వు అర్థం చేసుకోలేకపోతున్నావు కుసుమా! ఆవిడకోసమే నేను....

(ఆగిపోతాడు, అయోమయంగా చూస్తుంది కుసుమ)

కృష్ణ:—కుసుమా! ఒక్క వాగ్దానమియ్యి. నా యెదురుగా అక్కయ్యను నిందించకు.

కుసుమ:—మీరు నాకు ఒక్క వాగ్దానమియ్యండి. నా ఎదురుగా ఆవిడ ప్రస్తావన తేకండి....

కృష్ణ:—కానీ, ఆవిడ రాకుండా మన పెళ్ళి యెలా జరుగుతుంది?

కుసుమ:—(ఆవేశంతో వణుకుతూ) నా పెళ్ళికి ఆవిడ వచ్చి ఆశీర్వ దిస్తుందా? నేను సర్వనాశనం కావాలని అక్షింతలు జల్లుతుందా?

కృష్ణ:—తనను తను నాశనం చేసుకోవటమే తప్ప మరొకరి నాశనం కోరటం ఆవిడకు తెలియదు కుసుమా! తన చల్లని చేత్తో ఆవిడ నీకు అక్షింతలు వేస్తే అవి నీకు శ్రీరామరక్ష లవుతాయి.

కుసుమ:—అక్కర్లేదు. నా జీవితంలో అత్యంత ఆనందదాయక మైన రోజున ఆవిడ ముఖం చూడలేను. నా పెళ్ళికి ఆవిడ రానక్కర్లేదు.

కృష్ణ:—నీ యిష్టం! నా పెళ్లి ఆవిడ రాకుండా జరగదు!


కుసుమ:—కృష్ణా!

కృష్ణ!—క్షమించు కుసుమా!

* * *

(వీణాధరి ఇల్లు)

వీణా:—నువ్వు తొందరపడ్డావు కృష్ణా! కుసుమ అమాయకురాలు....



కృష్ణ:—కుసుమకు నీ మీద ఎంత ద్వేషమో తెలిస్తే....

వీణా:—తెలుసు ?

కృష్ణ :—తెలిసినా కుసుమ నింతగా అభిమానిస్తున్నావా ?

వీణా :—కుసుమ తప్పేమీ లేదు కృష్ణా! కుసుమ నన్ను ద్వేషించటం సహజం. ప్రేమించటమే తప్ప ద్వేషించటం తెలియని మధురమూర్తి కుసుమ.

కృష్ణ:—నీ ప్రస్తావన వస్తే చాలు! ఆ మధురమూర్తి హాలాహలం కురిపిస్తుంది.

వీణా :—అది నా దౌర్భాగ్యం. కష్ణా! నా ప్రార్థన మన్నించి కుసుమను చేసుకోవటానికి సిద్ధపడ్డావు. ఇప్పుడీ చిన్న కారణానికి కుసుమను వదిలెయ్యకు.

కృష్ణ:—చిన్న కారణమా! కుసుమ నీ నీడనుకూడా సహించ లేదు. కుసుమను చేసుకుంటే మనకు పూర్తిగా తెగతెంపు లయి పోయినట్లే!

వీణా :—అవనీయి!

కృష్ణ :—అక్కయ్యా ?

వీణా :—నీ కర్థంకాదు కృష్ణా! ఏదైనా సహిస్తాను. ఎంతకైనా తెగిస్తాను. కుసుమ లక్షణంగా పెళ్ళి చేసుకుని సంసారంలో స్థిరపడేవరకూ నాకు స్థిమితం లేదు.

కృష్ణ :—నీలో నువ్వు ఎందు కింత క్షోభపడుతున్నావుఅక్కయ్యా! నాకు చెప్పకూడదా ?

వీణా :—చెప్పలేను కృష్ణా! ఇప్పట్లో చెప్పలేను. నువ్వెళ్ళు....

(కృష్ణ వెళ్ళి పోతాడు. చిట్టి వస్తాడు)

వీణా :—రా చిట్టీ? నీ కోసమే ఎదురు చూస్తున్నాను.

చిట్టి :—ఎదురు చూస్తున్నావా ? ఎంతకాలం ఆగమని చెప్పటానికి ?

వీణా:—ఒక్క నెల....

చిట్టి :—నెలకాదు, సంవత్సరం ఆగుతాను.

వీణా :—నిజంగానా ?

చిట్టి :—సంవత్సరమైనా పడుతుంది. కుసుమ డబ్బు నా స్వాధీనం కావటానికి. ఆ తరువాత నిన్ను పెళ్ళి చేసుకుంటాను.

వీణా :—చిట్టీ! ఏమిటి వాగుతున్నావ్ ?

చిట్టి :—అర్థంకాలేదా ? ముందు కుసుమను పెళ్ళి చేసుకుంటాను. డబ్బు చేజిక్కించుకుంటాను. ఆ తరువాత కుసుమకు విడాకు లిచ్చి నిన్ను....

(వీణాధరి విరగబడి నవ్వుతుంది)

వీణా :—కుసుమ నిన్ను చేసుకోదు. జన్మలో నిన్ను నమ్మదు.

(చిట్టి వీణాధరి కంటె విరగబడి నవ్వుతాడు)

చిట్టి :—మామూలుగా నమ్మదు, కానీ, నువ్వూ కృష్ణా కలిసి నాటక మాడుతున్నారని చెపితే....నీ మాట మీదనే కృష్ణా కుసుమ దగ్గిరకు వచ్చాడని నమ్మిస్తే—కుసుమ నీకు డబ్బియ్యదు గనుక కృష్ణను ఎరగా వాడుకున్నావు. అంటే. అప్పుడు నమ్ముతుంది. ఆ తరువాత....

వీణా :—అబద్దం! పచ్చి అబద్ధం!

చిట్టి :—నా చెవులారా ఇప్పుడే విన్నాను. నీ నాటకం ఇప్పుడే అర్థమయింది. దుర్మార్గురాలా! చెప్పు! కృష్ణను కుసుమ దగ్గిరకి పంపించింది నువ్వేకదూ!

వీణా :—నేనే! కానీ కుసుమ డబ్బు కోసం కాదు కుసుమ సుఖ పడాలని. నాటకం ఆడిందీ నిజమే ? నీ దుర్మార్గాన్నుండి కుసుమను తప్పించటానికి తప్పనిసరిగా నాటకం ఆడాల్సి వచ్చింది.

చిట్టి :—ఇంక నాటకం ఆడక్కర్లేదు, మా పెళ్ళికి రావటానికి తయారుగా ఉండు....

(పోబోతాడు, వీణాధరి అడ్డుకుంటుంది)

వీణా :—నీచుడా! నీ స్వార్థంకోసం ఆ అమాయకురాలి బ్రతుకు నాశనం చెయ్యకు ?

చిట్టి :—ఎవరి స్వార్థం వాళ్ళు చూసుకోవాలి! చూసుకుంటూనే ఉన్నారు,

వీణా :—నిన్ను చంపుతాను. చస్తాను. కుసుమ బ్రతుకు నాశనం కానియ్యను. కానియ్యను....

(చిట్టి నిర్లక్ష్యంగా నవ్వి వీణాధరిని ప్రక్కకు తోసేసి వెళ్ళి పోబోతాడు)

వీణా :— (గట్టిగా) చిట్టీ!

చిట్టి :—(నిర్లక్ష్యంగా) ఏం ?

వీణా :—ఇలారా! వచ్చి కూచో! నీతో మాట్లాడతాను.

చిట్టి:—(కూచుని) లాభంలేదు వీణా! నువ్వు అద్భుత సౌందర్యవతివి. నిజమే! ప్రతి ఒక్కరినీ వెఱ్ఱెత్తించే నీ అందానికి నేను ఒకప్పుడు వెఱ్ఱెత్తి పోయాను. కానీ, నువ్వు ప్రేమిస్తున్నది రఘు బాబాయినని నాకు తెలిసి పోయింది,

వీణా:—కుసుమమీద నీకెందు కింత కక్ష? ఆ అమాయకురాలు నీకేం ద్రోహం చేసింది?

చిట్టి:—నాకు కుసుమమీద కక్ష దేనికి? నాకు డబ్బు కావాలి!

వీణా:—డబ్బు! ఆ పాపిష్టి డబ్బు....

చిట్టి:—కోసమే. నువ్వు వాసుదేవరావుగారిని చేసుకున్నా. నేను కుసుమను చేసుకున్నా....

వీణా:—డబ్బిస్తే. కుసుమ జోలికి రాకుండా ఉంటావా?

చిట్టి:—మహారాజులా! ఆ కుంటి దానితో బ్రతుకు ముడేసుకోవాలని నాకు ముచ్చట అనుకున్నావా? అయినా నీ దగ్గిరేముందీ? నువ్వేం ఇయ్యగలవు నాకు?

వీణా:—ఎంత కావాలి నీకు?

చిట్టి:—కుసుమ లక్షాధికారిణి. అందులో సగమైనా ఇయ్యగలవా?

వీణా:—యాభై వేలు! ఎక్కడ తేగలను?

చిట్టి:—ఎవరు తెమ్మన్నారు నిన్ను? వెళ్ళిరానా?

వీణా:—ఆగు! నీ మాటలు కుసుమ నమ్ముతుందని ఏమిటి? నమ్మినా, నిన్ను చేసుకుంటుందని ఏముందీ?

చిట్టి:—కుసుమ నిన్ను ఎంతగా ద్వేషిస్తోందో మరిచిపోకు! కృష్ణను నువ్వే పంపించావని కుసుమకు తెలిస్తే కృష్ణను చేసుకుంటుందా? నాకు చదువబ్బలేదు. కానీ, అందం ఉంది, పశ్చాత్తాపం నటించి లెంపలేసుకుంటే కుసుమ కరిగి పోతుంది.

వీణా:—ఈ మాటలన్నీ నేను కుసుమకు చెపితే.

చిట్టి:—నీపని మరింత తేలికవుతుంది. నీమీదున్న విపరీతమైన ద్వేషంతో నువ్వు చెప్పిన దానికి సరిగ్గా వ్యతిరేకంగా ప్రవర్తిస్తుంది కుసుమ—నువ్వు తన మేలుకోరే దానివని ఒక్కనాటికీ నమ్మదు.

వీణా:—ఒక్క వారం రోజులాగు. నువ్వు కోరిన డబ్బు ఇయ్యటానికి ప్రయత్నిస్తాను.

చిట్టి:—సరే! ఒక్కమాట! ఈ విషయం మా రఘు బాబాయ్‌కి చెప్పావా,—ఆ డబ్బు తీసుకోను....కుసుమను.

వీణా:—చెప్పను.

* * *

(వీణాధరి ఇల్లు)

వీణా—రఘూ! నాకొక్క సహాయం చెయ్యగలవా?

రఘు:—నేను చెయ్యగలిగింది నీకోసం ఏదైనా చేస్తాను.

వీణా:—నాకు అర్జంటుగా యాభై వేల రూపాయలు కావాలి.

రఘు:—(దిగ్భ్రాంతితో) వీణా! అంత డబ్బు? ఎందుకు?

వీణా:—ఎందుకో చెప్పలేను, కానీ, అత్యవసరంగా కావాలి.

రఘు:—నాదగ్గిర మాత్రం అంత డబ్బు సిద్ధంగా ఉంటుందా?

వీణా:—రఘూ! ఎలాగైనా నువ్వా డబ్బు సర్దాలి! లేకపోతే....

రఘు:—లేకపోతే........?

వీణా:—నేనేం చేస్తానో నాకే తెలియదు.

రఘు:—వివరంగా చెప్పు వీణా.

వీణా:—అన్ని విషయాలూ ఒకేసారి వివరంగా చెప్పి నాబరువు




దించుకుంటాను రఘూ! అంతవరకు నన్నేం ప్రశ్నించకు. ఈ డబ్బు సర్దలేవా? ఈ బాకీ ఎలాగైనా తీరుస్తాను. బ్రతికున్నా, చచ్చిపోయినా నీ డబ్బు నీకొస్తుంది. నా ఇన్స్యూరెన్స్ పాలసీ ఉంది....

రఘు:—బ్రతికున్నా, చచ్చిపోయినా....ఇన్స్యూరెన్స్ పాలసీ.... ఏవిటిదంతా వీణా?

వీణా:—రఘూ! డబ్బు ఇయ్యగలవా? లేదా?

రఘు:—ఇస్తాను. నా ఇల్లు అమ్మేసి అయినా ఇస్తాను. కానీ, వీణా! నువ్వెలాంటి అఘాయిత్యాలూ తలపెట్టనని మాటియ్యి.

వీణా:—ప్రతి క్షణమూ మానసికంగా మరణయాతనను మించిన నరకం అనుభవిస్తూ బ్రతకటం కంటె ఒక్కసారి చచ్చిపోవటం సుఖం కదూ! ఆ శుభ ముహూర్తం కోసం ఎంత ఆత్రుతతో ఎదురు చూస్తున్నానో, నీకేం తెలుసు?

రఘు:—అలా మాట్లాడకు వీణా! నా వళ్లు జలదరిస్తోంది, ఎలాంటి అఘాయిత్యమూ తలపెట్టనని నా చేతిలో చెయ్యివెయ్యి. ప్లీజ్! (రఘు చెయ్యి జాపుతాడు. వీణాధరి కన్నీళ్ళతో ఆ చేతి వంక చూస్తుంది. రఘు తనే వీణాధరి చేతిని తన చేతిలోకి తీసుకుంటాడు.)

* * *

(రఘు ఇల్లు)

రఘు:—కమలా! అర్జంటుగా నాకు యాభై వేలు కావాలి.

కమల:—అంత డబ్బు ఎందుకు?

రఘు:—కావాలి!

కమల:—నాకు చెప్పకూడని కారణమా?

రఘు:—అసలైన కారణం నాకు తెలియదు.

కమల:—మీకు డబ్బు ఎందుకు కావాలో మీకే తెలియదా?

రఘు:—ప్లీజ్! కమలా! ఇలాంటి ప్రశ్నలడగకు. డబ్బు అవసరం. బేంక్‌లో అయిదువేలకంటె లేదు. ఇల్లు అమ్మెయ్యాలనుకుంటు న్నాను.

కమల:—ఇల్లు అమ్మతారా? ఎంత శ్రమపడి కట్టుకున్నాం. ఈ ఇల్లు? మళ్ళీ కట్టుకోగలమా?

రఘు:—నాకూ కష్టంగానే ఉంది కమలా! కానీ, అవసరం తప్పదు.

కమల:—అంత తప్పనిసరి అవసరమయితే నా నగలు తీసికెళ్ళండి. ఒక్కర్తే కూతురునని నాన్నగారు నాకు చాలా నగలు చేయించారు.

రఘు:—కమలా, నీ నగలు తీసుకోమంటావా? వద్దు. ఆ పని చెయ్య లేను.

కమల:—డబ్బు అవసరమంటున్నారుగా!

రఘు:—ఇల్లు నా సంపాదనతో కట్టించాను. అది అమ్ముతాను. కానీ, నీ నగలు....

కమల:—(ఏడుస్తూ) మీ రెండ డబ్బైనా ఖర్చుపెట్టండి. ఏదైనా చెయ్యండి. నేనేం మాట్లాడను. ఎందుకనైనా అడగను. కానీ, "నీ, నా" అని వేరుగా మాట్లాడకండి. అదిమాత్రం భరించ లేను. నగలూ, ఇల్లూ అన్నీ ఒకటే! ఎలా అయినా నష్టపోయేది మనమే!

రఘు:—(బాధగా) ఏడవకు కమలా! ఈ డబ్బు అప్పుగా ఇస్తు న్నాను. మళ్ళీ వస్తుంది.

కమల:—(కళ్ళు తుడుచుకుని పేలవంగా నవ్వుతూ) వస్తే మంచిదే! మన బాబు సుఖపడతాడు. రాకపోయినా పరవాలేదు. మనం మరింత కష్టపడి నెమ్మదిగా కూడబెట్టుకుందాం, బాబుకోసం....

రఘు:—బాబు! బాబుకి అన్యాయం చేస్తున్నానా?

కమల:—మనం ఒక్క మాటమీద నిలవగలిగినంతవరకూ బాబు కే అన్యాయమూ జరగదు. ఈ నగలు తీసికెళ్ళండి.

రఘు:—కమలా!

కమల:—సంకోచించకండి, నగలున్నది. ఇలాటి అవసరాలకు ఆదు కోవటానికే

* * *

(వీణాధరి ఇల్లు)

వీణా:—రఘూ! ఇదేమిటీ? ఈ నగలన్నీ ఎందుకు తీసుకొచ్చావ్? నగలకోసం ఆశపడే ఆడదానిలా కనిపిస్తున్నానా నేను?

రఘు:—వీణా! నువ్వెలా కనిపిస్తున్నావో ఏమని చెప్పను? ఎప్పటికీ నిన్ను అర్థం చేసుకోలేక పోతున్నాను.

వీణా:—రఘూ! ఈ నగలు కమల కిచ్చెయ్యి. ఇవి నేను అలంక రించుకో గలననే అనుకున్నావా?

రఘు:—అలంకరించుకోలేకపోయినా, అమ్మి డబ్బు చేసుకోగలవు. డబ్బు కావాలన్నావు కదా!

వీణా:—రఘూ! కమల నగలు అమ్మితేకాని నీ దగ్గిర డబ్బులేదా?

రఘు:—నగలైనా అమ్మాలి. ఇల్లయినా అమ్మాలి. కమల ఇల్లు అమ్మటానికి వీల్లేదంది.

వీణా:—కమల నగలు నాకు అక్కర్లేదు రఘూ! మరే విధంగానూ ఇయ్యలేవా?

రఘు:—వీణా! కమలా, నేనూ భార్యాభర్తలం. నా సంపాదనమీద కమలకూ అధికారం వుంది. కమల నగలమీద నాకూ అధికారం వుంది. తీసుకో!

వీణా:—వద్దు. ఇవి తీసికెళ్ళిపో! ఈ నగలు ముట్టుకోలేను.

రఘు:—మరి, నీకు డబ్బెలా వస్తుంది?

వీణా:—ఏదో ఒక ఉపాయం ఆలోచిస్తాను.

రఘు:—(భయంగా) వీణా!

వీణా:—భయపడకు రఘూ! కుసుమ పెళ్ళి అయ్యేవరకూ చచ్చి పోయే అధికారం నాకు లేదు.

* * *

(కుసుమ మేడ.)

కుసుమ:—నువ్వు చెప్పేది నిజమేనా? కృష్ణను నా దగ్గిరకు వీణాధరి పంపించిందా?

చిట్టి:—నా చెవులారా ఆ అక్కా-తమ్ముళ్ళ సంభాషణ విన్నాను. నిన్ను పెళ్ళి చేసుకోమని తమ్ముణ్ణి బ్రతిమాలుతోంది.

కుసుమ:—నీకు నా కృతజ్ఞతలు ఎలా చెప్పుకోవాలో అర్థం కావటం లేదు.

చిట్టి:—ఇహిహి! దానిదేముంది? వాళ్ల మోసం తెలిసింది అంతే చాలు!

కుసుమ:—తెలిసింది వాళ్ళ మోసం కాదు. ఔన్నత్యం.

చిట్టి:—వాట్?

కుసుమ:—వీణాధరి నా కెప్పటికీ అర్థం కాదు. మొదట ఆమెను ఎంతో అభిమానించాను. ఇప్పటికీ ఆవిడను చూడగానే నా మన సులో అభిమానమూ, ద్వేషమూ ఒక్కసారిగా పొంగుతాయి. నువ్వు ఈ విషయాలన్నీ నాకు చెప్పకపోతే, వీణాధరికి నామీద ఇంత అభిమానముందని నాకు తెలిసేదికాదు.

చిట్టి:—వీణాధరికి నీమీద అభిమానమా?

కుసుమ:—నా దగ్గిర ఇప్పుడు డబ్బేమీ లేదు. అదంతా ఖర్చుచేసి ఆశ్రమం స్థాపించాను. ఇందుకు ప్రోత్సహించినవాడు కృష్ణ. వీణాధరి డబ్బుకోసం కృష్ణను నా దగ్గిరకు పంపిన మాట నిజ మయితే, కృష్ణ ఒక్కనాటికీ ఇలా ప్రవర్తించడు. బహుశః ఆ ఆశ్రమం సంగతి కృష్ణ వీణాధరికి చెప్పలేదేమో! నన్ను చేసుకో మని కృష్ణను బ్రతిమాలుతోంది వీణాధరి. నేనంటే ఎంత అభి మానం? ఏ అక్క తన తమ్ముడికి కుంటి భార్యను కోరు కుంటుంది?

చిట్టి:—ఇప్పుడు నీ దగ్గిర డబ్బేమీ లేవా!

కుసుమ:—ఏం లేదు. పాపం. ఈ సంగతి తెలిస్తే శ్రమపడి ఇంత దూరం వచ్చి ఈ సంగతులన్నీ చెప్పేవాడివి కావు. ఐ పిటీ యూ....

(పకపక నవ్వుతుంది. చిట్టి ముఖం పాలిపోతుంది.)

## 11

[రఘు ఇల్లు]

(చిట్టి ఫిట్స్‌తో కొట్టుకుంటూ ఉంటాడు. కేశవరావుగారు పరీక్షిస్తూ ఉంటారు.)

కేశ:—రఘూ! ఇతనికి ఫిట్స్ ఎంతకాలంగా వస్తున్నాయి?

రఘు:—చిన్నతనంలో ఒకసారి వచ్చాయి. అయిదు సంవత్సరాల క్రిందట ఒకసారి వచ్చాయి

కేశ!—హాస్పిటల్లో జాయిన్ చేయించు. మీ అన్నగారికీ, వదినగారికీ టెలిగ్రాం ఇప్పించు. ఈ ఫిట్స్ ఎందుకొస్తున్నాయో, టెస్ట్ చేద్దాం!

* * *

[హాస్పిటల్]

(చిట్టి బెడ్ దగ్గిర వీణాధరి, సుందరమ్మ ఉంటారు. గోపాలరావు బయట అశాంతిగా పచార్లు చేస్తూ ఉంటాడు.)

సుంద:—నువ్వింత మంచిదానివని అనుకోలేదు, రాత్రింబగళ్ళు మా చిట్టిని కనిపెట్టి చూస్తున్నావు.

వీణా:—నేను మంచిదానినని పొరపాటున కూడా అనుకోకండి! నేను చాలా చెడ్డదానిని.

సుంద:—రోగిష్టి దానిని. మేలుకో లేకుండా ఉన్నాను, ఒక్క అయిదు నిమిషాలు అలా నడుం వాలుస్తాను. అవసర మయితే లేపు.

వీణా:—మీకు ఆరోగ్యం సరిగా లేదా? ఏం?

సుంద:—ఏమిటో, ఎంతతిన్నా తిన్నట్లే వుండదు ఎందుకో దిగులు! గుండెదడ!....ఇంకా....

వీణా:—సరే లెండి! పడుకోండి!

సుంద:—ఒక్క అయిదు నిముషాలు....అవసరమయితే లేపు.

వీణా:—అలాగే!

(గడియారపు ముళ్ళు తిరుగుతాయి. తెల్లవారుతుంది.)


చిట్టి:—వీణాధరీ!

వీణా:—ఏం కావాలి చిట్టీ?

చిట్టి:—రాత్రంతా నువ్వు నా దగ్గిరే వున్నావా?

వీణా:—అది నా డ్యూటీ!

చిట్టి:—నీకు హార్ట్ ఎటాక్ వచ్చినప్పటి నుండీ కేశవరావుగారు నైట్ డ్యూటీ ఇవ్వటంలేదని నాకు తెలుసు.




వీణా:—ముఖం కడుక్కుంటావా?

చిట్టి:—కడుక్కుంటాను........

(వీణాధరి సహాయంతో చిట్టి ముఖం కడుక్కుంటాడు. వీణాధరి బ్రెడ్, కాఫీ, అందిస్తుంది. సుందరమ్మ లేస్తుంది.)

సుంద:—వీణాధరీ! ఇంక నువ్వు కాసేపు పడుకో! నేను చిట్టి దగ్గిరుంటాను.

వీణా:—మీరు అయిదు నిమిషాలు పడుకుని లేచేసరికి తెల్లవారి పోయింది. ఇంటికెళ్ళి కాఫీ అదీ త్రాగండి.

సుంద:—అయ్యో! అప్పుడే తెల్లారి పోయిందా? అయితే యింటికెళ్ళి ముఖం కడుక్కొస్తాను. పాచి ముఖంతో ఉండాలంటే నాకు చిరాకు. నే వచ్చాక నువ్వు వెళ్దువుగాని.

వీణా:—అలాగే!

(సుందరమ్మ వెళ్ళి పోతుంది. చిట్టి తదేకంగా వీణాధరి ముఖంలోకి చూస్తూ ఉంటాడు.)

వీణా:—ఏం చూస్తున్నావు?

చిట్టి:—నీకు నా మీద యేమీ ప్రేమ లేదనీ, ఊరికే నాటకమాడావనీ అనుకున్నాను.

వీణా:—నువ్వు అనుకున్నది అక్షరాలా నిజం!

చిట్టి:—నేను నమ్మను. ప్రేమలేని వాళ్ళు కన్నతల్లికంటే ఎక్కువగా ఇలా సేవ చెయ్యరు.

వీణా:—..............

చిట్టి:—చెప్పు.

వీణా:—ఏం చెప్పను?

చిట్టి:—నీకు నా మీద ప్రేమ ఉంది కదూ!

వీణా:—ఉంది.

చిట్టి:—నిజంగానా?

వీణా :—నువ్వు రఘు అన్న కొడుకువి. అందుకే నేనూ నిన్ను నా బిడ్డలా ప్రేమిస్తున్నాను.

చిట్టి :—(ఆశ్చర్యంగా) వీణా!

వీణా:—ఆ మాత్రం అర్థం చేసుకోలేవా చిట్టీ!

*   *   *

(రాత్రి సమయం)

సుంద :—ఒక్క అయిదు నిముషాలు ఊరికే నడుం వాలుస్తాను. రోగిష్టిదాన్ని........

వీణా:—అలాగే పడుకోండి. నేనున్నాను. మీరు కంగారు పడకండి.

సుంద :—నిజంగా నీ ఋణం ఈ జన్మలో తీర్చుకోలేను. చిట్టిని రాత్రింబగళ్ళు కనిపెట్టి ఉంటున్నావు. (ఆగిపోయి) అన్నట్లు.... నువ్వు మా చిట్టిని పెళ్ళి చేసుకోవు కదూ!

వీణా:—(విరగబడి నవ్వుతుంది.) చేసుకోను. ఎంతమాత్రం చేసుకోను. మీరు నిశ్చింతగా నిద్రపొండి.

సుంద:—నిద్ర ఎలా పడుతుందిలే! కలతనిద్ర! వెధవ రోగం! మేలుకుంటే పడదు. ఒక్క అయిదు నిముషాలు....

*   *   *

[హాస్పిటల్]

కేశవ!—రఘూ! ఇతనికి బ్రెయిన్‌లో ట్యూమర్ వుంది. ఆపరేషన్ చేస్తే ఫిట్స్ తగ్గి పోవచ్చు. ఎక్స్‌రేఫోటోలు చూడు!

రఘు:—ఆపరేషన్ చెయ్యటమే మంచిది.

కేశవ:—మీ వదిన వప్పుకోదేమో!

రఘు:—నేను నచ్చ జెపుతాను.

*   *   *

సుంద!—హమ్మో! నాకు కాళ్లూ చేతులు ఆడటంలేదు. ఏడుకొండల వాడా! వేంకటా రమణా! ఈ గండం గడిచి నా బిడ్డ బయట పడితే నీ కొండ కొస్తాం.

వీణా:—కంగారు పడకండి. కేశవరావుగారు, రఘు, ఇద్దరూ సమర్థులయిన డాక్టర్లు—మీ చిట్టి కేంభయం లేదు. ఫిట్స్ తగ్గిపోతాయి.

కేశవ:—పేషెంట్‌ను రెడీ చేసారా?

ఒక నర్స్:—రెడీ సార్....

ఒక డాక్టర్:—డాక్టర్ రఘూ! అర్జంటుగా ఒక పేషంటుకు ఆపరేషన్ చెయ్యాలి. లేకపోతే కళ్లుపోయే ప్రమాదం వుంది.

రఘు:—చిట్టికి ఆపరేషన్.

డాక్టర్:—మీరు ఐస్పెషలిస్ట్. మీరు తప్ప ఈ ఆపరేషన్ మరొకరు చెయ్యలేరు.

కేశ:—రఘూ! మనచేతులతో వున్నంతవరకూ రోగిని సర్వ విధాలా కాపాడటం డాక్టర్లుగా మన విధి. వెంటనే ఆ కంటి ఆపరేషన్ చూడు. చిట్టి కేంభయంలేదు. నేనున్నాను.

రఘు:—మీ చేతులలో వున్నరోగి యముణ్ణికూడా జయిస్తాడు! నేను వెళ్తున్నాను.

*   *   *

[గడియారపు ముళ్ళు తిరుగుతుంటాయి]

(చిట్టిని స్ట్రెచర్‌మీద పడుకోబెట్టి తీసుకొస్తారు. బెడ్‌మీద పడుకోబెట్టారు.)

కేశ:—నర్స్! పేషెంట్‌కి ఏన్టీ బయాటిక్స్ ఇంజక్షన్ ఇయ్యి.

వీణా:—ఏది ఇయ్యమంటారు?

కేశ:—ఏదో ఒకటి.

(వెళ్లిపోతాడు. వీణాధరి కేస్‌షీట్ చూస్తుంది. కొంచెం సేపు అయోమయంగా ఆలోచించి చివరకు ఇంజక్షన్ అలాగే పుచ్చుకుని వార్డుబయటి కొస్తుంది.)

గోపా:—అదేవిటీ? అలా వున్నారేం? ముఖం పాలిపోయింది. పెదవులు వణుకుతున్నాయి. ఏం జరిగింది?

వీణా:—(కంగారుగా) ఏంలేదు. ఏంలేదు.

(వార్డులోపలి కొస్తుంది, ఇంజక్షన్ చేస్తుంది. ఆలోచిస్తూ నిలబడి పోతుంది.)

*   *   *

(గడియారపు ముళ్లు తిరుగుతుంటాయి. రఘు, మరొక డాక్టర్ వస్తారు.)

రఘు:—వదినా! భయపడకు. చిట్టికేం పరవాలేదు.

(వంగి చిట్టిని చూసి బొమ్మలా నిలిచిపోతాడు.)

డాక్టర్ :—డాక్టర్ రఘూ! పేషంట్........

మరొక డాక్టర్ :—డెడ్! ఇంపాసిబుల్! నర్స్! ఇతనికి నువ్వు ఏ యింజక్షన్ యిచ్చావు?

(వీణాధరి పాలిపోయిన ముఖంతో చూస్తుంది. మాట్లాడదు.)

డాక్టర్ :—(గద్దిస్తూ) మాట్లాడవేం?

సుంద :—ఓయ్ దేవుడోయ్! నా బిడ్డకు నూరేళ్ళు నిండాయా. ఆపరేషన్ వద్దని నేను మొత్తుకుంటూనే వున్నాను. నాయనోయ్! ఆ రఘు నా పీకలమీదకు తెచ్చాడు తండ్రోయ్!

డాక్టర్:—నర్స్! చెప్పు! ఏ యింజక్షన్ చేశావు? షీట్‌లో లేకుండా నువ్వు యింజక్షన్ యెలా చేశావు?

గోపా :—ఈవిడ సిరంజి చేత్తో పుచ్చుకుని బయటి కొచ్చింది. ముఖం పాలిపోయింది. ఎందుకో చుట్టూ చూసింది. నా కొడుక్కు ఏదో ఇచ్చింది.

సుంద :—ఓసి పాపిష్టిదానా! ఇందుకా అంత ప్రేమ ఒలకబోశావు? ఇదేం పొయ్యేకాలమే! నా బిడ్డ నీకేం అపకారం చేసాడే! నీ అమ్మ కడుపు మాడ! నా కెక్కడ దాపురించావే!

డాక్టర్ :—నర్స్! ఇతనిమీద మీకు కక్ష ఉందా? ఉన్నా, నర్స్ వృత్తిలో ఉంటూ యింత ఘోరంగా........

(వీణాధరి స్పృహతప్పి పడిపోబోతుంది. రఘు ఒక్క అంగలో వచ్చివీణాధరి పడకుండా పట్టుకుంటాడు. ఏదేదో మాట్లాడుతున్న అందరినోళ్ళు ఒక్కసారి ఆశ్చర్యంగా తెరుచుకుంటాయి.)

## 12

(వీణాధరి ఇల్లు)

రఘు:—వీణా! చిట్టి నా అన్నకొడుకు! నువ్వు ఇంత నిర్దాక్షిణ్యంగా వాడిని....

వీణా:—(పాలిపోయిన ముఖంతో) రఘూ!

(రఘు వీణాధరి దగ్గిరగా వచ్చి భుజాలమీద చేతులేస్తాడు)

రఘు:—చెప్పు వీణా! చిట్టిని నువ్వు చంపలేదని చెప్పు. ఒక్కసారి చెప్పు.

వీణా:—లేదు రఘూ! చిట్టికి నేనే పాయిజనూ ఇవ్వలేదు. నిజం! నన్ను నమ్మలేవా?

రఘు:—నమ్ముతాను. నిన్ను నమ్మకుండా ఉండ గలిగేశక్తి నాకు లేదు. నీకేం భయం లేదు వీణా! మొత్తం ప్రపంచాన్నే ఎదిరించి నిన్ను కాపాడతాను.

* * *

(రఘు ఇల్లు)

గోపా:—రఘూ! అన్న వదినెల కంటె—అన్న కొడుకుకంటే ఆ వీణాధరి ఎక్కువయిందా నీకు?

సుంద:—ఆ మహమ్మారి ఇంకా ఎందరిని పొట్ట బెట్టుకోవాలని కాపాడతానంటున్నావు?

డాక్టర్లు:—(1) డాక్టర్ రఘూ! తోటి డాక్టర్‌కు వ్యతిరేకంగా ఒక నర్స్‌ను సమర్థిస్తున్నారా మీరు?

(2) ఆయన మీ మామగారు. ప్రపంచ ప్రఖ్యాతి పొందిన సర్జన్.

(3) డాక్టర్ రఘూ! మీ ఆరోపణను ఋజువు చెయ్యలేరు. లోక మంతా మిమ్మల్ని చూసి నవ్వుతుంది. మీ కెరియర్ నాశన మవుతుంది.

(రఘు ఏం మాట్లాడలేక దిగ్గునలేచి లోపలికొస్తాడు. కమల ఎదురవుతుంది. కమల ముఖం చూడలేక తలవాల్చేసుకుంటాడు)

కమల:—కొంచెంసేపు అలా వాలు కుర్చీలో కూర్చోండి. లోకంలో అలసట అంతా మీ ముఖంలోనే ఉంది.

రఘు:—పరవాలేదు.


కమల:— పరవా మీకు లేకపోయినా నాకుంది.

(బలవంతాన రఘును వాలు కుర్చీలో కూర్చోబెడుతుంది.)

కమల:—నాన్నగారు మిమ్మల్ని మొదటినుండీ కన్న కొడుకులా అభిమానించారు.

రఘు:—.... .......

కమల:—మిమ్మల్ని అనేక విధాల ప్రోత్సహించారు. ఈనాటి మన




అభివృద్ధికి మానాన్నగారే కారకులు.

రఘు:—.........

కమల:—పేరు పొందిన డాక్టర్లుకూడా నాన్నగారి సలహా తీసుకోవటం మీకు తెలుసును. ఆయన జీవితంలో అన్నింటి కంటె తన వైద్య వృత్తి ప్రధానం. తన ట్రీట్‌మెంట్‌లో ఉన్న రోగి గర్భశత్రువైనా సరే, ప్రతిభనంతా ఉపయోగించి కాపాడతారు.

రఘు:—ఇవన్నీ నాకు తెలియని సంగతులా కమలా?

కమల:—తెలిసి.... తెలిసి.

రఘు:—వీణాధరి ఏ పొరపాటూ చెయ్యలేదు.

కమల:—ఏమిటా నమ్మకం?

రఘు:—వీణాధరి నాతో అబద్ధమాడదు.

కమల:—బంధువు, ఆత్మీయుడు, గురుతుల్యుడు, మహామేధావి, సమర్థుడు, అయిన మా నాన్నగారిలో లేని నమ్మకం ఒక నర్స్ మాటలో ఉందా మీకు?

రఘు:—వీణాధరి మాటలో నాకా నమ్మకం ఉంది. తనను కాపాడటం నావిధి.

కమల:—విధి! మీ భార్య బిడ్డలను కాపాడటం మీ విధి కాదా? మీ వృత్తి గౌరవాన్ని అప్రతిష్టనుండి కాపాడటం మీ విధి కాదా?

రఘు:—కమలా! ఏదెలా జరిగినా నేను వీణాధరిని కాపాడి తీరతాను.

* * *

(వీణాధరి ఇల్లు)

వీణా:—కమలా!

కమల:—నేనెందు కొచ్చానో మీరు ఊహించి ఉంటారు.

వీణా:—.........

కమల :—మిమ్మల్ని నిర్దోషిగా ఆయన రుజువు చెయ్యలేరు. నాన్నగారిని దోషిగా ఎవరూ ఊహించలేరు.

కమల:—కానీ, దీని ఫలితం తెలుసునా? ఆయనకు డాక్టర్‌గా గౌరవం

నశిస్తుంది. కుటుంబ ప్రతిష్ట బజారు పాలవుతుంది. ఆయన మళ్లీ ఈ ఊళ్ళో డాక్టర్‌గా బ్రతకలేరు.

వీణా:—అబ్బా!

కమల :—మీకు ఆయనతోడి అనుబంధంలో ఆనందం మాత్రమే ప్రధానం, కానీ, నాకు....

వీణా :—కమలా !....

కమల :—ఆవేశ పడకండి. మిమ్మల్ని తేలిక పరచటంలేదు. మీరు లేకిమనుష్యులనుకొంటే ఇక్కడకు రాకనే పోదును. నాకు మీరంటే ఎంత ఈర్ష్య ఉందో, అంత గౌరవం ఉంది. మీ కారణంగా నా మనసులో ఎంత ఆవేదన రగులుతోందో, అంతగా నా మనసు మీపట్ల జాలితో కరిగిపోతుంది. మీరు కూడా ఆయనను నాలాగే ప్రేమిస్తున్నారని నమ్మబట్టే ధైర్యంగా మీ దగ్గిరకు వచ్చాను.

వీణా :—ఏం చెయ్యమంటారు నన్ను ?

కమల :—ఆయనను ఈ పరిస్థితిలో నుంచి తప్పించటానికి నేనైతే ఏమైనా చేస్తాను, ఎన్ని అబద్ధాలైనా ఆడతాను. ప్రాణమైనా ఇస్తాను.

వీణా :—మీరు అదృష్టవంతులు. మీ జీవితం సంపూర్ణంగా రఘు జీవితంతో విలీనమయిపోయింది గనుక ఏమైనా చెయ్యగలరు. కానీ, నా బ్రతుకులో మరో భాగం కూడా ఉంది. దురదృష్ట వశాన ఇప్పుడదే నాకు ప్రధానమయింది.

కమల :—వీణాధరీ ! ఇలా మాట్లాడటం మీకు న్యాయంకాదు. మీకేం కావాలన్నా ఇస్తాను, నా నగలన్నీ కావాలన్నా....

వీణా :—ఆ నగలు నేను కోరుకోక పోబట్టే మీ వంటిమీద ఉన్నాయి, నా కెందు కవి ?

కమల :—ఇంకేం కావాలో చెప్పండి. ఏం చెయ్యమన్నా చేస్తాను. మీరు మామూలు నర్స్ మీకు బాధ్యత తక్కువ, మీ అంతట మీరు నేరం వప్పుకుంటే అంతగా శిక్ష పడదు.

వీణా :—చెయ్యని నేరం వప్పుకోమంటారా ?

కమల :—ఆ రోజు మీరూ సుందరమ్మా మాత్రమే ఉన్నారు చిట్టి దగ్గిర....

వీణా :—అవును.

కమల :—నాన్నగారు చిట్టిని చంపుతారా ? అసంభవం ఎలా పోయాడు ?

వీణా :— నాకేం తెలుసు ?

కమల :—మీకు హార్ట్ ఎటాక్ వచ్చిన ఆ రోజు గుర్తుందా? మిమ్మల్ని చీవాట్లు పెట్టాలని వచ్చారు నాన్నగారు? మీకు హార్ట్ ఎటాక్ రాగానే తనే స్వయంగా ఆయనను మీ దగ్గిరకి తీసు కొచ్చారు. నా మనసుకు క్షోభ కలుగుతుందనైనా ఆలోచించ లేదు. రోగి ప్రాణాలపై అంత శ్రద్ధ నాన్నగారికి ! పోనీ, మీకు ఏం తెలియదనే అనుకుందాం ! అయినా, ఆయన కోసం.... దోషం మీదేనని ఒప్పుకోలేరా ?

వీణా :—ప్రస్తుతం నిస్సహాయస్థితిలో ఉన్నానని చెప్పానుగదా ! అర్థం చేసుకోండి !

కమల :—అర్థం చేసుకున్నాను. భార్యా భర్తల మధ్య ప్రేమ ఉండొచ్చు. లేక పోవచ్చు. కానీ సామాజికమైన మరెన్నో బంధాలు వాళ్ళను పెనవేసి ఉంచుతాయి. ప్రియురాలికి ప్రేమ తప్ప మరేమీ ఉండదు. ప్రేమవల్ల కలిగే ఆనందం తప్ప మరేదీ అక్కర్లేదు. ఆయన అప్రతిష్టల పాలయితే ఆ క్షోభ నాకు, మీకేమీ నష్టంలేదు.

వీణా:—అవును. ప్రియురాలు ఎంత గాఢంగా ప్రేమించినా, తన స్వామి కీర్తిప్రతిష్టలలో కాని, సిరిసంపదలలో కాని, ఏ భాగమూ ఉండదు. అదంతా అతని గృహలక్ష్మిదే !

కమల:—మీరు ఆయనకోసం కొంత త్యాగం చెయ్యగలరనుకున్నాను. పొరపాటుగా అర్థం చేసుకున్నాను. వస్తాను.

వీణా:—పొరపాటుగానే అర్థం చేసుకుంటున్నారు, సరిగా అర్థం చేసుకునే రోజు రాకపోదు.

* * *

(హాస్పిటల్. వీణాధరిని చూడగానే రకరకాల వ్యాఖ్యానాలు.)

ఒకరు:—ఎంతైనా కట్టుకున్న దానికున్న అభిమానం పైదానికెందు కుంటుంది?

మరొకరు:—తన ఇంటికోసం, తన పిల్లలకోసం, ఆడది ఎంతైనా వదులుకుంటుంది.

మరొకరు:—ఆ ఇల్లూ, పిల్లలూ లేని పై ఆడది ఎంతైనా వడు క్కుంటుంది.

మరొకరు:—వ్యామోహంతో కళ్ళు మూసుకుపోవటమంటే ఇదే ! నర్సమ్మ పెద్ద డాక్టర్‌కంటే పెద్దయి కూర్చుంది.

మరొకరు:—ఉంటారయ్యా, ఇలాంటివాళ్ళు! ఎంతకైనా తెగించి డాక్టర్ రఘు ఈవిడని సమర్థిస్తున్నాడంటే చూసుకో....

(వీణాధరి అక్కడినుండి వెళ్ళిపోతుంది. అంతా విరగబడి నవ్వుతారు.)

* * *

(రఘు ఇల్లు.)

ఒక యువకుడు:—డాక్టర్ రఘూ! నేను చిట్టి స్నేహితుణ్ణి. మీకు కొన్ని విషయాలు చెప్పాలని వచ్చాను.

రఘు:—కూర్చోండి. చెప్పండి.

యువ:—చిట్టి కుసుమను పెళ్ళి చేసుకోవాలనుకున్నాడు. కానీ వీణా ధరి అతడిని ఆకర్షించింది.

రఘు:—నాకు తెలుసు.

యువ:—చిట్టి కుసుమను చేసుకోవటం వీణాధరికి ఇష్టంలేదు.

అందుకే చిట్టిని తన వలలో వేసుకుంది. వీణాధరికి హార్ట్ ఎటాక్ రావటంతో ఆవిడ ప్రేమిస్తున్నది మిమ్మల్నేనని చిట్టికి అర్థమయింది. కుసుమను చేసుకుంటానని వీణాధరికి చెప్పాడు. కుసుమ జోలికి పోకుండావుంటే యాభై వేలు యిస్తానంది వీణాధరి. ఇయ్యలేకపోయింది చివరకు....

రఘు:—(వణుకుతూ) ఇదంతా నిజమేనా?

యువ:—ఆవిడనే అడగండి.

*   *   *

(వీణాధరి ఇల్లు.)

రఘు:—వీణా! నువ్వింత నీచురాలివా? నన్నే మోసం చేస్తావా?

వీణా:—నిన్ను మోసం చేసానా?

రఘు:—నువ్వు నన్ను యాభై వేలు అడిగింది, చిట్టికియ్యడానికే కదూ!

వీణా:—అవును.

రఘు:—ఆనాటి కారు ఏక్సిడెంట్....అది ఏక్సిడెంట్ కాదు....

వీణా:—అవును....

రఘు:—దుర్మార్గురాలా! హంతకీ! నా అన్నకొడుకునే హత్య చేస్తావా?

వీణా:—నేను చిట్టిని హత్య చెయ్యలేదు.

రఘు:—నేను నమ్మను.

వీణా:—నీ యిష్టం.

రఘు:—నీ నేరం అతి తేలికగా ఋజువవుతుంది. నీకు కఠినశిక్ష పడేలా చేస్తాను.

వీణా:—(చిరునవ్వుతో) విష్ యు బెస్ట్ ఆఫ్ లక్.

రఘు:—వీణా! ఈ సందర్భంలో నాకు "లక్". నీకేమవుతుందో తెలుసునా?

వీణా:—తెలుసు. అదే కమలకూ, నాకూ తేడా? నీ శుభమే కమలకు శుభం. నీ దురదృష్టమే కమల దురదృష్టం. నాకు అలా కాదు. అయినా కమలలా నేనూ నీ శుభాన్నే కోరుకుంటాను....

(ఒక్కసారి వీణాధరి ముఖంలోకి చూపి గిరుక్కున తిరిగి వెళ్ళిపోతాడు.)

## 13


[రుక్మిణి ఇల్లు]

రుక్మిణి:—కుసుమా! ఈ పుస్తకం చూసావా? పది రూపాయలది చవగ్గా ఆరు రూపాయలకు కొన్నాను. నాలుగు రూపాయలు లాభం!

కుసుమ:—ఏం పుస్తకం అది?

రుక్మిణి:—ఏమో!

కుసుమ:—ఏ పుస్తకమో తెలియకుండా కొన్నారా? ఎందుకు




కొన్నట్లూ?

రుక్మిణి:—చవగ్గా వచ్చింది.

కుసుమ:—చవగ్గా వచ్చాయని అవసరం లేనివికూడా కొంటారా? భలే ఎకానమీ!

కృష్ణ:—(అప్పుడే బయటినుండి వస్తూ) నువ్వు ఇక్కడ వుంటావని ఊహించవలసింది. అనవసరంగా మీ ఇంటికి వెళ్ళివచ్చాను.

కుసుమ:—(సిగ్గుపడి) నేను మీకోసం రాలేదు. అత్తయ్యగారిని చూద్దామని వచ్చాను.

కృష్ణ:—నేనూ నీ కోసం మీ ఇంటికి వెళ్ళలేదు. అక్కడి ప్రకృతి దృశ్యాలు చూద్దామని వెళ్లాను.

(ఇద్దరూ ఒకరి ముఖం ఒకరు చూసుకుని పకాలున నవ్వుకుంటారు.)

కుసుమ:—కృష్ణా! నన్ను క్షమించు.

కృష్ణ:—ఈ మాటలే నేను అందామను కొంటున్నాను. కుసుమా! నీ ఇష్టప్రకారమే జరగనీ! అక్కయ్య మనపెళ్ళికి రాదు.

కుసుమ:—అలా వీల్లేదు. ఆవిడ ఆశీర్వాదంతోనే మన పెళ్ళి జరగాలి.

కృష్ణ:—కుసుమా! నాకెంత సంతోషంగా వుందో చెప్పలేను.

కుసుమ:—ఈ లోకంలో నేను కోరేది అదొక్కటే! మీ సంతోషం. అందులోనే నా సంతోషం ఉంది. రండి! మీ అక్కయ్యగారి దగ్గరకు వెళ్ళి వద్దాం!

(వీణాధరి ఇల్లు)

వీణా:—నాకు చాలా సంతృప్తిగా ఉంది. ఇంక నేను నిశ్చింతగా వెళ్ళిపోవచ్చు.

కృష్ణ:—నువ్వెక్కడికి వెళ్తావు అక్కయ్యా! మాతోనే ఉందువుగాని....

కుసుమ:—నిన్ను "అమ్మ" అని కాని "పిన్నీ" అని కాని పిలవ లేను కాని....

వీణా:—పిలిపించుకోవాలనే ఆశా పిలిపించుకొనే అర్హతా రెండూ లేవు నాకు—మీరిద్దరూ కలకాలం సుఖంగా ఉండండి అదొక్కటే నాకు కావలసింది.

కుసుమ:—నిన్ను నేనేవిధంగానూ కష్టపెట్టను.

వీణా:—పిచ్చితల్లీ! ఎవరినైనా కష్టపెట్ట గలిగే శక్తి నీకెక్కడి దమ్మా! ఇన్నాళ్ళూ నన్ను నేనే కష్టపెట్టుకున్నాను. ఇంక ఈ క్షోభపడలేను.

* * *

(రఘు ఇల్లు)

(రఘు వీణాధరిని చూడగానే ఆనందంతో రెండడుగులు ముందుకు వేసి హఠాత్తుగా ఆగిపోతాడు—ముఖంలో చిరునవ్వు మాయమయి కాఠిన్యం గూడు కట్టుకుంటుంది.)

రఘు:—ఏం ఇలా వచ్చావు?

వీణా:—'నా నేరాన్ని ఒప్పుకుంటున్నాను'-అని చెప్పటానికి వచ్చాను.

కమ:—(నిరసనగా) నేను ఎంత ప్రాధేయపడినా ఒప్పుకోలేదు ఆనాడు. ఈనాడు మీరేవచ్చి ఒప్పుకుంటున్నారు.

వీణా:—ఆనాటి పరిస్థితి వేరు.

కమల:—అవును. ఆనాడు ఈయన అందర్నీ ఎదిరించి మీకు అండగా నిలిచారు. ఇప్పుడు ఈయన కూడా నిజం తెలుసుకున్నారు.

వీణా:—అప్పటికి కుసుమ పెళ్ళి నిశ్చయం కాలేదు, అందుకే....

రఘు:—పచ్చి అబద్ధం! నిజం బయట పడుతుందని భయపడివచ్చావు.

వీణా:—అవును, భయపడే వచ్చాను. ఆ నిజం బయట పడటం ఎవరికీ మంచిది కాదు. రఘూ! మీ కోసం స్వీట్స్ తెచ్చాను.

కమల:—ఎందుకు? ఏం విశేషం?

వీణా:—ఇవాళ నా జీవితంలో అత్యంత ఆనందదాయకమయినరోజు.

కమల:—మీ పెళ్ళి జరిగిన రోజా?

వీణా:—మేం పెళ్ళి చేసుకుందాం అనుకున్నరోజు—ఆ రోజు సినిమాకు వెళ్ళాలనుకున్నాం. ఇద్దరి దగ్గిరా డబ్బులు లేకపోయాయి.

కమల:—ప్రభాకరరావుగారి దగ్గిర డబ్బులు లేవా?

వీణా:—సినిమాకు వెళ్ళలేకపోయాం. చివరకు హోటల్‌కువెళ్లి ఐస్‌క్రీం తిన్నాం. జన్మలో మర్చిపోలేను ఆరోజు.

(రఘు ముఖం తెల్లగా పాలిపోతుంది.)

రఘు:—వీణాధరీ! ఈ స్వీట్స్ తీసికెళ్ళిపో! నేను తీసికోలేను ఇవి!

వీణా:—ఏం రఘూ! వీటిలో విషం కలిపానని భయపడుతున్నావా?

రఘు:—వీణాధరీ? ఎదుటి వ్యక్తుల్ని ఎంతబాగా హింసించగలవు నువ్వు?

వీణా:—నా చివరి పరిహాసాన్ని క్షమించలేవా?

రఘు:—చివరి పరిహాసమా? వీణాధరీ! నువ్వు.

(వీణాధరి పకపక నవ్వుతుంది.)

వీణా:—నాకు కఠినశిక్ష వేయిస్తానని ప్రతిజ్ఞచేసావు. నేను చివరి పరిహాసం అనగానే అంత పాలిపోయావేం?

(రాజారావుగారు వస్తారు. కమలలేచి లోపలి కెళ్తుంది)

రాజా:—హలో! డాక్టర్ రఘూ! మీకు మా కుసుమ పెళ్ళి శుభలేఖ ఇవ్వటానికి వచ్చాను.

(శుభలేఖ అందిస్తాడు)

రఘు:—సంతోషం! మీరే నన్నమాట, పెళ్లిపెద్దలు!

రాజా:—అవును. పాపం, ప్రభాకరరావు లేడు, ఇద్దరం ఒక్క ప్రాణంలా మెలిగాం. అతని కూతురి పెళ్ళి నేను కాక ఎవరు జరిపిస్తారు? ఇదిగో, ఈవిడ దేనిలోనూ కల్పించుకోకుండా సన్యాసినిలా తయారయింది. (వీణాధరిని చూపి నవ్వుతాడు.)

రఘు:—ప్రభాకరరావుగారి మరణం తలుచుకుంటే చాలా బాధగా వుంటుంది.

రాజా:—నాకు ఆశ్చర్యంగాకూడా వుంటుంది.

రఘు:—అదేం?

రాజా:—ప్రభాకరరావుకు మొదటినుండీ కారు రేసెస్ అంటే చాలా పిచ్చి. కారు స్పీడ్‌గా నడపటం, స్పీడ్‌గా పోతున్న కారులోంచి క్రిందకు దుమకటం, అతను ప్రాక్టీస్ చేసాడు. ఎంత స్పీడ్‌గా పోయే కారులోంచయినా అతను దుమికి ప్రక్కవాళ్ళనుకూడా తప్పించగలడు. అలాంటివాడు ఏక్సిడెంట్‌లో ఎలా ప్రాణాలు పోగొట్టుకున్నాడో మరి; కర్మ! వస్తాను. రాత్రికే ముహూర్తం. మీ దంపతు లిద్దరూ తప్పకుండా రండి.

రఘు:—తప్పకుండా వస్తాము.

(రాజారావు వెళ్ళిపోతాడు)

రఘు:—(వీణాధరి ముఖంలోకి తదేకంగా చూస్తాడు) ఇప్పుడు నాకు అర్థమయింది.

వీణా:—ఏమిటి అర్థమయింది?

రఘు:—ప్రభాకరరావుగారు కారు లోంచి తప్పించుకోగలరని నీకూ తెలుసు.

వీణా:—అవును తెలుసు. అందుకే చివరి క్షణంలో హెచ్చరించి కారు కొండకు గుద్దేసాను. కానీ, ఆయన నన్నూ, కుసుమనూ బయటకు తోసేసి తను కారు ఆపటానికి ప్రయత్నించారు. ఆ ప్రయత్నంలో ప్రాణాలు పోగొట్టుకున్నారు.

రఘు:—ఎంత పని చేసావు వీణా! ఎందుకు చేసావు ఇలాంటి ఘోరం?

వీణా:—ఎందుకా? నేను తాళి కట్టిన భర్త తాకినా సహించలేని కులటని....మనసులో మూర్తిది తప్ప మరొకరి నీడను కూడా భరించలేని పతివ్రతని....రఘూ! జరిగినదానికి నేను ఎంతగా

కుమిలిపోతున్నానో వర్ణించలేను. ఆత్మహత్య చేసుకోవాలనే ఆలోచన నాకు మొదటనే కలిగి ఉంటే ఎంతో బాగుండేది. కానీ, ఆయన నన్ను దగ్గరకు తీసుకునేవరకూ ఆ స్పర్శనే నెంత మాత్రం భరించలేనని నాకు అర్ధం కాలేదు. ఇంటికి బయలుదేరాం! ఆయనతో కలిసి జీవితాంతమూ గడపబోయే ఇంటికి....భరించలేక పోయాను. బ్రతికున్నంతకాలమూ ఆ నరకం అనుభవించటం కంటె బ్రతుకు ముగించుకోవటం మేలనుకున్నాను. తెగించాను. కానీ అనుకోని విధంగా పరిణమించింది.

ఆ క్షణంలోనే నా నేరం ఒప్పుకుని శిక్ష అనుభవించే దాన్ని. కానీ కుసుమ బాధ్యత అడ్డుగా నిలిచింది. కుసుమ కుంటిది కావటానికి కారకురాలిని నేనే. అంచేత కుసుమ బ్రతుకు చక్కదిద్దవలసిన దానిని కూడా నేనే! అందుకే మనసులో ప్రతి క్షణమూ ఘోర నరకం అనుభవిస్తూ ఇన్నాళ్ళూ బ్రతికాను. ఇంక నిశ్చింతగా అన్ని శిక్షలూ అనుభవిస్తాను.

రఘు:—వద్దు! వీణాధరీ! జరిగిందేదో జరిగిపోయింది. ఇప్పుడా విషయాలన్నీ బయటపెట్టకు.

వీణా:—మానసికంగా నేను అనుభవిస్తున్న క్షోభ నువ్వు ఊహించలేవు రఘూ! అంతకంటే ఆ న్యాయస్థానం విధించే శిక్ష చాలా హాయిగా ఉంటుంది.

రఘు:—వీల్లేదు వీణా! నిన్ను వదులుకోలేను.

వీణా:—రఘూ! నువ్వు నా ఊపిరి, నా ప్రాణం, నా సర్వస్వం. అయినా నేను నీకేమీ కాను. మానవుడి సామాజిక జీవనానికి ప్రాథమిక చిహ్నం గృహం. గృహలక్ష్మిగా అతడి జీవితాన్ని పాలించే అధికారం అతని భార్యకు మాత్రమే ఉంది. కమల కంటె అన్ని విధాలా అధికురాలనయినా, కమల అదృష్టం నాకు ఈ జన్మలో రాదు. వెళ్ళనియ్యి....

(బాబును ఎత్తుకుని ముద్దుపెట్టుకుని వెళ్ళబోతుంది. రఘు వీణాధరి చెయ్యి పట్టుకుని ఆపుచేస్తాడు. ఆ చేతిని ముద్దుపెట్టుకుని చిరునవ్వుతో విడిపించుకుని వెళ్ళిపోతుంది. రఘు పిచ్చివాడిలా కూర్చుండి పోతాడు. కమల వస్తుంది.)

కమల:—అలా కూర్చున్నారేం? ఆవిడ వెళ్ళిపోయిందా? ఎంత ప్రయత్నించినా ఆవిడ ముందు కూర్చోలేకపోయాను. అసహ్యం వేసింది. వెళ్ళిపోయాను.


(రఘు కమలవంక ఆవేదనతో చూస్తాడు.)

రఘు:—ఇంక ఆ ప్రస్తావన వదిలెయ్యి కమలా?

(నౌకరు వస్తాడు.)

నౌక:—అమ్మా! మీ నాన్నగారు ఈ ఉత్తరం ఇయ్యమన్నారు.

(కమల అందుకుని చదువుతుంది. ముఖం పాలిపోతుంది. రఘు కమల చేతులలోంచి ఆ ఉత్తరం అందుకుని చదువుతాడు.)



"డాక్టర్ రఘూ!

వైద్య వృత్తిలో ప్రవేశించిన నాటినుండే నావృత్తి ధర్మాన్నే అన్నింటి కంటె ఎక్కువగా భావించాను. ఈనాడు ఈ క్షోభ భరించలేను. చిట్టి మరణానికి కారణం నేనే! ఎప్పుడూ యంత్రంలా పనిచేసే నేను చిట్టికి ఆపరేషన్ చేస్తున్న సమయంలో చాలా కాన్షస్‌గా ఫీలయ్యాను. ఆ రోగి నీ అన్న కొడుకనీ, ఆపరేషన్ అతి జాగ్రత్తగా చేయాలనీ పదే, పదే, గుర్తు రాసాగింది. యెన్నడూలేని నర్వస్‌నెస్ ఏదో వచ్చింది. ఆపరేషన్ చేస్తుండగానే బ్లడ్‌వెసల్ తెగిపోయింది. చిట్టి ఆపరేషన్ థియేటర్‌లోనే మరణించాడు. ఆ విషయం ఒప్పుకో లేకపోయాను. అసిస్టెంట్ డాక్టర్ విషయం తెలిసినా తెలియనట్లు ఊరుకున్నాడు. మామూలుగా కుట్టేసి బెడ్‌మీదకు చేర్చాం. వీణాధరి కంగారు బడటానికే, సిరంజితో బయటకువచ్చి నన్ను వెతుక్కోవటానికీ అదే కారణం.

విచారణ జరిగినా నన్ను నేను రక్షించుకోగల శక్తి నాకు ఉంది. అందుకు భయపడి ఈ నిజం వప్పుకోవటంలేదు. ఇంత ఘోరం నావల్ల జరిగాక ఇంక డాక్టర్‌గా నిలవలేను ఇప్పుడే నా రిజిగ్నేషన్ కూడా పంపుతున్నాను.

నీ

కేశవరావు.

**P. S** ఇంకమీద నేను డాక్టర్ కేశవరావును కాను."

(ఉత్తరం పూర్తిచేసి రఘు గబగబ వెళ్ళబోతాడు, కమల అడ్డుకుంటుంది.)

కమల:—యెక్కడికి? ఏం చేద్దామని?

(అయోమయంగా చూస్తాడు రఘు.]

కమల:—బాబు యెందుకో ఏడుస్తున్నాడు చూడండి....

(బాబును అందిస్తుంది. ఏడుస్తున్న బాబు తండ్రి ఎత్తుకోగానే ఏడుపుమాని బోసి నవ్వు నవ్వుతాడు. చెమ్మగిల్లిన కళ్ళను భారంగా మూసుకుని బాబుని హృదయానికి హత్తుకుంటాడు రఘు.)